2 దానవభంజనా-దీనజనావన।మానిసుపోషణా-మానితసుగుణా!శం
3 ఈశ । శ్రీభగవంత-దాససుపోషా।వాసవనుత! స-ర్వేశపరేశ!.శం.
(సూత్రధారుని పాటలకు సూచన లీయఁబడలేదు. [illegible] చూడుఁడు.)

7 [4] రుక్మాంగదుఁడు —*బేహాగ్ రాగము—ఆదితాళము*—

అందంబైనది సుమము । యే । మందును దీని సగసము
డెందంబున నా - నందంబును జెం - పొందఁజేయు నిది నిజము.
1 అందంబగు సకలందు-తళుక్కు-మ-సందగి యున్నది సుమము ।
సుందరయువతి యా-నందగు సతిశిర -మందిది నిల్చిన ఘనము. అం.

10 [5] —*ఖరహరప్రియరాగము—ఏకతాళము-త్రిశ్రజాతి.*—

(రుక్మాంగదుఁడు, సంధ్యావళి, సాహిత్యముమాత్రమే పాడవలెను.)

సాపపా - ధసా - నిదపా - పగా,, - మగరీ,,,,.
శ్రీకరా - శుభా - కఅరా - నమో,, - నఅమో,,,,.
1 దామ దామ దా మ దా - ధసా - సగరిసా । సాస స రి స -
నేర మేర బ్రోవ రా -కృపా- అఅకరా । ధీ ర యఘువి -
నీ ని నిసని - దాద పనిదపా । సా నీ దా నిదపా -
మార నిగమ - సార గఆఽరా । మారా కా అఅరా -
సా నీ దా నిదపా - సాస మగరిసా.
సా రా చా అఅరా - రార సుఖకరా.
2 పంత మింత సేయ మేర గాదురా । ఎంతయును భ-జింతును
భగ - వంత దాసనుత । శాం తా కా రా - చింత పేర్చి - సం
తస మిడరా. శ్రీకరా.

(ఇష్టమైనవార లీ యింగ్లీషుపాటను పైమట్టు ప్రకారమే పాడుకొనవచ్చును.)

సూత్ర— Bless our Society God! Creator!.
For your beloved look we always look -
clear the faults and-give us free thoughts in -
all that we enact- Almighty! and- Omnipresent!
all is this, we all now meant-make us all pleasant.
Bless.

11 [6] శుకయోగి. —*మాయామాళవగౌళ రాగము—ఏకతాళము*—

నారాయణా నారాయణా - నారాయణ శ్రీమన్నారాయణా.

1 ధనధాన్యంబులను - మఱి - దారసుతాదులను, ఘనముగఁ
గల్గినను - నిను - గనుదినమును మది నిల్పఁ జాలను, నారాయణా

16 [7] శుకయోగి. (పైపాటలోని చరణములే.)

నారాయణా నారాయణా - నారాయణ శ్రీమన్నారాయణా.

2 ఇడుములు కల్గునెడన్ - అనియుఁ బ - రీక్షకై యనుదినమెడన్
గడునిశ్చలత గుఱిన్ - దొలఁగక - కార్యసిద్ధినొందఁగా మేలగున్

3 ఎంతటి ఘనుఁడైనన్ - ధర - నీశ్వరుఁడే యైనన్
వంతలు తప్పవిలన్ - భగ - వంతుని దలఁచిన శాంతి లభించును. నా.

28 [8] నారదుఁడు.—*హనుమతోడి రాగము—ఏకతాళము-చతుశ్ర జాతి*—

శంకరా - రిపు - జాలభయంకరా.

పంకజాక్షు! భవ - పావనా శంకరా. శంకరా.

1 సుజన వినుత పద - సూరిజనాభయద। త్రిజగదభీష్టప్రదా -
శుభదా. శంకరా.

2 మదన దమన ఘనా-మానిత సుగుణా। మదగజ రిపువసనా -
మణా. శంకరా.

33 [9] నారదుఁడు. —*ధన్యాసి రాగము—ఆదితాళము*—

సర్వవ్యాపకుఁడైన యీశ్వరా - శరణు శరణు దేవా!
సర్వాధారుఁడు సర్వేశ్వరుఁడును - సర్వశక్తుఁడగుచు నీవె తండ్రీ. స.

1 తనదైవంబని పరదైవంబని - తగవులాట తగునే?
కనుగొన సర్వవ్యాపకుఁ డొక్కని -కంటె నుండనగునే? యీశ్వ. స.

34 [10] యముఁడు. —*ముఖారి రాగము—ఆదితాళము*—

ఔరా! యెంతవచ్చె। నా। యాశలెల్లఁ బోఁజొచ్చె. ఔర.

ఆ రాజేంద్రుని వ్రతమహిమను - నా రాజ్యంబిటు కాఁగల్గెను,
లేదా? నాకొక దరిఁజూపఁగ - ధీరాగ్రగణ్యులెవ్వరిలలో. ఔర.

1 అన్నా! యిప్పటివాఁడలె చను - చున్నా రట్టిపింత కల్గుట
యెన్నఁ డైన వీరలిలలో-కన్నారే? విన్నారే? తెల్పరే?. ఔరా.

35 [11] a —*ఖరహరప్రియరాగము—ఏకతాళము*—

యమ—సెబాసు! ధాత! చాలయా-మంచిఁ-జేసినాఁడ వింక నన్నుఁ
బంపుమీ । నోడ్డ । ప్రభునికిఁ నన్నొప్పజెప్పినాఁడ వహహా. సెబా.

బ్రహ్మ—ఆహా! యిదేమిశమనా?-యింత యాగడంబుఁ జెందనీకుఁ
దగునా? ఔరా । సాహసంబు లిట్టు నీవు చేయఁదగునా? ఆహా.

యమ—అతఁ డిట్లు వ్రత మొనర్చుటేమి? - దీని - చేతనాదు లోక
మిట్టు లౌటయేమీ?. సెబాసు.

బ్రహ్మ—(తలయూఁచి యూరకున్నాఁడు.)

యమ—చేతకాని వానిఁ బోలియుండనా? - దీని - చేతనాదు లోక
మింక నిల్వఁగల్గునా?. సెబాసు.

బ్రహ్మ—కీడు మేలు లేరికైనఁ గల్గవే? - వాని - కోడి యిట్లు బేలలగు
చుంటతగవే. ఆహా.

36 [11] b యముఁడు. -*మాళవగౌళరాగము—ఏకతాళము-చతురశ్రజాతి*-

ఏమియిట్టి రాజునుంచి ఫలము?-నా-కేమితోఁచదయ్యె దీనిగుణము ।
నీమనంబునందు దీని-కేమి యెంచినావో కాని । రామరామ నేను
పట్టి - రట్టుపాలు గాఁగనయ్యె. నేమి.
1 అతఁడిట్లు వ్రతమొనర్చుటేమి?-దీని-చేతనాదు లోకమిట్టులేమి?
చేత కానివానిఁబోలి- చేతులొగ్గి యుండఁజాల । ధాతనన్నుఁ బంపు
నీకుఁ- దండమయ్య చాలుఁజాలు. నేమి.

(ఈ 11 a b లలో నొకటిమాత్రము పాడినఁ జాలును.)

39 [12] యముఁడు.—*కాఫీరాగము — ఏకతాళము - చతురశ్రజాతి*—

1 ముల్లోకములకెల్ల-మూలమైనధాత । యల్లభూపుని సాధింపఁడే?
నా-యాసలెల్లఁ దీర్పఁడే?.

2 ఈతనిమాయచే-నాతండే గానిమ్ము । పాతాళ మంటఁద్రొక్కి- నే-
బహు - బాధలను బెట్టనే?.

3 కటకట యాతఁడు నా - కంటనే పడనిమ్మ । పెటపెటమనఁ జేల్చనా? - మఱి - పెక్కు వెతలఁ బెట్టనా?

41 [13] మోహిని. —*ఖమాచిరాగము—ఏకతాళము-త్రిశ్రజాతి*—

బళిబళి సుచరిత్రముల్-నీ-పలుకు లతి విచిత్రముల్ । ఇలనృపతు లనంగనె మా-నీంద్రులె జనకా? బళి.

1 సాంగఁడే? కలంగఁడే? రు-క్మాంగదుఁడనఁ ధీరుఁడే? అంగనల నెఱుంగని ఋష్య-శృంగుఁడె జనకా? బళి.

2 తుంటవిల్తుఁడల్పుఁడే? వె-న్నంటికేలి నల్పుఁడే । నాకంటఁబడిన యంత నీని - గర్వము౯ వదల్పుఁడే? బళి.

44 [14] కాఁపులు—*నాథనామక్రియరాగము—ఏకతాళము-త్రిశ్రజాతి*—

మా పాలియంకన్న శరణు । ఏ । పాప మెఱుఁగమిలను. మా.

1 కొబ్బరి కాయలు-కొల్లగ నీకిచ్చి గొబ్బున నెప్పుడు కొల్తుము దేవా । దబ్బునరమ్ము-దరిజేర్చు మమ్ము-నిబ్బర మిమ్ము-నీదే భారమ్ము. మా.

2 యేడు కొండలమీఁద-యెలసినదేవా । తోడు నీడ మాకు-దొర వీవ కావా । నేడిటు రావా? నెమ్మది నీవా? గోడు బాపవా? కోర్కె లీవా?. మా.

53 [15] మోహిని —*బేహాగ్ రాగము—త్రిపుటతాళము-చతురశ్రజాతి*—

ఎంతో సొంపైయున్నది - మది - కెంతో యింపైయున్నది. వసంత మనంత లతాంత సంతతుల. నెంతో.

1 చల్లగాలి వేగ - నల్లుకొని రాగ । ఉల్లము పొంగ జల్ ఝల్లు మనంగ హా. యెంతో.

2 కమ్మతేనె మెక్కి - నెమ్మిబోగరెక్కి । తుమ్మెదల తేఁడు ఝుం - ఝుమ్మనఁగ నేఁడు హా. యెంతో.

3 సంతసించి శుకము - పంతగించి పికము । కంతుఁడే యీడ భగ - వంతుఁడని పాడ హా. యెంతో.

54 [16] మోహిని —*సురటరాగము—ఆదితాళము*—

ధన్యుఁడనఁగ నతఁడే—జగంబున.

అన్యమెఱుంగక - యఖిల యువతీజన । మాన్యుఁడైన గుణ - మహి
తుఁ డొక్కఁడుఁడే. ధన్యు.

1 అల్లరిమారుని - యాలయుకలకుఁబడి - వెల్లవశఁక్రమై - జల్లనంగ ।
మల్లడిఁగొనియెడు - పల్లవపాణికాఁ । గిల్లలొనఁగిసుఖింప లభించిన.

2 మక్కువఁగలచెలి - మధుపులందిచ్చుచుఁ - బ్రక్కఁజేరియొకప
క్కమాటఁగా । గక్కునఁబైకొని - కౌఁగిటనలమి యా - చక్కని
మోవి చు - రుక్కున నొక్కిన. ధన్యు.

3 చెంతనిలుచుప్రియ - కాంతలఁజక్కిలి । గింతలవింతల నెంతో తే
ల్చి । కంతురాజ్యము - గ్గంతఁజూరఁగొను కాంతుఁడనఁగ భగ -
వంతుఁడే యనఁదగు. ధన్యు.

సా. నిదప - మపధపా - మగప మరి	రీ, సా, - నిస	రిమప- రీ, మ ప ని
తా, టముల - సురటిరో - బలుసొగస	టం, చుకా - మది	దెలిసి - ప్రే, మఁగొని
సా, రిరిస- నిరిసనిదప- మ ప ని స	రి సానిదప - ధప	,మగ రి -పమ రి -
పా, టలను- మదిగలిచెడి- యువతుల	ముడించెసగ - నెదం	,గదియు-సదయా-

రి స.

త్ముడే. ధన్యుఁడ.

56 [17] —*శంకరాభరణరాగము—ఆదితాళము.*—

రుక్మా—మానిని యెవ్వరవే? గుణ - మండిత! పేరదియే? యీ -
కానలఁబడి యను - మానములేక ప్ర - యాణమిదెప్పటికే?

మోహి—ఎవ్వరైననేల? పే - రెద్దియొనీకేల? - యిప్వనభూమిఁ
జ - రింపఁగఁదగదె యిఁ - కెవ్వరు నెవ్వోళ?

రుక్మా—వనితరో! పతియెవరే? నీ - జనకుండేఘనుఁడే? వినవేడుక
క - ల్గెనుదెల్పుము నా - మనవిని విని వేగ.

(ఈపాటకొలఁది ప్రసంగములో * ఈగుర్తువఱకును విడిచి వేయవలెను)

మోహి—జనకుఁడల విధాత; నిజేచ్ఛం - జనుఁడు సవివాహితి; ఆ
విధి - మనమునఁబుట్టి మో- హినియనఁబడితి; ఏ-మునిన నీకేల యిట?

58 [18] మోహిని. —*ధీరశంకరాభరణము— (ఫారసీమట్టు) ఆదితాళము*—

వింతవింత లాడితి - సంతసంబుఁ జూపితి । చెంతనప్పై చేరితి - చేయి బట్టవచ్చితి । తగుర! - తగుర? - పనులు - నగర? - ఔరా కన్నులు కానవా? । ఇనకులజుఁడవా? - యిచటఁ బ్రభుఁడవా? - యింతటి వాఁడవా? - మతిమఱచితివా? - మాతో నిటుఁ దగువా? - నాల్ నాల్ పో.

(తెనుఁగుపాటల నియమములు ఇట్టి ఫారసీమట్లయం దుండవు.)

59 [19] —*ధీరశంకరాభరణ రాగము—ఏకతాళము—త్రిశ్రజాతి*—

మోహి—చాలయ్య రాజేంద్ర చాలు - నీకథ - చాల్చాలుపోపోవయ్యా । మేలయ్యా! నీవెట్టి - మేలము లిటు నం - కేల చేసెదయ్యా?। యీ లీల లేదు మయ్య. చాలయ్య.

రుక్మాం—అక్కటకోమలియేలనన్నిటు - లాడఁజూచెదే? । ఎక్కువౌమనువారిఁజొక్కితినీకేలఁ - జిక్కితిఁగానఁగదే । నీకే । చిక్కితినేలఁగదే. అక్కట.

మోహి—నాకేలఁజిక్కఁగ - నీకేలయీ వెట్టి-పోకలుమానుమయ్యా । శోకతో నీకల్ల - సుఖములొసంగన - నేకులులేరఁటయ్యా? । యిట్టి । పోకులు చెల్లునయ్యా? చాలయ్య.

రుక్మాం—కొమ్మరో! నిన్నెద - నమ్మితినీకు మే - నమ్మితిఁగానఁగదే । నమ్ము నేనీవాఁడ - నుమ్మిఁకనన్నేలు - కొమ్ము ననుయమ్మదే । కాదు । న్యాయమ్ము నుజూపఁగదే. అక్కట.

62 [20] రుక్మాంగదుఁడు. —*జేహాగ్ రాగము—ఏకతాళము*—

తలోదరీ! యిటు వినుమా - ననుదయఁగనుమా - యనుమా - నము విడుమా.

1 (మిశ్రగతి) వేఁడి - వేఁడి - యోడి - నాఁడె - మోడి - చే

యుఁ - జూడకే - (చతురశ్రగతి) వడిగా - మదిగా - గడుఁదనని
డుచుగా - జూడఁగదవే - శుభం బగుగా. తలో.

68 [21] —*ధీరశంకరాభరణరాగము—ఏకతాళము—చతురశ్రజాతి.*—

సాని - సగ్గామపా । మా । పాదాద్ద - పామాప - గమగరిసా. పా
పాప - దాదాద - నీనీని - సాసాస - నీనీద - పాదా - నిసానీదా
పా । పాదాద్ద - పామాప - గమగరిసా. సాని - సగామపా.

పద్మ—అయ్యో । దయాళుఁడే

చక్రో— ... ... కాఁడబద్ధ మబద్ధ మబద్ధమే,

1 పద్మా—ఆనాఁడు - మనల - మన్నింపఁ - గాలేదె? ।

చక్రో— ... ...ఆనాఁ డిట్టినాతి లేదయ్యెఁగా

పద్మా—హా! నాథుఁ డన్యుఁడె?

చక్రో— ... ... నమ్మఁదగదె. అయ్యో.

2 పద్మా—లాలించి - బేలించి - పాలించఁ - గాలేదె?

చక్రో— ... ...మేలెంచి - కాదె కాఁ - గిలించనే ।

పద్మా—అలించు నా మొఱ

చక్రో— ... ... వినఁదగదె. అయ్యో.

70 [22] పద్మగంధి. —*అసావేరి—ఏకతాళము=మిశ్రజాతి*—

ప్రాణేశుఁ డొల్లని - బ్రతుకేల జగమెల్ల। బహు దుఃఖాకరమేనమ్మా.

1 మానినికిని భువి - మానఘనములకు। ప్రాణేశు సేవయే - పరమార్థ
మమ్మా. ప్రాణేశుఁ.

73 [23] పద్మగంధి. —కాఫీరాగము—ఏకతాళము—చతురశ్రగతి—

ఎటులు సహింతు నో - యీశా యీ దుర్దశ? ।
ఎటులు సహింతు - నే - నెటులు భరింతు. ఎటులు.

1 కటకట విభుఁడు పర - కాంత పాలగుట । నెటులు నే విం
దు! భువి - నెట్లు మనియుందు? ఎటులు.

74 [24] సంధ్యావళి. —కన్నడరాగము—ఆదితాళము.—

వినుఁడీ, యింకేమి జరుగునో - కనుఁడీ - వేగిరపాటుమాని. విను.

1 వినుఁడీ - యొక్కింత శాంతిఁ గనుఁడీ - పాత్రులగుచు నూరక
కనుఁడీ - మనగతి కొరులు కర్త - లనుటయెల్లఁ గల్లయని తెలియుఁ
డీ. వినుఁడీ.

81 [25] మోహిని. —*తోడిరాగము—ఏకతాళము—మిశ్రగతి.*—

పావనహృదయా నా - ప్రాణేశ నిన్నను - భాగ్య మెన్నటికైనఁ గాం
తునా?. పావన.

1 మల్లెలు మొల్లలు చేర్తునా? - మంచిగమాలలు కూర్తునా? కొల్లగ
నీ మెడ నుంతునా? మోవి - కొసరి కొసరి సొక్కింతునా. పావన?

2 కోరినికౌఁ గౌఁగిట నుంతునా? - కొదమగుబ్బలచే హత్తింతునా?
నేరమాయంచుఁ బ్రార్థింతునా? నీ - నెనరున, బడిసుఖియింతునా?

3 వగలఁ దేల్చి మెప్పింతునా? ని - ర్వచనీయ గతులసోకింతునా?
పగలు రేలిటులు సేవింతునా? నీ జా- భగవంతుఁడంచునుతింతునా? పా.

87 [26] —*ఘంజురాగము—త్రిపుటతాళము—చతురశ్రజాతి.*—

మోహి—రాజేంద్రా! యీవిధితగునా? । యీ । యోజన నీవాడ
నాడ నగునా? అహా. రాజేంద్రా.

రుక్మాం—రాజాననా! నిను విడిచెదనా? । వి । బ్రాజితమదగజగమ
నా! యుడు. రాజానవా.

మోహి—ఒంటిగ నన్విడిచి యొంటరివై నిలిచి । మింటికై చూచెద
వే! అహా. రాజేంద్రా.

రుక్మాం—హరివాసరవ్రతము మఱచితిఁ గావున । హరికరుణను వేడి
తి । యుడు. రాజాననా.

ఈ 17 పాటను పంచమాంకములోని 4, 6, 8, పద్యముల ప్రారంభ
మందు వరుసగా ఒక్కొక్క చరణము చొప్పునఁ బాడవలయును.

92 [27] మోహిని. —*ఫరజురాగము=ఏకతాళము—చతురశ్రజాతి*—

నాఁటిమాటలు మఱపాయెనా? నేఁటికవెల్ల వెగటాయెనా? యల. నా.

వాటముగా స - య్యాటలనాడిన । మాటలెల్లఘూటా లాయె
నా? యల. నాఁటి.

1 పాయనని చెలిమల - పాయెనె నిన్నాడేఁ । బాయననుటయెల్ల పో
యెనా? యల. నాఁటి.

2 పలుకుపలుకునఁ దేనె - లొలుకునసెడిసాదు । పలుకులు ములు
కులై సోకెనా? యల. నాఁటి.

3 సంతసముగ భగ - వంతుని కథ లిపు । డంత వీనులవిందులాయె
నా? యల. నాఁటి.

95 [28] *a* —*అఠాణరాగము—ఏకతాళము—మిశ్రజాతి*—

రుక్మా—ఎంతగఁబల్కితివి - కాంతరో! వింతలాయెనే. డెంత.

1 కంతుసుఖమేకోరి యె - క్కంతయమోచింపక యె । పంత
గించి నీవిటులు - వింత వింతలాడుచు నేఁ. డెంత.

మోహి—ఎంతటిఘనుఁడవు - రాజా! రవితేజా! నీ. వెంత.

1 కంతుబారి కోర్వనంట - యింతి? నినుఁ బాయనంట । యింతే
యుఁ గలసెమింట - వింతలాయె నేనిట్లుంట, నీ. వెంతటి.

రుక్మా—2 ఆఁడవారి మాటలకు - నోడివ్యర్థులైనవార । లేదు లోక
ములలోన - నేఁడు నే నాఁడుఁగలరె. యెంతగ.

మోహి—2 ఆఁడవారితోడఁగల్ల - లాడివారిఁగూడి యిట్లు మోడి
సేయువాఁడేనాఁడు - లేఁడా? యోశేఁడా! తగునీ.

రుక్మా—3 కల్లలేమికాదు ని - న్నొల్లననుటయులేదు । అల్లనాఁడు
వ్రతమువిడ - నొల్ల నంటమఱచితినేఁ. డెంతగ.

మోహి—3 మఱచుటలునీకేకాదు - మర్యాదయె మీయింటను ।
దొరలకును మఱియుస్వార్థ - పరులకుఁ బామరులకును నీ. వెం

(ఈ 28 *a* *b* లలో నొకటి మాత్రము పాడిన చాలును.)

95 [28] *b* రుక్మాంగదుఁడు. —*సురటరాగము—ఆదితాళము*—

హా మగువయిటు - లగడు పలుకులను - మిగిలి పలికెదవె - వహ్వాహ్వా!
ఈ మహిని భామ లిటు వ్రతముల-నోములను మాపగను జూతురె?హా.
1 బాలురను వృద్ధులనురోగులుభోగులును సుంతయును దొలఁగక-
చాలగను సల్పఁదగు వ్రతమిది - యేలయని చాలునని తెగడుచు.హా.

111 [29] ధర్మాంగదుఁడు. —*కాఫీరాగము—ఏకతాళము—మిశ్రజాతి*—

జననీ! యీ వగపేల? । సతంబే యీ - జగంబెల్ల? ।
కనుమీ దృశ్యమిదెల్ల । వినుమీ - నిల్చుటకల్ల. జననీ.
1 మున్నిజగతి - నెన్నోయుగముల్ । చన్నవనుచు - జననీ! విన
వే? । ఎన్నవార - లెల్లనేఁడు - నున్నారమ్మా? - యూహింపుమా.జ.

114 [30] —*కమాచిరాగము—ఏకతాళము—చతుశ్రజాతి*—

మోహి—తాళు తాళు రాజా!
రుక్మా—తాళజాలనే.
మోహి—తాళు తాళు రాజా! యిదితగవా?
రుక్మా—తాళనేటికి యింకనో మగువా?
మోహి—బిగువా? తృణమైన నిల్వలేవా?
రుక్మా—నగవా - రడిగాదె యో మగువా?
మోహి—బాలునిటు చంపకు.
రుక్మా—వ్రతము విడు మనకు.
మోహి—సెబాస్!
రుక్మా—పో.

120 [31] ధర్మాంగదుఁడు. —*సురటరాగము—ఏకతాళము—చతుశ్రజాతి*—

ఏల పల్కెద వీలీల? జననీ! నీ. వేల.
చాలుచాలు నీఁక వినఁ - జాల నిట్టి పల్కులు, నీ. వేల.
1 సామి నేమఱచి - సకలముఁజెఱచి, మా । నీమమునిమ్మలి వెల్ల -
నీటఁ గల్పు మనెదె? నీ. వేల.
2 యుక్తులుతెల్పి, దు - రుక్తులుపల్కి, మా । భక్తి ముక్తి యెల్ల
నేఁడు - పాడొనర్పమనెదె? నీ. వేల.

132 [32] అందఱు. —*సురటరాగము—ఏకతాళము*—

మంగళము భూవరా - రుక్మాంగద మకుటధరా! అంగజజనకుని
కృపఁగొని యాచం - ద్రార్కమైన కీర్తిఁగొనుమి జయజయ. మంగళము
1 ధరకు ముదముఁ గూర్చి, విబు - ధాళి నాదరించి, స - త్పురు
షులఁ బోషించి, ముని - ముఖ్యులఁ బూజించి, మించి - సరసు
లెల్లరును సత్ప్రభుఁ డితఁడని - సకలగతుల నిన్ను మెచ్చునట్లుగ -
నరసి ప్రజల నేలుమయ్య శ్రీధ - ర్మాంగదావనీశ నీకు
జయజయ. మంగళము.

[33] —*హనుమతోడిరాగము—రూపకతాళము—చతురశ్రజాతి*—

దీనపోషకా! భక్తా - ధీనరక్షకా! । దానగుణ ని - ధాన మోక్ష
సం - ధాన గావరా.
మానక నీ స్మరణమే యుప - మానరహిత మనుచుఁ దెలిసి- మాన
సమున నిల్పితి నిఁక - మాన మాననీయచరిత. దీన.
దళవద - నవిదళ - ననిపుణ. దీన.
పరాక? మను - పరాద యిఁక. దీన.
కా - మితఫలద - శుభద. దీన.
1 రారారణ - శూరాశ్రితి - సారాసువి - చారోవర.
2 ఆ పదల - బా పఁగల - ప్రాపనుచు - నీ పదము । దాపు -
జేర । పా - పచయము - లుడుపవె? దీన.
3 రాపేల? గోపాల - నీపాలఁబడి తిర । కోపమేల? - గోపిలో
ల । కాపాడర కరుణాకర - తాపసార్చితాంఘ్రియుగళ. దీన.
4 దాసహృన్ని - వాసనన్ని - దోషపుంజములనిడరు । మోసఁగాం
ద్ర వలలఁ దగిలి । యాసలఁబడి - వేసరివడి - నీ సముఖము - డా
సితినిర. దీన.
5 పంత మేల చేసెదు? భగ - వంత దాసపోషా । యావంతయైనఁ
గరుణ లేదా? - సంతతాశ్రితావనచణ. దీన.

33. స్వరజతి—మలయమారుత రాగము—త్రిపుటతాళము -చతురశ్రజాతి.

	సా, రీ, గా,, పా, - దనిద	పా,, - ,, ద ని	సని ద ప - గరిసని
	కో, రీ, యు,, న్నా, - రపిట	రా,, - ,, యుడి	సదయుడ - ననిని న.
	సా, రీగ - రీ, గాప - గా పద	ని, దాప - దని	దిఖప - ని దపగ. [illegible].
	రా, పేల - భూ, పాల - యోపవ	ని, పాల - బడి	తినిర - వి[illegible]కు. కో.
౧	గా,,,, - పగగరి - రిగరి స - సరి	గా,,,, - గప	ద నిద ప - గ రి స [illegible]
	గా,,,, - సరసిక - నినుగని - సరి	గా,,,, - సర	సుడనవు - దరుచును
	గా,,,, - రీ, సానిద పగరి	గా,,,, - [illegible]	సనిదప - ద ని స [illegible]
	గా,,,, - టం, బైనసుమశరు	గా,,,, - సీ	నిదగిలి - సముయుము
	గా, - పదపగరి - గా, - నిదపగ రి	గా, - దని దఖప	గా, - రి సనిస[illegible]
	గా, - నకనగన - గా, - విధివశము	గా, - సిడియెతిఁక	గా, - దూరకతిన
	గా, - పగరిగా, - ప ద ప గా, - ని	దపగా, - రిగా	, - పగా, - సగ రి. [illegible]
	గా. - దనకగా, - వృమటుగా, - క	విడగా, - జగా	, - నగా, - [illegible]రి. క
౨	పా,,,, - ద ని - ససిఖప - గ రి స రి	గా,,,, - స[illegible]	గ రి - గ రి - [illegible]
	పా,,,, - దము - లబడితి - రమలయ	మా,,,, - రుత	ముస - నిద[illegible] - [illegible]
	పా, - దనిదపా, - నిద నిపా, - ద	ని సపా, - దనిస	రీ, - గారి - స రి
	పా, - డెదరపా, - టలనుపా, - వ	నకృపా, - నుతీవి	ప్రా, - [illegible] - నిను

దా,- ని దని -పని ద- ప దప -గప గ -రి	గరి - సరిసనిదప	దనిస రి - పగగరి
బా,-యసూర-సదయ-హృదయ-గదియ-గ	వర - యుదెసమయము	ముదముసన - మదవతి
గా పదాపు - నీద - సా రిస నిదప	వా ని దాప - గప	ద నిదప - గ రిసని. సా.
ప్రా పు వేడ - వీడ - కూ డదుగదర	యాప రాని - వల	పునబడి - వినెమది. కో.
3 సా, - సరిససనిదా, - ద నిదధ ప	గా, - ప గప - రీ	, - గ రిగసా - ని స
క, - మ్మనిలుతుదు ర, - మ్మునసుపదు	న, - మ్మలను - జి	, - మ్మగనువె - న్నల
రీ గా,, - గపగరి రి గ - స రి గ రి	గాపా,, - గా	ప నిద ప - గారి గ
గాయ,, - శుకపికములు - బలురొద	సేయ,, - తు	మ్మెదగమి - జుమ్మని
పా, దా, - దానిసరి స స ని - దని	సా స - రీ ప - గా	రి - గాప - గారిస
ప్రేమా, య, - కోకిలాసగుదు - వని	డాయ - వేటు - జే	య - మేర - గాదుర
రీ, - సని సదా, - నిద ని - ప గపధ	గా, - పగప రీ	, గ ధ పగ రిసని. సా.
సం, - తతముసం, - తసము - ననుభగ	వం, - తునిగనెం	, తయుమది దెలిసి. కో.

34.—*స్వరజతి—చక్రవాక రాగము—ఆదితాళము.*—

సా, నీ, దా, - నిదధప - పమగ	రీ, సా, రీ	, గామా ప ద ని. సా.
సా, మీ, నా, - మనవిని - విన వ	దే, మీ, జా	, లం చే మియుటు. సా.
సా, రి స ని - ద ని సనిద - దని ద పమ	గా, రీ, గా	, సరి గమ ప ద ని. సా.
సా, మియని - యనుదినము - నినెగొలువ	గా, వే, గా	, రవమున మనుప. సా.

౧	దా, - దని దధప - మా, పధప పమ	గా, - మపమమగ	రీ,- గమపదనీ. సా.
	దా, - నవహరణ - మా, నితసుగుణ	గా, - వ గ దె శ బ	రీ,- ప్రణుతపద. సా.
౨	పా,,,, - ద ని దపమా,, - ప ద	పమగా,, - మప	మగరీ,, - గమ
	పా,,,, - పహారణమా,, - మొుఱ	వి నిగా,, - వ గ	నెవరీ,, - భువి
	గరిసా - స రిసనిదా - ద నిసరిగా	నిసరిగమా - గమ	పా - మగమప దని. సా.
	నీకసా - మజవరదా - యనిసరిగా	దలచితిమా - మక	ప్రా- ర్థనగొనెదని. సా.
3	సా రిగరిస - ని రిసాని - ద నిపదని	సా, ని ద ప - మప	ద నిదప - మ-ధ ప మ
	కామితవర - దుడపీవె - యనిమదిని	సా, మిక్రృప - ని డి	కడువడి - యఘుచయ
	గా, రిరిస - ని రిసాని - దని స రి గ	మా, - ప దనిద ప	మా, - ప సనిద ప
	గా, ధలను - దెగటార్చి - ననునునుపు	మా, - మదినిలుపు	మా, - కృపసలుపు
	మాప ద - నిని దధప మ -పమగ మపద	నీ - దనిసా - ని స	రీ - సరి ససాని
	మాయని -యనుదినమును -తవమృదుపద	నీ - రజసే - వయె	శ్రీ - కరమటంచు
	ద ని సరిగా,, - రిస ని సరీ,,	స ని ద నిసా ని ద	పమ - గమపా దని. సా.
	మొుఱలిడగా,, - విన వెహరీ,,	యిటుమనసామఱ	నగ - భగవంతుడ. నా.

35 తానవర్ణము—ముఖారిరాగము—ఆదితాళము.

ప్ర. శ్రీవిజయవాడపురాధీశా! (అను.) భగవంతదాసపోష! చ. పాపవినాశా! పరమేశ.

ప. సస్సానిదప - సని దప - మపమగరిస | రీ,, - ,, రిమ | పనిద - పదమపద
శ్రీఈఇవిఇ - జలఅయలఅ - వఅఅఅఅఅ | జ,, - ,, అఅ | అఅఅ - అఅఅఅఅ
నిదాప - మపధస - నిదాప - మగరిస | ధసా - దసరిగరి | మగరి - సరిమపద
పుఉఉఉ - ఉఉఉఉ - రఅఅఅ - అఅఅఅ | పుఈ - ఇఇఇఇఇ | శఅఅ - అఅఅఅఅ

అ. పా, - మపధ - మపధప - మపమగరిస | దా, - సరిస - ధస | సరి రిమ మప పద
భ, - అఅఅ - గఅఅఅ - న ం ం ంంం | త్రి, - అఅఅ - దఅ | అఅఅఅ అఅ అస
పా, - ధస రిగరి - మగరి - పమగరిస | రిరి సనిద - సని | దప - మగ రిమపద.
పో, - ఒఒఒఒఒ - షఅఅ - అఅఅఅఅ | శ్రీఈ ఇఇఇ - సఅ | అఅ - గఅ రెవ ఎశ.
సానిదా, - స ని దా - మపధ - మపమ | ధా, పా, - మని | దప - మప మగ రి స
శ్రీరమా, - హితమా - నితమ - హితసు | ధా, మా, - సను | గృప - గ ని మనుపుమ
మా, గ రి స - పా, మ గ రి - రిమపధ | వా, పాధ - మా | , పా ధ - పనిద స
మా, నుపుమ - గా, ములను - త్రిజన | సం, తాన - సి | , ధ్యాన - పటిమను
నీ, ధాప - గా, రీస - సీ, ప | , ప - గా, రీస | రీమపా - ధ సరి
సం, ధించు - గా, రీశ - మా, ని | , శ - గా, రీశ | సేవితా - దురిత

	మగారి - సరిపమాగరిస - సనిధప	రిసానిదప - ధప	, తుగ - రిమపద. స.
	వినాశ - నినువి నాగతిని - గనసుర	ధరాస్థలిని - దార	, వినుు - రాజధర. శ్రీ.
చ.	పా, ద - మప - నిని దధ పప మమ గా	సా,, - దా, స	,, - రీ, మామ. పా.
	పా, ప - వి ఇ - ఇఇ ఇఇ ఇఇ ఇ ఇ నల	శా,, - ష, ర	,, - అ, మే శ. పా.
౧	పా, మా, - నీ,, - పా, ప - ధరి	పా, - నీ, దా	, పామాగ - రిమ. పా.
	ఈ, శా, - కై,, - లా, స - గిరి	శా, - వి, శ్వే	, శాపాహి - నమ. పా.
౨	స రిమ-రిమప -మపద -పధస-ప దస రి	మ గరి - సనిధ - సని	ధ ప - పమగరి - రిమ. పా.
	సుగుణ-ధరణ -భరణ -నిపుణ-భవభయ	హారణ - చరణ - నుత	గుణ - విత రణ - చణ. పా.
౩	పా, - పమ గ రి మపా, - రిమస రి మ	పా, - ధ పధపమ	పా, - నిద నిపధ
	పా, - పభయమునుపా, - ఆదరుమును	పా, - యమనితవ	పా, - దభజనమ
	పా, నిదపదసపా, - ధరి స నిద	పా, - గరిస నిప	పా, - పదసరిమ. పా.
	పా, రగతిసుకపా, - లముఖ శ్రిత	పా, - రిసలుపరి	పా, - వనచరిత. పా.
౪	నీ, దా, పా, మాప - మాపమ	నీ, దా, మా	, పా ధ - మపధస
	పా, లా, శా, వేల - కాల వి	పా, లా, చి	, ద్యుతి - విల సిత
	నీ, దా, - గా, రీ స - సరి ధరి	నీ, దా, - మా	, గ రిస - రి మ పధ
	పా, లా, - మాం, పాహి - శ్రితపరి	పా, లా, - స	, న్మతిర - ప్రణమిత

నీ, దాప - మా, దాప మగరి - స	మా, రి పా, - మ	ధా, - ప సా, - ని
భూ, పాల - గో, పాల వినుత - హ	రా, దొరా, - ప	రా, - త్వరా, - ప
రీ, - సనిద - గారి సనిద - పదసరి	మా, - గరి సా - ని	దమా - గరిస - రిమ. పా.
రా, - కటర - కోర్కెలిడర - కలుషహ	రా, - యుడురా - జ	ధ రా - నగర - టర. పా.
గ రీ,, - ,, సరిగరిరిగ - సరిధరి	సా,, - ,, నిద	మా - పదసా - రిగ
శ్రీ,, - ,, కరశుభకర - పురహర	సా,, - ,, మిర	మా - పతిసా - యక
రీ, రీగ సా, - రీగసా - రిగ	సా, నీద - మా	, పాద - మపధస
శ్రీ, త్ర్యక్షప్ర, - త్ర్యక్షశి - క్షిత	, ద, త్రాజ - గ	, ద్రక్షు - ఫణికృత
నీ, ద - గా, రి - పా, మ - గరిసని	నిదా - ధ పాపమ	, - మగా - గరిసా
హా, ర - ధీ, ర - ఘో, ర - భవభయ	హరా - నారాధిర	, - నరా - గదరా
నిరి - సమ - రిప - మధ - పని - ధస - నిరి - ధరి	సా, - పా, సా	,, - సరిసా - రిమ. పా.
సుర - వర - నుత - నగ - ధర - హిత - గిరి - కృత	చా, - వా, సాం	,, - జనదా - శివ. పా.

3[illegible] [illegible] వరాల - ఆదితాళము.


[illegible], స, పప - [illegible] - దని స   [illegible] దపమ - గమ   [illegible] - గ గమ - గమదని.
[illegible], మా, గ [illegible] - [illegible] - తతమ   నా మిఇస - [illegible]   ద - [illegible] - [illegible].
పా, వాద - [illegible] - గపపని   ద నిప - [illegible] [illegible]   [illegible] స - [illegible] గపద.
నీ, మాడి - [illegible] - [illegible] - [illegible]   [illegible] - [illegible] - [illegible]   [illegible] - [illegible].
సరిసదా, [illegible] - [illegible]   [illegible], - [illegible] - [illegible]   [illegible] వా, - పపద
సరిమ్మ [illegible], [illegible] - [illegible]   [illegible], - [illegible] - [illegible]   [illegible], - [illegible]
మమగ పనిస - [illegible] - [illegible] పద   [illegible], [illegible] - [illegible]   ని - [illegible] - మగపధ.
[illegible] అమారి - [illegible] - [illegible]   [illegible], [illegible], - దే   [illegible] - [illegible] - [illegible].
పాపపప - [illegible] - దా[illegible] - పమగ గ   నా[illegible] - [illegible] - [illegible] గమా   గ - [illegible] - [illegible]
[illegible] - [illegible] - [illegible] - [illegible]   [illegible]   [illegible] - [illegible] - [illegible]
[illegible] మపా[illegible] - నానిధాప - [illegible]   గా[illegible] - [illegible] - దా   [illegible] - పామగ[illegible],
వా[illegible] - [illegible] - [illegible]   [illegible] - [illegible] - [illegible]   [illegible] - స [illegible],
పా[illegible] పా[illegible] ధాప - [illegible] గా   గపగ - [illegible] - [illegible]   గ పా[illegible] - [illegible]సస
పా[illegible] [illegible] దా[illegible] - [illegible]   పల - [illegible] - [illegible]   [illegible] - [illegible]
పా[illegible] పా[illegible] [illegible] - [illegible] సస[illegible]   రిసద - సదమ - [illegible]   గ - గరిస - [illegible] గమ[illegible]. [illegible]
జే [illegible] - [illegible]   [illegible] - [illegible] - [illegible]   [illegible] - [illegible]. సామి

౧ పాపపపప - మపమ - గగమ - రిగమ | పధపసా, - పప | మ - గగమ - రిగమప
సాదరిమతి - బ్రోవన - వశయు - శోభిత | శంకరా, - ధర | ణా - నపురా - శ్రీ ఇఇఇ
దాస - నీస - దాని - దాప - గమప | ధా, పా, - రిగ | మప మప - గా, మరిస
శావ - యూని - ధేర - మేశ - లోబకేవ | శా, నా, - మన | సి ని వి ని - వే, ఎఎఎ
గామపా ని - నీన్నిపా - పపపసా | ,, - ,, | ,, - నిసనిధపమ
నాపకోర్కె - దీర్పవే - పరమశ | న్యా, ,, | ,, - తలంపమున
రిగమాపదని - ససరి - సనిపా - పస | సా స - నిసని - పని | ప - మపమ - గమపని. సాని.
వేదచింబు - నెపమ - మెవరిదే. - పశి | నలట్ల - నుండి - నిఇ | న్ని - వెపము - చుండగ. సామి.
౨ గామపపప - నిప - పానిసప - రిస | రీ, ససిరి - పమ | గరి - స గరిస
ఎన్నిగతుల - సన్నె - వేడితి - తుది | కే, దరి - డు | పేదో - కృపాకర
గాను - దాని - సెది - దాప - పనిసరి | సరి స దాప - పమ | ప - గా మ - రిగరిస
నెన్న - తల్లడి - గాని - దాని - ఋకనిఇ | కొన్న హాయు - గర | మ్యు - మొందు - గలఅన
రిమపాని - మాపసని - ససా | ని స - స - | రి - సనిద - మపనిస
పన్నగాప - మేమహా - మతిని | చెంతిజే - | యు - చుందు - సురరిఇ
పాప - నిస - రిస - సనిప - మపని | రీ, (సని) పా, - పని | పాపమ - రిమపని. సాని.
చిన్ని - మోము - జూపి - బ్రోవు - రానను - శ్రీ, | నా, - రిగ | సత్యా - పి - పోషక. సామి.

గీ. శ్రీశుకృపఁగాంచి యీ - కృతి ♦ సిరుల మించి
సకల జనముల మెప్పించి ♦ వన్నెల నించి
బుధజనాశీస్సుల గడించి ♦ పొలుపుగాంచి
ధర శశివెలయుత మా చంద్ర ♦ తారకముగ.

సమాప్తము.





యమ— నారదమునీంద్రా! నమస్కారము. ఈ యుచితాసనంబునఁ గూర్చుండుఁడు.

నార— సు ఖీ భ వ. శమనా! నీవునుఁ గూర్చుండుము.

యమ— తాపసేంద్రా!

క. మీారు త్రిలోకములందును
గూరిమిఁ జరియించుచుందురు; ♦ కువలయమున నే
తీరునను మీా రెఱుంగఁగ
నేరని కత లెందుఁ గలుగ ♦ నేరవు సదయా! 7

ఏ నిప్పు డొక్కయంశంబుఁ దమవలన వినఁగోరియున్న వాఁడ. అ దెద్దియనిన

గీ. దుష్టచిత్తులు, మఱి గురు ♦ ద్రోహు లమిత
పాపకర్ములు, బహు సురా ♦ పాన పరులు,
కపట వర్తనులును, మిత్ర ♦ ఘాతుకులును,
నడలుచుందురు ఇటఁ బడి ♦ యనుదినంబు. 8

అట్టి వార లిప్పు డేమికారణంబుననో కొంత కాలంబునుండి వచ్చుట తగ్గినది. ముఖ్యముగా విదిశా పుర ప్రాంత ప్రదేశములనుండి వచ్చుట కానఁబడదయ్యె. దీని కేమైనఁ గారణం బుండితీరవలయు. అది యేమై యుండును?

నార— దండధరా! ఎఱిఁగింతు వినుము. ఈవిషయంబు నేనును మొన్ననె నూతనంబుగ వినియుంటిని. దీని నీ కెఱింగింపఁ దలఁచియే యిచటి కరుదెంచితి.

ఉ. ఆ విదిశాపురంబును ధ ♦ రాధిపుఁ డొక్కఁడు భక్తగణ్యుఁడై
పావనమూర్తి నాఁ జెలఁగి ♦ పాలన సేయుచు, విష్ణుప్రీతికై
సేవ లొనర్ప నెంచి, యల ♦ శ్రీహరివాసరసువ్రతంబు నెం
తే విమలాత్ముఁడై సలుపు; ♦ నేమని చెప్పుదు వాని చిత్రముల్.

—* పంచచామర వృత్తము *— త్రిశ్రగతి.

నిరంతరంబు శయ్యనుండి ♦ నిద్ర లేచు నప్పుడే
పరాత్పరా! కృపాబ్ధి! పాప ♦ భంజనా! నిరంజనా!

పరేశ! నిర్మలాత్మ! యంచు ♦ భక్తియుక్తుఁడై కడుఁ
స్మరించుచుండుఁ గాని వేఱు ♦ మాటఁ బల్కఁ డెన్నఁడున్. 10

ఆ వ్రత ప్రదేశం బెట్టులుండు ననుకొంటివి?

పాదపవృత్తము.

ఒక్కెడఁ బత్రియు ♦ నొక్కెడఁ బూలిం
కొక్కెడఁ బాటయు ♦ నొక్కెడ నృత్యం
బొక్కెడ స్వస్తి, మ ♦ ఱొక్కెడ గీతల్
లెక్కకు మించును ♦ లేదటు లెందున్. 11

యము—ఏమి! అంతటి భక్తితో వ్రతం బాచరించుచుండెను గా!

నార—ఇంతేనా! మఱియు వినుము.

గీ. తా నొనర్చిన మన కేమి ♦ తెఱుఁగఁ బోదు;
కాని పురజను లెల్లరుఁ ♦ గలయఁ గూర్చి
యా వ్రతంబును భక్తిచే ♦ నాచరింపఁ
జేసి నీ పురి కీర్తిఁ ♦ జేటుఁ దెచ్చె. 12

గీ. వార లెల్లరుఁ గలుషత ♦ వాసి తుదను
స్వర్గమున కేగ సాగిరి ♦ సరభసమున;
కాలు కల్గినవానికిఁ ♦ గాశి కేగు
టనఁగ మూఁ డంజ లనెడు సా ♦ మ్యముగ శమన. 13

కావున నీలోకమందలి పాపుల సంఖ్య తక్కువగుచున్నది. ఆ రాజేంద్రుని పేరు రుక్మాంగదుఁడు.

యము—ఏమి యాశ్చర్యము! ఈ వ్రత మహాత్మ్యంబున వార లెల్లరునుఁ గలుషరహితు లగుచుండిరిగా! దీనిచేతనా యిచటి పాపుల సంఖ్య తక్కువగుట!

నార—తక్కువగుట మాత్రమేనా?

గీ. ఈ వ్రతమె యింక యిసుమంత ♦ యితర దేశ
వాసులందును వ్యాపించి ♦ ప్రబలె నేని

నీ బలంబులు నీపుఁను ♦ నీ నరకము
తరలి యేమూల నైనను ♦ దాఁగ వలదె! 14

అటు పిమ్మట నీ వుండి ప్రయోజనమేమి? నీ వెవ్వరిని శిక్షింతువు? క్రమక్రమంబుగ నీ యధికారంబునకును నీ లోకంబునకును గూడ హాని తటస్థింపఁ బోవుచున్నది. కాన నెఱింగించితి. పిమ్మట నీయిష్టము.

యము—ఓహో నారదమునీంద్రా! నీ వాక్యంబులు వినినంతనే నాగుండె లదరుచున్నవి. దీని కేమి యుపాయము? ఈ వ్రతంబేమి! ఈ తం డాచరించుట యేమి! నాలోకంబు పాడగుటయేమి! దీనికి నే నేమిచేయుదును?

నార—ఏమిచేయుదువు? పాపులు వచ్చినప్పుడు శిక్షింపుము. రానప్పుడు మెదలక కూర్చుండుము.

యము—అట్టుల నెదవేల మునీంద్రా! ఎట్టులైన నీవే కరుణించి నా లోకంబుఁ గాపాడవలయును.

నార—(చిఱునవ్వుతో) నే నూరక పాడఁ గలను గాని కాపాడఁగలనా?

యము—దీనికిఁ దగిన వెఱ వొక్కటి యోజింపఁజాలవా?

నార—భక్తుల కిచ్చుటకై మంచి మంచి ధోవతుల చాపులను జక్కఁగాఁ జింపఁ గలనుగాని వే ఱెద్ది యోజింపఁజాల.

యము—ఎట్టులైన నా లోకవ్యవహారంబు ముడివడునట్లు చేయుము.

నార—ఈ వ్యవహారము చూడ విడఁబడునట్టులున్నది. కాని ముడివడునట్లు నాకుఁ దోఁచుట లేదు.

యము—నీ వాక్యంబులు విన విన నాకు మఱింత భయము కలుగుచున్నది. ఈ మహా దుఃఖ సముద్రము నే నెట్టు లీదఁగలను?

నార—ఓశ్. అ దెంతపని? దీని కుపాయము నేను చెప్పఁగలను.

యము—ఏమి చెప్పెదవు?

నార—నా తంబురబుఱ్ఱవంటి మంచి బుఱ్ఱ యొకటి సంపాదించుకొని దాని గట్టిగాఁ గౌఁగిలించుకొమ్ము. ఎట్టి మహాసముద్రమందైనను మునుఁగకుండ నీఁదవచ్చును.

యము—నేను కార్యావసరమ్మున నిట్టులు ప్రార్థించుచుండ నాయెడఁబరిహాసంబుఁ గావించెదవా?

నార— నాకు నేమియుం దోఁచక పల్కిన వాక్యంబులు కాని పరిహాసవాక్యంబులా! (కొంచెము సేపూరకుండి) అయినను దండధరా! యింత వెఱ్ఱివాఁడ వేమి?

ఉ. ఏటికి యీ వృథావ్యసన ♦ మే వెటుఁబోయినఁ బోవనిమ్ము; నీ
కేటికి లేనిగోడు? సుఖ ♦ యింపుగ నేరవె కూరుచుండఁ? నీ
కూటికి నుక్షుధార్తి భయముఁ ♦ గొంటివె? లోపము లేదు నమ్ము; నా
మాట నిజమ్ము; ధాత తగు ♦ మాత్రము పెట్టకయున్నె యేరికిన్?

యము— సంయమివరా! నాకన్న వస్త్రములకు లోపము కలుగదనియా పల్కుచుంటివి

నార— మఱేమి కావలయును?

యము— చిరకాలము నాచేఁ బాలితంబగు రాజ్య మిప్పుడు వ్యర్థమగు చుండెఁగదా.

నార— రాజ్యమునకై నీ వేల యింత శ్రమపడెదవు?

గీ. ఇంత శ్రమపడితంచు నీ ♦ కెవ్వరైనఁ
ద్రవ్వి తల కెత్తుదురె మహా ♦ ద్రవ్యమెల్ల?
ఒక్క మూలను గూర్చుండి ♦ యుచిత గతిని
బ్రొద్దుపుచ్చుచు నీ దారిఁ ♦ బోవరాదె? 16

యము— నారదా! నిన్నింతగ వేఁడినందు కిదియా నీవు నాకుఁ జూపు త్రోవ?

నార— ఇంతగ వగచుట కిప్పుడు నీ పుట్టిమునిఁగినది?

యము— అయ్యో నారదా! అట్లనెద వేమి?

ఉ. ఆరక భగ్గుభగ్గున మ ♦ హానలకీలలఁ గ్రక్కుచుండు మ
న్నారకవహ్ని యారి కడు ♦ సల్లగుచుండుటఁ గాంచి, నెత్తిపై
నోరెడికొంచు, నూరక ని ♦ నున్ గని వేఁడుచునుండ నా కిదే
తారకమయ్యె; నేమిగతి ♦ దైవమ! దైవమ! యంచు నుండితిన్

నార— (తనలో) నా యత్నమువలన నిప్పటి కితఁడు మహాతురుండై యున్నవాఁడు. కలహకారణబీజం బొక్కటి యిపుడు చక్కఁగ వీని హృదయ భూమియందు నాటవచ్చును. దీని ఫలమును నేను హాయిగఁ గొంతకాల మనుభవింపవచ్చును. (ప్రకాశముగా) దండధరా! నీవు మిక్కిలిగ వడుగుచుంటివి కాన నాకుఁ దోఁచిన యొక్క యుపాయం బెఱిఁగింతు వినుము.

క. నీ కీ ప్రభుత యొసంగిన
దా కమలజుఁ డతనిఁ జేరి ♦ యాద్యంతముగా
నీ కథఁ దెల్పి మహాత్మా
నాకొక దరిఁ జూపు మంచు ♦ నతి యొనరుపుమీ. 18

గీ. అతనిఁ బ్రార్థించి, ధ్యానించి, ♦ యాశ్రయించి,
వ్రతము నెల్లని మాన్పింప ♦ వలయు శమన;
తగని కార్యం బటంచును ♦ దలఁతు వేమొ;
యాత్మరక్షణకన్నఁ గా ♦ ర్యంబు కలదె?

ఇంతకన్న నుపాయాంతరం బేమియు నాకుఁ దోఁచుట లేదు. ఇట్లు కానిచో నే నీ యమాధికారంబు నొల్ల నని యా నలువతో గట్టిగా మొఱఁబెట్టు కొనుము. ఇఁక నాకుఁ దడవగుచున్నది. శమనా! నేను బోయివచ్చెద.

యము—చిత్తము మునితిలకచంద్రమా! నమస్కారము.

నార—సుఖీభవ. సుఖీభవ. నారాయణ. [9](అనుచు నిష్క్రమించుచున్నాఁడు.)

యము—వింటిరే కింకరులారా? దీని కేమిచేయుదును?

కింక—నారదమునీంద్రుని యుపాయమే బహుబాగుగ నుండినది మహాప్రభూ. (ఇంతలోఁ జాటుననుండి యొకపాపియు, గింకరుఁడును బెనఁగులాడుచు బ్రవేశించుచున్నారు.)

పాపి—అయ్యా! అయ్యా! యమధర్మరాజా! చూడండి. ఈ కింకరుఁడు నన్ను మీయొద్దకు రానీయక బాధించుచున్నాఁడు. ఇంతవఱకు బహుకాలమునుండి నేను మీ లోకంబున నరకబాధ లనుభవించుచున్నాను. ఇప్పుడు భూలోకంబున నామనుమఁడు ఏకాదశీవ్రతం బాచరించినాఁడు. ఈవ్రతమువలన పై మూడు తరములవారును, దిగువ మూడుతరములవారునుఁ గూడఁ బావను లగుదు రని వైష్ణవ పురాణంబులు మొఱఁబెట్టుచున్నవి. కావున నిఁక నాకుఁ బాతకంబు లెక్కడనున్నవి? నామనుమఁడు వ్రతమొనర్చుటచేత నేను పావనుఁడనైనాను. ఇఁక నన్ను బాధించుటకు మీకుఁగాని మీ కింకరులకుఁగాని యొంతమాత్ర మధికారము లేదు. కాఁబట్టి నన్ను స్వర్గలోకమునకుఁ బంపి వేయుఁడు.

యము—సరే, వీనిని స్వర్గమునకుఁ బంపుఁడు. (అని కింకరుల కాజ్ఞాపించుచున్నాఁడు.)

(చాటుననుండి యొక పాపాత్మురాలును గింకరుఁడును బ్రవేశించుచున్నారు.)

పాపి—అయ్యా! నన్నీ కింకరసాయన కొట్టొస్తున్నాఁడండి. నా కూఁతురుబిడ్డే, భూలోకంలోనే, యాకాశ్రతమే, చేశాఁడండి. అందుకని నా పాపాలన్నీ పోయినాయి. నేను స్వర్గానికి పోవాలండి. పంపించండి.

యము—ఈ స్త్రీని కూడా స్వర్గమునకుఁ బంపివేయుఁడు.

(ఇద్దఱు బంధువులతో నింకొక వైశ్యపాపియుఁ, గింకరుఁడును బ్రవేశించుచున్నారు.)

పాపి—రాజుగారండీ! రాజుగారండీ! మాపెద్దయ్య మనమఁడే మా వూళ్ళోనే మొన్న యాకాశిరతం చేశాఁడండి. నేను స్వర్గానికెళ్ళాలండి. ఈఁడే మాపెద్దమ్మ తమ్ముఁడండి. ఈఁడుకూడా మావోఁడేనండి. (అని వాండ్ర నిద్దఱను దగ్గఱఁగా దీసికొని) మేము ముగ్గురముకూడా స్వర్గాని కెళ్ళాలండి.

యము—ఏమీ! మీరు ముగ్గురును స్వర్గమునకుఁ బోవలయునా! ఔరా! స్వర్గమెంత చౌకాయె! సరే. వీరినిగూడఁ బంపివేయుఁడు. (అని యాలోచించి) అహో సభాసదులారా! చూచితిరా యీ విపరీతము.[10] ఆ రుక్మాంగదుండొనర్చు నేకాదశీ వ్రతంబుచే నూతనులు నా లోకంబునకు రాకపోవుటయగాక యిచటి పురాతనులుకూడఁ బాపరహితులై తిమని స్వర్గంబునకుఁ జనుచుండిరి. దీని నింక నుపేక్షింపఁ జనదు. లోకంబు పాడువడుచున్నది. కావున నారదుండు తెల్పిన ప్రకార మీక్షణమే నేను బ్రహ్మలోకంబున కరిగి యా నలువతో నిందుకుఁ దగిన ప్రతీకారం బొండాలోచించెద. మీరెల్లరు మీ మీ కార్యంబులయందు జాగరూకతతో నుండుఁడు. (అందఱును నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయ రంగము—బ్రహ్మలోకము.

(బ్రహ్మదేవుఁడు కూర్చుండి యుండఁగా యముఁడు ప్రవేశించుచున్నాఁడు.)

యము—దేవా! పరమేష్ఠి! వాణీమనోహరా! నమస్కారము.

బ్రహ్మ—సుఖీభవ. సుఖీభవ. ఏమోయి? సూర్యనందనా! ఏమి సమాచారము? నీ లోకంబును ధర్మంబుఁదప్పక పాలించుచున్నవాఁడవే?

యము—ఏమిచెప్పుదును దేవా! ఇంక నే నేడ! నా లోకమేడ! నేను శాలించుట యేడ! భూలోకంబున విదిశాపురంబను నొక్క పురంబు కలదు కదా.

ఉ. ఆ విదిశాపురంబును ధ ♦ రాధిపుఁడొక్కఁడు భక్తగణ్యుఁడై
పావమూర్తినాఁ జెలఁగి ♦ పాలనసేయుచు, విష్ణుప్రీతికై
సేవలొనర్ప నెంచి, యుల ♦ శ్రీహరివాసర సువ్రతంబు నెం
తే విపులాత్మతోఁ సలుపు, ♦ నేమనిచెప్పుదు వానిచిత్రముల్. 20

అత డంతటితో నూరకుండెనా?

గీ. తా నొనర్చిన నా కేమి ♦ తెలుపఁగఁ బోదు
కాని పురజను లెల్లరిఁ ♦ గలయఁ గూర్చి
యా వ్రతంబును భక్తిచే ♦ నాచరింపఁ
జేసి నా పురి కక్కటా ♦ చేటుఁ దెచ్చె. 21

ఈ వ్రత మాహాత్మ్యము చేత

గీ. వార లెల్లరుఁ గలుషముఁ ♦ బాసి తుదను
స్వర్గమున కేగసాగిరి ♦ సరభసమున
కాలు కడ్డినవానికిఁ ♦ గాశి కేగు
టనఁగ మూడంజలనెను సా ♦ మ్యముగ నకటా. 22

దీనిచే నా లోకంబునకు వచ్చువాఁ డొక్కండును గానరాఁడయ్యె. ఇది కాక నాలోకంబునం దిదివఱకు నరకబాధ లనుభవించువా రందఱును ఇప్పుడు భూలోకమునందుఁ దమ పుత్రపౌత్రాదులొనర్చు వ్రతమహాత్మ్యంబునం జేసి తాముఁ బవిత్రుల మయితిమని స్వర్గంబున కరుగసాగిరి. ఔరా!

గీ. ఇంక నే నేల? నారాజ్య ♦ మేల? యిట్టి
లోక మేటికి? కింకరా ♦ నీక మేల?
యగ్నిగుండంబు లేల? యీ ♦ యాసమేల?
వట్టిపెండ్లికి వాద్యంబు ♦ వలెను ధాతా!

వృథగా నిట్టి రాజు నుంచి యేమి ప్రయోజనము? నీవు నాకిచ్చిన యీ

యధికారమును నీవే కైకొమ్ము. ఇదిగో నీవు నాకిచ్చిన కాలదండము; సగము త్రుప్పు పట్టి యున్నది. ఇదిగో నీవు నా కిచ్చిన కాలపాశము. పురి విడిపోవు చున్నది. ఇవిగో నా తక్కిన యాయుధంబులు. కైకొనుము. ఇంక నే నరిగెద.

బ్రహ్మ—శమనా! తొం ద ర నొం ద కు ము.

యమ—తొందరయేల? [11] నాకు సెలవొసఁగి పంపుము. అంతియచాలు.

బ్రహ్మ—శమనా! ఏల నీ వీ లీల నేఁడు తాలిమిఁదూలి బేలవై మాటలాడుచుంటివి? ఆపదలు వాటిల్లితటి ధైర్యం బవలంబించి తప్పించుకొను వెరవు యోచింపవలయుఁ గాని యూరక తొందరనొందవచ్చునా? ఆపదలయందు విస్మయంబును సభా మధ్యంబునఁ దొట్రుపాటును, స్త్రీలయెడ నతి లోలత్వంబును, సామాన్యపురుష లక్షణంబు లని యెఱుంగవే?

యమ—వాణీమనోహరా! నీ పల్కిన వాక్యంబులు నిక్కంబులే కాని నీ వొక్క తూరి నా లోకంబున కరుదెంచి చూచునెడ నింత కాంతహృదయుండవై మాటలాడఁజాల వని తలంచెద.

సీ. కటకటా! పరకాంతఁ ♦ గాంచి కన్ గీటెడు
దుష్టాత్ము మిడిగ్రుడ్లు ♦ తోఁడలేదు
సాధుల దూషించు ♦ చండాలురను బట్టి
కుత్తుకల్ పరపర ♦ కోయలేదు
పతిఁబాసి పరుచెంతఁ ♦ బవ్వళించెడుకాంత
పెళపెళ గుండానఁ ♦ బేల్చలేదు
కులగురుద్రోహులఁ ♦ గ్రూర దుష్కర్ముల
గోలుగోలున నేడ్వఁ ♦ గొట్టలేదు

గీ. బాపురే! ధాత! యిదియెట్టి ♦ వ్రతము కాని
యఖిల దోషంబులకును బ్ర ♦ హ్మాస్త్ర మగుచు
బాడొనర్చెను మల్లోక ♦ భాగ్య మెల్ల
నేమి తెల్పుదు నీహైన్య ♦ మెట్టు లోర్తు?

చ. పలుకుట లొక్క రీతిగను ♦ భావములోన మఱొక్క రీతిగన్
సలుపుట లొక్క రీతిగ నె ♦ సంగెడు దుష్టులఁ బట్టి తెచ్చి, హా
పెళపెళ యగ్ని గుండమునఁ ♦ బేల్చఁగఁ జాలక పోతి; నింక నేఁ
గలిగిన కార్యమేమి? వృథ ♦ కాదె? మహాత్మ!తలంచిచూడుమా.

ఏమి చెప్పుదు వాణీమనోహరా? నాకింకరులెల్ల నిర్వ్యాపారులై, బలకా ర్యంబులువాసి' సోమరితనంబునఁ జెల్లాచెదరై తిరుగుచున్నవారు. అగ్నిగుండం బులు చల్లారిపోయె. ఉక్కు స్తంభమునకుఁ బ్రుప్పుపట్టుచుండె. ఆయుధంబులెల్ల వాయిపోవుచుండె. పాపుల బాధించు శునకంబులును, వాయసంబులును, ఆహా రార్థమై నలుకెలంకులకుఁ బోసాగె. అనుదినంబును నరకబాధ లనుభవించు పాపుల రోదన ధ్వనులచేతఁ బ్రతిధ్వను లిచ్చుచుండు నా లోకంబెల్ల నిప్పుడు దివారాత్రంబులు నిశ్శబ్దంబుగా నిద్రించుచున్నట్టే యున్నది. ఇట్టి దురవస్థం జూచినఁ దొందరగాక శాంతం బెట్లు కలుఁగనేర్చు? ఈ వ్రతంబున కింతటి మాహాత్మ్యం బెట్టుకలిగెనో నాకుఁ దోఁచకున్నయది. దీని కేదైన మార్గం బుండెనేని నాకుఁ దెలియఁజెప్పుము. లేకున్న నా యమాధికారంబును గైకొని యింతటితో సెలవిచ్చి పంపివేయుము.

బ్రహ్మ—ఓహో! శమనా! నే నెఱింగింతు వినుము. ఆ రుక్మాంగదుం డొనర్చు నేకా దశీవ్రతంబు నే నెఱుఁగనిదికాదు. అది వ్రతంబులలో నెల్ల శ్రేష్ఠంబు. దాని మాహా త్మ్యం బింత యని వర్ణింప నలవికాదు.

చ. హరికిని సాటి దేవతయు ♦ నా హరిభక్తులఁ బోలు పుణ్యులున్
హరికథఁబోలుసత్కథయు ♦ నాహరినామముఁబోలుమంత్రమున్
హరిచరితంబుఁ బోలు కృతి ♦ యా హరివాసరతుల్యమౌవ్రతం
బరయఁగ స్త్రిలోకముల ♦ యందును గానఁగ నౌనె యంతకా? 26

క. హరివాసర సద్వ్రతమున
హరియించు ననంతకోటి ♦ యఘ సంఘంబుల్
హరినామ ఘనిన దానికి
సరి వే ఱొకఁ గలదె? జన్మ ♦ సార్థక మనఘా! 27

ఆ రాజేంద్రుండు మహాభక్తుండై యిట్టి మహావ్రతంబు నాచరించుచున్నవాఁడు (అనుమానముతో) ఎట్లయిన నాతని వ్రతంబునకు భంగము కల్గినఁ గాని నీలోకంబు బాగుపడ నేరదు.

యమ—(త్వరగా మాటల కడ్డము వచ్చి) అవును మహానుభావా అందుకే. వానివ్రతంబున కెట్టిభంగినైన భంగంబు వాటిల్లదేని నా లోకంబు బాగుపడుట యరిది. ఇట్టిది యేమైన నీవే చేయవలయు.

శా. పంకంబౌ హరినాభిసీమ జననం ♦ బుగ్గా వింతగాఁ గాంచి, ని
శ్శంకన్ మేటి చరాచరాత్మకప్రపం ♦ చంబెల్లఁ గల్పించి, పై
నింకన్ వేల్పులపెద్దవైతివి; బళా ♦ యీ వించుకం తాత్మలో
సంకల్పించినఁ జాలదే? జరగదే? ♦ సర్వంబు చేకూడదే?.

బ్రహ్మ—శమనా! వినుము: ఈవ్రతంబా శ్రీమహావిష్ణువున కతిప్రీతికరంబు. రుక్మాంగదుం డాయనకుఁ బ్రియభక్తుండు. కావున

గీ. ఈ వ్రతంబునకేనియు ♦ నితని కేని
యెగ్గు నెద్దేనిఁ గావింప ♦ నెంతు మేని
యల్ల శ్రీమహావిష్ణున ♦ కది యనిష్ట
మగునుగావున వెన్కముం ♦ దరయ వలయు.

ఇందుకు సమ్మతింపక మిన్నకుండునెడ నీ లోకం బంతయుఁ బాడగును. మర్త్యలోకంబు పాడుపడి యముని భయంబే లేకపోవునెడ లోకంబున ధర్మాధర్మంబులు నశించును. అనఁగా నరకభయంబు లేకపోవుటంజేసి పాపభయంబును లేకపోవును; దుష్కార్యంబులు మెండగును; విపరీతంబులు కలుగును; దాన సర్వానర్థంబులు వాటిల్లును. కావున నిట్లుభయపక్షంబులును బరికించినచో నెగఁదీసిన బ్రహ్మహత్యయు దిగఁదీసిన గోహత్యయు నన్నట్లుగా నున్నది.

యమ—అట్లయిన నే నేమిచేయుదును? నాకేమియుఁ దోఁచకున్నదే.

బ్రహ్మ—అయినను నా మనంబున కొక్క యుపాయంబు పొడకట్టుచున్నది.

యమ—(సంతోషముతో) సెలవిండు మహానుభావా!

బ్రహ్మ—సావధానంబుగ వినుము.

గీ. ఎట్టి భక్తు నైనఁ ♦ బట్టి పరీక్షించి
తరిచి నిజము నరయఁ ♦ దగును గాదె?
యెట్టి పైడి నైన ♦ గట్టిగా రాతిపై
నొరసి యొరసి విలువ ♦ నరయు కరణి. 30

కావున నీ రుక్మాంగదుని భక్తివిశేషంబును బరీక్షించు సాధనంబుగ నుండునట్టు లెద్దేని యొక్క యుపాయంబు మోహాసక్తులకెల్ల విఘ్నకారిగను, భక్తాగ్రేసరుల కెల్ల గళబంధంబుగను ఉండునటులు ప్రయోగించి చూచెద. దీనిచేత నాతండు వ్రతభంగంబునొంది పిమ్మట వచ్చిన నీ లోకంబునకే రావచ్చును. దానఁ గ్రమంబుగ నీ కీప్సితార్థసిద్ధి యగును.

యము—బహుసంతోషము కామితవరదా. ఎట్లయిన నాతఁడే నాలోకంబునకు రావలయు.

బ్రహ్మ—కాని శమనా!

—* మత్తకోకిల *— మిశ్రగతి.

ఇంతలింతలు సేయ నా ప్రభుఁ ♦ డెంతయున్ భ్రమఁజెందకే
శాంతచిత్తముఁ దాల్చి యింద్రియ ♦ సంగుఁ డింతయుఁ గాక ని
శ్చింత నుండి కలంగఁడేని య ♦ శేష భూవలయంబునం
దింతకంటెఁ బవిత్రులై సుజ ♦ నైకవంద్యుఁ డనంబడున్. 31

కావున శమనా! నీవింక నీలోకంబున కరుగుము. నేను దగు ప్రయత్నంబున నే యుండెద. నీవు తొందర నొందకుము.

యము—చిత్తము చతుర్ముఖా నమస్కారము.

బ్రహ్మ—మనోరథ సిద్ధిరస్తు.

(యముడు నిష్క్రమించుచున్నాఁడు.)[12]

బ్రహ్మ—యముండు బహు కలవర మొందుచున్న వాఁడు. ఇంకఁ దడవు సేయఁ జనదు (అని కొంచెము విభూతిని మంత్రించి యూఁదఁగా నొక్క తరుణి యుద్భవంబై.)
జనకా! నమస్కారము.

బ్రహ్మ—కల్యాణమస్తు. కల్యాణమస్తు. బిడ్డా! నిన్ను జగన్మోహనాకృతిఁ గలదానిఁగ సృజించితిఁ గాన నీకు మోహిని యను నామం బిడుచుంటి. మోహినీ! నిన్నిట్లు త్రిలోకసుందరిగా నీ క్షణమందు సృజించిన కారణమేమో యెఱుఁగుదువా?

మోహి—సెలవిమ్ము జనకా! నీ యుత్తరవున కెదురుకలదా?

బ్రహ్మ—భూలోకంబున విదిశాపురంబును రుక్మాంగదుండను నొక్క రాజేంద్రుండు పాలించుచున్నవాఁడు.

గీ. అతఁడు నిజభక్తి భక్తజ ♦ నాఢ్యుఁ డగుచు
శ్రేష్ఠమయితగు నేకాద ♦ శీ వ్రతంబుఁ
దా నొనర్చుటకాక యం ♦ దఱనుఁ జేర్చి
యాచరింపఁగఁ జేసె మ ♦ హాత్ముఁ డగుచు. 32

క. ఈ పుణ్యవ్రత మహిమను
నా పురజనులెల్ల భవమ ♦ హాబ్ధిఁ దొరఁగుచున్
బాపరహితులై స్వర్గమె
కాపురముగఁ గొంచు నుండ్రి ♦ కాలాంతమునన్. 33

స్వామిద్రోహులును, మిత్రద్రోహులును, అనాచారవర్తనులును, అసత్యవాదులును, చౌర్యక్రియాన్వితులునుం గూడ నీవ్రతమహాత్మ్యంబుచేఁ గలుషరహితులై యంతంబున స్వర్గంబునకే పోవుచుండిరి. కాని నరకలోకంబున కొక్కరుండును రాఁడయ్యె. దీనిచే యమలోకంబు పాడగుచున్నది. కావున నీవు సత్వరంబున జని యెట్లయిన నా భూపాలుని చెంతఁ జేరి

ఉ. ఎందఱునైన మేను మఱ ♦ పించెడి గానరసం బొసంగుచున్
వందలు వేలు కాఁగ మృదు ♦ వాక్యఫలంబుల విందొనర్చి, నీ
యందనురక్తి నెయ్యము మ ♦ హాద్భుతమోహరసంబు, తద్వ్రతం
బందు విరక్తియున్ మఱపు ♦ నాతనికిం గలిగింపు మోహినీ. 34

మోహినీ! నీ వీ కార్యంబు సులభసాధ్యంబని యెంచకుము. ఆ రాజేంద్రుండు వ్రతనిష్ఠుండు; భక్తాగ్రేసరుండు.

ఉ. నీటులు గోటులున్ వగలు ♦ నివ్వెఱపాటులు ముద్దుమాటలున్
బాటలు నాటలున్ మృదుల ♦ భావము ప్రేముడులెల్లఁ జూపి, ము
మ్మాటికి నీవె లోకమను ♦ మాష్కి ధరాధిపుఁ బొంగఁజేసి, పె
క్కేటికిఁ దద్వ్రతంబు మఱి ♦ పింపు మ దెట్టులుకాని మోహినీ. 35

ఇదియే నీవు చేయవలసిన కార్యంబు.

మోహి.—ఆహా! యేమిజనకా నీ వాక్యంబులు! ఇంత సేపు బోధించిన దంతయు నొక్క సామాన్య భూపాలుని వశపఱచుకొనుటకేనా? [13]

క. ఏకాలము కాననముల
నాకలములఁ దించు భ్రాంతు ♦ లపఁచితి మంచున్
వాకొనియెదు మునిముచ్చులు
హా! కన్నులయింట దాసు ♦ లై మన లేదే? 36

ఇంక భూపాలురా!

క. ఉండుట గృహరాజమ్ములఁ,
బండుట మృదుశయ్యలందు, ♦ భక్షించుటయా?
పండులు మధు మాంసంబులు;
నుండుననె జితవిషయుఁ డిట్టి ♦ యుర్వీశులలోన్ ? 37

మునివరులే యట్టు లగుచుండ నిట్టి భూపాలురకై విచారింపఁ బూనునెడ
శ్లో. మహాగజాః పలాయంతే । మశకానాంతు కాగతిః. యనున ట్లుండునుగదా.
ఈతం డేమో వ్రతనిష్ఠుండనియుఁ, ధీరుండనియుఁ బల్కితివి.

ఆ. అట్టి పెద్ద లట్లు ♦ మిట్ట వేదాంతముల్
సభల నిల్చి పెక్కు ♦ చదువ వచ్చు;
వాని చెంత నొక్క ♦ మానిని చేరిన
నగ్గి ఘృతము చెంత ♦ నమరి నట్లు. 38

ఈతనికై నా యాటలు పాటలు వలపులు సొలపులెల్లఁ జూపుమంటివి. జనకా! గోటితో నయ్యెడు కార్యమునకై గొడ్డలిపూననేల? క్రేగంటి చూపు మాత్రం

బుననే వశవర్తి కాఁగల యీ భూపాలునకై నా నేర్పరితనంబులెల్లఁ జూపనేల? శ్లో. వినా యంత్రేణ మంత్రేణ వంచయంతి నరం స్త్రియః. అను నార్యోక్తి వినలేదా? కాన సెలవొసంగి పంపుము. ఈక్షణంబ చని నీ యనుమతంబు చొప్పున నాతని వ్రతంబెల్ల మంటఁగలిపి వచ్చెద.

బ్రహ్మ—బిడ్డా! మోహినీ!

గీ. నీకుఁ గల్గిన యీ నేర్పు ♦ నే నెఱుఁగుదుఁ;
గాని నీనేర్పు నీ వెన్నఁ ♦ గలవొ లేవొ
యంచు నీరీతి నే ముచ్చ ♦ టించి నాఁడ;
దాని నీ మది వేఱుగఁ ♦ దలఁప కబల!. 39

అయినను

ఆ. కార్య మల్ప మంచు ♦ గర్వింపఁగారాదు
ఘనుల కైన జయము ♦ కల్గు దాఁక,
రాముఁ డల్పుఁ డంచు ♦ రావణుం డెంచఁడా?
కాన నేర్పుఁ గల్గి ♦ కడఁగు మబల! 40

సత్వరంబున నీ వీణియం గొని చని, యెట్లులైనఁ గార్యసానుకూల్యంబుఁ జేసికొని రమ్ము. నీకు శుభం బగుఁగాక.

మోహి—చిత్తము జనకా! పోయివచ్చెద. నమస్కారము.

బ్రహ్మ—కల్యాణమస్తు. కల్యాణమస్తు. (ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)

గద్య. శ్రీమదుమారమణకరుణాకటాక్షపాత్ర శ్రీవత్ససగోత్ర బేతపూడి
వంశ క్షీరపారావార రాకాసుధాకర మల్లేశ్వరామాత్యపౌత్ర,
నిరంతర శివారాధనపరాయణ లక్ష్మీనారాయణామాత్య
చతుర్థపుత్ర, గుణకదంబ లక్ష్మాంబాగర్భ సంభూత,
సుజనవిధేయ, భగవంతాభిధేయ ప్రణీతం
బైన రుక్మాంగద నాటకంబున నిది
ద్వితీయాంకము.





శ్రీ

రుక్మాంగద నాటకము.

తృతీయాంకము.

ప్రవేశము:—వెట్టిగాఁడు, పిచ్చిగాఁడు మొదలగు కాఁపులు.

వెట్టి--బాబో! బతకలేము బతకలేము. యీ మేకాలతో అంతా సచ్చిపోయేలా గుండది. పానాలు పోతావుండాయి బాబో.

పిచ్చి—నీమంద మాఁణంగాను. నిన్న రేత్తిరి మేకాలమం దొచ్చిపడి మా మేఁక లంటినీ మెడకాయ లిగఁదీసి నుగ్గుసేసి పారేశినాయి. నాకూట్లో మన్నోశినాయి బాబో బతకలేము.

వెట్టి—పిచ్చిగా! యీరన్నా! పుల్లాయి! పోతా! మల్లేసు! పకీరు! యెంకా అంతా బతికుండారంట్రా?

అందఱు—ఆ. ఆ. బతికుండాము. కాని యెంకఁడు లేఁడు. మేకం యేసుకెల్లిందేమో

పిచ్చి—యెట్టిగా! గుడిచికా డుండాఁడేమో పిలవరా వత్తాఁడు.

వెట్టి—యెంకా! యెంకోయి. (అని పిలువఁగాఁ బలుకఁడు.)

పిచ్చి—గట్టిగా పిలవరా బతికుండాఁడేమో.

వెట్టి—ఓల యెంక యెంక యెంక యెంక యెంకోహోయి!

వెంక—(ప్రవేశించుచు) వోయ్! వోయ్! అన్నా బతికుండారంట్రా? సారల మేకం నన్ను రెక్కట్టు కీడ్సుకెల్లిందిరా. యల్లావుంటే యీ సురకత్తి దీసుకొని దవడగురి కొక్కపో టేసేతల్కి రెక్క యిడిశేశి పారనూకిందిర్రా.

అంద—బాబో! బాబో! నీ యమ్మ కడుపు సల్లఁగా మల్లీ బతికొచ్చావంట్రా.

పిచ్చి—నీకు ఏడుకొండల వెంకన్న పేరెట్టుకున్నందుకు ఆయెంకన్నే బతికిచ్చాఁడురా

అందఱు—నిజం. నిజం. యంకన్నే బతికిచ్చాడు. [14]

పిచ్చి—ఒరే! యఙ్ఞన్నా! యీ మేకాలన్నీ వొక్కపాలిగా వొచ్చిపడ్డాయేంరా?

వెఙ్ఞి—నాకూ అదే సందేయంగా వుండదిరా.

వెంక—ఒరేయి! యవరో అమ్మోరొచ్చిదిగింది సూశావంట్రా?

పిచ్చి—ఏంట్రా! మేకాలమ్మోరంట్రా?

వెఙ్ఞి—పిచ్చిగోలేంరానీది! మేకాలమ్మోరేంట్రా?

పిచ్చి—ఓరి నీ యొటిగూల. యరగవంట్రా మశిసకాలమ్మో రుండదా లేదా? కలారా అమ్మో రుండదా లేదా? జగాలమ్మో రుండదా లేదా? యిది మేకా లమ్మోరు గావాసురా.

వెంక—ఒరే! మడిసిలాగే వుండదిరా.

వెఙ్ఞి—నేను కూడా సూశారా. అంకమ్మ జాతరలోక ప్పెగకుండెత్తుకు నే గణాశారి లా గుండదిరా. తళతళా, తళతళా కన్ను శెదిరిపోతావుండదిరా.

పిచ్చి—యంకన్నా! యక్కడుండదిరా.

వెంక—ఇట్టకా మేశిరియ్య గుడి లేదంట్రా? ఆక్కడే వుండది.

పిచ్చి—ఆదారిని పోతే యంబడీ బడుద్దేమో. యెఙ్ఞన్నా! కొబ్బరికాయలు తీసికెల్లి కొడదామంట్రా?

వెంక—కాదురా. మడిశిలాగే అనపడతా వుండదిరా.

పిచ్చి—(సందేహముతో) మడిశైతే మేకాలుకూడా యీ యమ్మో రొచ్చినప్పుడే రావటమేంయిరా?

వెంక—అదేమో. బెమ్మదేవుడి మాయలా గుండది.

పిచ్చి—యీ యమ్మోరు జాతర కాద్దామంట్రా?

వెఙ్ఞి—అమ్మోరు పేరు తెలవొద్దూ జాతర శెయిటానికి?

వెంక—నిన్న వొవరితోనో మాట్లాడుతావుంటే నేను కసింత యిన్నాను. పేరు మోయినమ్మంట. బెమ్మదేవుండి కూతురంట.

పిచ్చి—(ఆశ్చర్యముతో) ఓరి! మాట్లాడుతావుండదంట్రా! యిదేయి అమ్మోరురా? గుళ్ళో యిగ్గిసం యెలిశిం దనుకొన్నానురా. ఓరి నీయెటిగూల. అమ్మోరు

మాట్లాడకుండ్రట్రా! చరేలే. మెకాలతో మా మంద మన్నయిపోయి యేడుస్తా
వుంటే అమ్మోగమ్మోరంటూ యిదొక్క గొడవ తెచ్చిపెట్టావేయిటిరా?

వెట్టి—మెకాల కేం శాద్దాముర్రా?

పిచ్చి—రాజుగారి కాడి కెళ్లి, శెప్పుకొందాము రర్రా. ఆయినొస్తే యీటంటిని
నుగ్గు శేశి పారేస్తాడు.

వెట్టి—అవునురా, శలాపక దోసకాయి తీసుకోండ్రా. ఆరికిచ్చి శెప్పుకొందాం.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

(ఇది ప్ర వే శ క ము.)

రంగము - రుక్మాంగదుని సభ.

ప్రవేశము:—రుక్మాంగదుఁడు, గుణనిధియను మంత్రి, సేవకుడు.

రుక్మా—మంత్రివరా! గుణనిధీ! మన పురమందలి ప్రజలెల్లరును ఎట్టికొఱంతయును
లేక సౌఖ్యవంతులయి వర్ధిల్లుచున్నవారలే?

గుణ—ప్రభువరా! అందుకు సందియమేమి? వేద వేదాంత వేదాంగోపవేద శాస్త్ర
పురాణేతిహాస కావ్య నాటకాలంకారాదులనెల్లఁ దా మనయం బతి శ్రద్ధా
భక్తులతోఁ బఠియింపుచు వానినెల్లఁ దమ శిష్యపరంపరలకు సదాబోధింపుచుంట
యందతి కుతూహల మానసులై యొప్పు బ్రాహ్మణశ్రేష్ఠులును, దమ యవక్రవిక్ర
మంబున న బ్బలపరాక్రమ శాలియగు కుమారునైన మాఱులేక మీఱఁగల్గు సుకు
మారు లగు రాకొమరులును, కృషివాణిజ్యాదులయం దోర్పునేర్పులు కలిగి
ధర్మమార్గంబుఁదప్పక ధనార్జనము సేయుచు సమిత్రైశ్వర్యసంపన్నులై చెన్నొందు
వైశ్యకులాగ్రగణ్యులును, బ్రాహ్మణాది కుల త్రయ ము వారికి శాస్త్రోక్తముగ
వలయు సపర్యల నతి వినయ భయ భక్తులతో నొనరింపుచు సదా వారల మెప్పు
వడయుచుండు శూద్రకులావతంసులును, మఱియు నీ మొదలగు వార లెల్లరును
సుఖంబుగ వర్ధిల్లుచున్నవారలు.

రుక్మా—మన దీనపోష కాలయంబున నశక్తుల కెల్లరకును వలయు నుపచారంబు
లనుకూలంబుగ జరగుచుండెనే?

గుణ—దేవర యాజ్ఞాను సరణంబుగ నొక్కింతయుఁ గొరంతలేకయే జరగుచున్నవి.

వారెల్లరు దేవర యౌదార్యంబును వేనోళ్ళఁ బొగడుచు నానందించుచున్నవారు.

రుక్మాం—మన ధర్మవైద్యవిద్యాశాలలు సర్వజనోపయోగకరంబులై వెలయుచున్నవే?

గుణ—సర్వజనులకు నమిత సౌఖ్యజ్ఞానదాయకంబులై చెన్నొందుచున్నవి. వీనిచే దేవరవారు శిష్టజనాశీర్వాదపాత్రు లగుచున్నారు.

రుక్మాం—మన యరణ్యమండలి పుళిందులు వనపాలురు లోనగు కాఁపు లెట్టులుండిరి?

(తెరలోపలఁ గలకలము.)

మంత్రీ! ఎచ్చటనో కలకలము వినవచ్చుచున్నదే. సేవకా! ఆ కలకలం బెచ్చటనో యరసిరమ్ము.

సేవ—చిత్తము దేవా. (అని పోయి చూచివచ్చి) దేవరను దర్శించుటకై పంటకాఁపు లరుదెంచిరి దేవా.

రుక్మాం—అట్టు లయిన వారలను లోపలకు రానిమ్ము.

(పంటకాఁపులు ప్రవేశించి)

కాఁపు—మాప్రెబో! దండాలండి. దండాలండి. తమురు మాపొలాలకేశొచ్చిశాన్నా లయింది. శేలన్నీ పాడయి పోతావుండయి. అడివి మెకా లొచ్చి పడ్డాయండి. అయ్యి పెద్దపుల్లు గావు, అయ్యి ఎలుగ్గొడ్లు గావు, అయ్యి అడివిపందులు గావు, నక్కలు గావు, సిమ్మాలు గావు, ఏమిచెప్పంబాబు! అయ్యన్నీ మా పానాలకి మిత్తువుల్లాగ వొచ్చి పడ్డాయుండి. బెమ్మదేవుఁడు యీ టంటినీ వొక్కపాలిగా మాకోసమే పుట్టించాఁడు లాగుండది బాబు. ఎట్టయిన తమురు ఒక్కపాలి దయచేసి ఆ టంటినీ నుగ్గుశేశి పారెయ్యాలి బాబు. లాకపోతే బతకలేము.

రుక్మాం—మంత్రివరా! సింహ వ్యాఘ్ర భల్లూక వరాహ శరభ శార్దూలాది వనమృగ సముదాయంబులచేఁ దమ పంటపైరులెల్ల మంటఁగలియుచున్నవని మాటిమాటికిఁ గంటఁ దడిఁబెట్టుకొనుచు నీ పంటకాఁపులు మొఱలిడుచున్నవారు. కావున నేను సత్వరంబునఁ జని, యీ మృగంబులనెల్లఁ దునుమాడి, వారల యాపద వారింపవలసి యున్నది. నేను మరలివచ్చునంత కొక్కింత తడ వైనం గావచ్చును. అంతదనుక

గీ. నిఖిల భూమండలంబును ♦ నీదు బాహు
పీఠి వహియించి ప్రజలపై ♦ ప్రేమ నించి

పిన్న పెద్దల మన్నించి ♦ వన్నెఁ గాంచి
యేలుచుండుమి యెల్లరు ♦ మే లనంగ. 1

ఉ. ప్రెగ్గడవీవు, బుద్ధిగలిఁ ♦ బెద్దవు, నైన వచింతు; రాజ్యమం
దగ్గలమైన కూర్మి తన ♦ రారఁగఁ జేయుము; గౌరవంబునన్
లగ్గుగ సాధులన్ విబుధు ♦ లన్ దనియింపుము; కీర్తిఁ బెంపుమీ;
యెగ్గతి నైన వారి ముద ♦ మే సకలార్థద మం చెఱుంగుమీ. 2

ఉ. ఏ నొనరించు సువ్రతము ♦ నేగతి రాజ్యమునందు నెల్లెడన్
మానుగఁ జేయుచుండిరొ జ ♦ నంబులు తద్గతిఁ దప్పకుండఁగన్
బూనిక హెచ్చరించుట వి ♦ భుత్వములోనిజెకాఁ దలంపుమీ;
దాననె సద్గతుల్ కలుగు; ♦ దండనముల్ నరలోక సంపదల్. 3

మంత్రి—మహాప్రసాదము రాజేంద్రా! దేవర చిత్తంబున కెన్నండైన మాఱుకలదా? తమ యాజ్ఞల శిరసున వహించి యట్లే చేయువాఁడ.

రుక్మాం—మంచిది. కాఁపులారా! మీరు భయమునొందక పొండు. నేను వచ్చి యా మృగంబుల నెల్లఁ దెగటార్చెద. మంత్రీ! నే నింకఁ బోయివచ్చెద.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయ రంగము - అరణ్యము.

(విల్లు నమ్ములు తీసికొని రాజును, సేవకుఁడును, కాఁపులును, సముచిత పరివారంబును ప్రవేశించుచున్నారు.)

రుక్మాం—సేవకా, యీచిత్రముఁ జూచితివా?

ఉ. ఎన్నఁడు మానవాళి నొక ♦ యింత యెఱుంగని యీకురంగముల్
కన్నులవింతగా మనలఁ ♦ గాంచిన యంతనె భీతిఁ జెందుచున్
గ్రన్నన వాయువేగమునఁ ♦ గా లిల మోపనియట్లు ఱివ్వునన్
వన్నెలుకుల్కఁగా నెటులు ♦ పాఱుచునున్న వొ చూడు మీపెసన్

సేవ—చిత్తము. చెంగు చెంగు మని యెగురుచున్నవండి.

రుక్మాం— సేవకా! ఈ యడవిపంది యెంతక్రొవ్వినది!

ఉ. అక్కటయీమృగంబు కడు ♦ హాయిగఁ గాఁపుల పైరుపచ్చలన్
జక్కఁగ మెక్కి క్రొవ్వి యది ♦ చాలక యల్లదొ! చూడు! చూడు! పై
మిక్కిలి నన్ను సన్నకట ♦ మ్రింగెడురీతిని ధిక్కరించు; నేఁ
డొక్క శరాన దీని నిట ♦ నుక్కడఁగించెదఁ జూడు వేగమే. 5

సేవ— అవునండి. క్రొవ్విందండి. చంపెయ్యాలిసిందే. రేపు కూరకైనా వస్తుంది. నా కొక్క తొడ మాత్ర మిప్పించండి.

రుక్మా— ఛీ నీచా! యుక్తాయుక్తవిచారజ్ఞానముగల మానవజన్మం బెత్తి వ్యాఘ్రజంబుకాదివనమృగంబుల వలె జీవహింసచేత నేల పొట్ట నింపుకొనవలెను? ఆయురారోగ్యకరములగు పాలు, పండ్లు, చక్కెరలను భుజించిన మహానందజనకముగ నుండదా? ఇదికాక

గీ. శిష్ట సంరక్షణంబును ♦ దుష్ట నాశ
మొనరఁ గావింప నీ వేఁట ♦ యొప్పుఁ గాని
పొట్ట నిండింపఁగా నిట్లు ♦ పూనె నేని
నీచ లుబ్ధుని కృత్యమై ♦ నెగడుఁ గాదె? 6

కావున దుష్టమృగసంహారంబుఁ గావించుటయే మనకుఁ గర్తవ్యంబు. సేవకా! యీమృగము పాఱిపోవ నుంకించుచున్నది. మీరందఱు నటుతిరిగి యడ్డము రండు. నేనీవైపునుండి తఱుముకొనివచ్చెద. (అందఱును జాటునకుఁ బరుగెత్తుచున్నారు. విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు)

విదూ— రాజుగారిని జూడఁగానే ప్రతివారును "విదూషకుండెక్కడ? విదూషకుండెక్కడ?" యనుచుందురు. ఈయనగా రిప్పుడు కత్తులు కటారులు ధరించి యీ తుంటరిమృగములపై కంటగించి వెంటనంటి ముక్కంటి వింటిపోటులం బలె యంటరాని మంటలెగయ దంటపోటులఁ బెక్కింటి మంటగలుపుచున్నవాఁడు. అబ్బో! ఇంటనొంటిగఁ బడియుండక యీతని వెంట నాకీ తంటలేల? యీ వెంట నొక పొదరింటనుండి యీతఁడు శాంతుఁడైయుంటఁ నాకంట గాంచిన వెంటనే వచ్చెదను. (అని మఱుఁగున కరుగుచున్నాఁడు.)

(రుక్మాంగదుఁడును, సేవకుఁడును మరలఁ బ్రవేశించుచున్నారు.)

రుక్మాం—సేవకా? ఇఁక మృగంబు తెచ్చుటను గనవచ్చుటలేదు. అన్నియు మడిసినట్టులే యున్నవి.

సేవ—చిత్తము. చచ్చిపోయినవండి.

రుక్మాం—అబ్బా! యిప్పటికిఁగదా నా చిత్తమునకు విశ్రాంతిఁ గంటిని!

(విదూషకుఁడు సమీపించుచున్నాఁడు.)

రుక్మాం—మిత్రమా? విదూషకా! ఇంతసే పెచటనుంటివి?

విదూ—ఈ సమీపమందే యుంటిని. కాని యింతసేపటినుండి మీరును, మీపరిజనులును ఈచుట్టుప్రక్కల నంతటను మృగంబుల వేఁటాడుచుంటచేత ఆమృగంబులకు వెఱచియు, ఆసమయమందు మిమ్ము సమీపించుటకు వెఱచియు, మా తాతమ్మను మరలఁ జూచెదు ప్రాప్త మున్నదో లేదో యని ప్రాణములు మూట కట్టుకొని యొక పొదచాటునఁ గూర్చున్నాను. ఇప్పుడు మీచేత నామృగములన్నియు మడియుటచేతను, మీ రిప్పుడు శాంతచిత్తులై యుండుటచేతను మెల్లఁగా బయలుదేరి వచ్చితిని.

రుక్మాం—ఆలాగా? ఎంతపిఱికివాఁడవు!

విదూ—పిఱికివాఁడనా? మొన్న తమ దివాణములో ద్వాదశీ పారణ సమయమందుఁ జూచినఁ గనఁబడియుండును నా ప్రతాపము. పంక్తిక్రిందఁ బెట్టిన గారెముక్కను మరలఁ గనఁబడనిచ్చితినా? మీ ప్రతాప మిక్కడ. నా ప్రతాప మక్కడ.

రుక్మాం—బ్రాహ్మణుఁడవు గనుక భోజనకాలమందు నీకుఁ బ్రతాప ముండవలసినదే.

విదూ—భోజనకాలమందు మాత్రమేనా? మొన్న మీ దివాణపు కుక్క తఱుముకొని వచ్చినప్పుడు నేను ఎగఁబడి పరుగెత్తుచుండఁగాఁ జూచి యందఱును ముక్కున వ్రేలు వేసికొన లేదా? కాని దానికేమైన దొరకితినా? అది మఱింత దగ్గరకు వచ్చినప్పుడు నేను కూలఁబడి లబ లబ లబో యఱచేటప్పటికి దాని గోలకన్న నాగోల యెక్కువయినదని యదరి యచటే నిలువఁబడి పోయినది. నాకేమైనఁ బ్రజ్ఞలలోఁ దక్కువనుకొన్నారా యేమి!

రుక్మా—మిత్రమా! లెస్సగఁ గాచి పూచిన యౌవన మెంతరమణీయముగ నున్నది!

విదూ—అయ్యోరాజా! నీవు దీనికే సంతోషించుచున్నావటయ్యా! మా యింటి

పొరుగున నొక వనముఁ జూచినాను. ఎఱ్ఱగాఁ బారాణి ముద్దలవంటి పండ్లతోను, బసుపుముద్దలవంటి పుష్పములతోను, జంఘ్యాలు వడుఁకు కదుళ్ళవంటి దివ్యమైన ముండ్లతోను, విసనకఱ్ఱలవంటి మట్టలతోను, పేదబ్రాహ్మణ గృహమువలెఁ జూచుట కెంతరమణీయముగనున్నది? అది దొడ్డిచుట్టున నుండు నెడ దొడ్డిలోని కొక్క పందిరైన రాఁజాలదు.

రుక్మా—దాని పేరేమి?

విదూ—దాని పేరా? రక్కసవనమని మావాళ్ళు ముద్దుముద్దుగఁ బిలుతురు.

రుక్మా—కమ్మని పుష్పాసవమ్మెల్లరయమ్మున మెక్కి, చెవులు బమ్మెరవోవ తుమ్మెద లేఁ డెట్లు జుమ్మని రొదసేయుచుండెనో కాంచుము.

విదూ—నే నింతకంటె నెక్కుడుగ నేవిన్నాను. మావీధిని నిన్న రాత్రి యంతయు బుంయ్ బుంయ్ అని ప్రత్తిరాటములు మ్రోగుచుంటే యా రొద దీనికంటె బదిరెట్లెక్కుడుగ నుండినది.

రుక్మా—మకరందాపేక్షచేత నీ తుమ్మెదసమూహ మా పద్మవనమ్ముపై నెట్టులు క్రమ్ము చున్నదో చూడుము!

విదూ—ఓ యబ్బో! మొన్న మాయూరి వనసంతర్పణమందు సరియైన పెత్తనము లోపమగుటచేత నల్పజాతులవారెల్లరు నగ్రజాతులవారి భోజనపంక్తులమీద నింతకన్న నెక్కుడుగఁ గ్రమ్ముకొనిరి.

రుక్మా—మిత్రమా! యీ వంకఁ జూడుము.

ఉ. అల్లదొ పత్రవృంతముల ♦ నల్లన యూఁచి శ్రమంబుఁ దీర్చుచున్
గొల్లగ సత్ఫలంబు లివి ♦ కొమ్మనురీతి శిరంబు వంచుచున్
సల్లలిత ప్రసూనముల ♦ శయ్య నమర్చి మహాదరంబునన్
బెల్లుగ భృంగరావములఁ ♦ బిల్చెడు రంభను గంటె మిత్రుడా? 7

విదూ—రాజా! నీచిత్తము నేఁడు రంభాభోగము నపేక్షించుచున్నదే! సరి సరి! రంభైతే నేమి? రంభ చెల్లెలైతే నేమి? పిలిచినమాత్రముచేత నమ్మి నీవు చెంతకుఁ బోవచ్చునటయ్యా? ఆ రంభ తానే నీ యొద్దకు రారాదా?

రుక్మా—అట్లు వచ్చుట యస్వాభావికము కదా.

విదూ—అస్వాభావిక మేమి? కాళ్ళు లేవా? కన్నులు లేవా?

రుక్మాం—రంభ యనఁగా నేమనుకొనుచుంటివి? అరటిచెట్టు నుద్దేశించి నేను పల్కుచుంటిని సుమా.

విదూ—(నవ్వుచూ) అయ్యోరాజా! అలాగటయ్యా? నీవు రంభయనుటతోనే చెక్కపేడువంటి చక్కని మోము కలిగి, గుజ్జుపుజాలువంటి మెత్తని కురులు కలిగి, చింతాకులవలె విశాలమయిన కండ్లు కలిగి, రంభవలె నెదురుగావచ్చు నా భార్య జ్ఞప్తికివచ్చి, యింతసేపటినుండి నామనసు కుడితి కుండలోఁ బడిన యెలుకపిల్లవలెనే తత్తరపడుచున్నది. (ఆలోచించి తలయూఁచి) ఏలయో కాని సంకల్పసిద్ధుఁడవగు నీ వాక్కున నీ దినమందు రంభయనియు, శయ్య యనియు నిత్యాది వాక్యములు వెలువడినవి. ఎట్లయినను మహారాజవయ్యా నీకేమి.

రుక్మాం—చెలికాఁడా? నాకు బడలికగా నున్నది. కొంచెము సేపీయశోకంబు నీడను విశ్రమించి సేదఁ దీర్చుకొనియెద. (అని పరున్నాఁడు.)

విదూ—చిత్తము. నేనును ఈ సమీపమందే కూర్చుండియుండెదను.

(అని యెడ కలుగఁ బోవుచున్నాఁడు.)

(మోహిని ప్రవేశించుచున్నది.)

మోహి—ఆహా? నాజనకునియొద్ద నెన్నియో పంతంబు లాడి వచ్చితి. ఈ రాజేంద్రు నెట్టులు వశవర్తిఁగాఁ జేసికొనఁ గలుగుదునో. అయినను జనకుని పనుపున నరుదెంచిన మరుం డొక్కరుండు మాత్రము తన బలంబులతోడ నాకు సహాయకరుండై యుండుఁగదా.

(తెరలో)

ఓహో పరివార జనంబులారా! మన ప్రభుండగు రుక్మాంగదమహారాజుగారు వేఁటాడి యలసి యీ యశోకంబునీడను విశ్రమించియున్నారు. ఇప్పుడే మీరు పోయి మీ మీ యవశ్యకృత్యంబులఁ దీర్చుకొని మరల సత్వరంబున నరుదెంచు పొండు.

మోహి—(ఆలకించి) ఏమీ? రుక్మాంగదుఁ డిచటనే యుండెనా?(అని హర్షముతో నటునిటు చూచి) ఇచట నెవ్వరో నిదురించి యున్నారు. ఈతఁడే రుక్మాంగదుండై యుండునా? (అని కొంచెము సమీపముగా నరిగి పరీక్షించి) నా జన

కుండు తెల్పిన రూపరేఖాదులీతనియం దగపడుచున్నవి. ఈతఁడు కిరీటధారియై యున్నవాఁడు. అవలినుండి పరిజనులు "ఈ యశోకంబునీడను నిదురించుచుండెను" అని రుక్మాంగదునిం బేర్కొనుచున్నారు. కావున నీతఁడే రుక్మాంగదుండు. మృగయా వినోదంబున నలసి సొలసి యీ యశోకంబునీడ నశోకుండై గాఢనిద్రం జెందియున్నవాఁడు. (అని యాలోచించుచు) ఇపుడు కర్తవ్యంబేమి? నే నేమిచేయుదును? ఈతని నెట్లు సమీపింతును? ఈతండు వ్రతనిష్ఠుండనియు ధీరుండనియు నాజనకుండు ముందే తెల్పియుండె. ఇట్టి యీతండు నాకెట్లు వశుఁడగును? నా జనకునియొద్ద వారుచెరనక నూరక నోరికివచ్చినట్టులు కారులాడివచ్చితి. ఇవ్విధంబున పాటిపువ్వుఁబోఁడులలో నేను నవ్వులపాలు కానుంటిఁ గాఁబోలు.

(తెరలో)

ఏమి యీ వింత! ఈమె నా సామర్థ్యము నింకను గుర్తెఱుఁగనట్లు కనఁబడుచున్నదే.

మోహి—(అలకించి తనలో) ఎవ్వరా భాషించువారు? (అని యాలోచించి) ఓహో, మన్మథుఁడా.

(మరలఁ దెరలో)

చ. హరుఁడొక యర్ధదేహము బ్రి ♦ యాంగన కర్పణచేసె; మేటిమం
దరధరుఁడుర్వహృదబ్జమున ♦ ధాత ముఖంబునఁ దాల్చిరింతులన్;
మరుఁడనుమాత్రనే త్రిభువ ♦ న ప్రభువర్యులె యిట్లు కాఁగ, భూ
వరుఁడన నెంతవాఁడు సుమ ♦ బాణపరంపర దాఁకఁజొచ్చినన్. 3

మోహి—ఔనౌను. సుమసాయకా! నీ పరాక్రమము నే నెఱుంగుదును. త్రిలోకవిజయుండను బిరుదు నీకే తగును గదా. (అని తనలో) ఔరా, మదనుఁ డెంతగ నొచ్చుకొనెను! స్వప్రయోజకత్వనిరసన మెవ్వరికిని దుర్భరము కదా. అయినను నే నూరక సంశయించుటయె కాని యీ రాజేంద్రుండు వశుండు గాక యుండునా.

చ. విలు చెవికంటసీడ్చి వెడ ♦ విల్తుఁ డురమ్ము వ్రణమ్ము సేయఁగన్
మలయుచు గాఢయావనత ♦ మఃపటలంబొగిఁ గండ్లఁ గప్పఁగన్

గలకలనవ్వుచుఁ జెలి యొ ♦ కర్తుక చెంగట సొంపు నింపఁగన్
వలవకయుండ వీని మది ♦ వజ్రమొ, లోహమొ, రాయొ, చూచెదన్

ఈతని వశపఱుచుకొనుటకిదియే మంచిసమయమని తలంచెద. ఏలయన [15] నిచ్చటి శుకపికంబుల కలకలారావంబులును, తుమ్మెదల ఝుంకారంబులును, మలయానిలంపు సోఁకులును, కేకిగముల కేకలును, పూఁదేనెకాల్వలునుఁ జూడ నెట్టి విరాగులనైన సరాగులఁగావింప సమర్థంబులై కన్పట్టుచున్నయవి. ఇట్టి వనమధ్యంబున నీ రాజేంద్రుం డొంటరిపాటున నుండుతఱి నీతని దృష్టిపథంబునం బడుటకన్న నెక్కుడగు సమయం బిం కెట్లు లభింపఁగలదు? అయినను

సీ. పరుచెంతకును దాఁక ♦ పడఁతి పోఁగూడదు
కూడినఁ దానె మా ♦ టాడఁ జనదు
ఆడిన సరసంబు ♦ లాడఁగాఁ జెల్లదు
చెల్లిన మర్మంబుఁ ♦ జెప్పఁ దగదు
చెప్పిన నాసించి ♦ చెల్మి కోరఁగ రాదు
కోరినఁ దానె పై ♦ కొనఁగఁ జనదు
పైకొన్న నాత్మలో ♦ భ్రమఁజెంద నొప్పదు
చెందిన వానిచేఁ ♦ జిక్కరాదు

గీ. వాని చెంతకుఁ బోనేల ♦ పలుకనేల?
భ్రాంతిపడనేల? మరియేమొ ♦ బాధ లేల?
చాన యొక్కింత క్రీఁగంట ♦ సైగ సేయఁ
బసుగు వెట్టుచు నతఁడె రా ♦ వలదె వెంట?.

నేను త్వరపడి యీతని యెదుటికిం జనఁగూడదు. ఎట్లయిన నాతని నే యిచటికి రప్పింపవలయు. కావున నీ సంపగివృక్షంబునీడం గూర్చుండి యొక్కపాటఁ బాడెద. దీనిచేత నీ రాజేంద్రునకు మెలఁకువ కలిగిన పిమ్మట నీతని మనోవ్యాపారం బెట్లుండునో చూచి యప్పటి కనుగుణంబగు రీతిని వర్తించెద.

(అని యొకప్రక్కగాఁ గూర్చుండి పాడుచున్నది.)

—*ద్విపద.- ఖమాచిరాగము.- ఏకతాళము.- మిశ్రజాతి*—

[16] అల్లరిమారుని ♦ యలయికలకును
బెల్లుగ వడఁకి ని ♦ స్త్రాణపాటుఁ జెంది
మల్లడిఁగొనియెడు ♦ మానినీమణుల
నల్లిబిల్లిగ నేలు ♦ నతఁడె ఘనుండు.

రుక్మా—(సగము లేచి అటునిటు చూచి తనలో) ఎచ్చటనో వీణాగానంబు వినవచ్చుచున్నది. (అని యంతలో మరల వినఁబడకుండుటంజేసి) లేదే. కలగంటిఁగాఁబోలు. (అని మరలఁ బండుకొనుచున్నాఁడు.)

మోహి—(కొమ్మలచాటుననుండి చూచి, తల పంకించి, మరల)

మక్కువఁ గలచెలి ♦ మడుపు లిచ్చుచును
బ్రక్కనిలిచి ముద్దు ♦ పల్కులు పల్క
గ్రక్కునఁ బైకొని ♦ కౌఁగిట నలము
చక్కని సామియె ♦ సరసుఁ డెన్నంగ.

రుక్మా—(ఆశ్చర్యముతో లేచి కూరుచుండి) మఱియు వినవచ్చుచున్నదే! ఇది కలకాదు. ఎవ్వరో నిజముగనే గానము సేయుచున్నట్టు లున్నది. ఈ నిర్జనాటవి మధ్యంబున నెవ్వరు గానము సేయవత్తురు? అయిన నింకఁ గొంచె మాలకించి, దీని వివరం బెఱింగెద.

మోహి—ఆటపాటలను స ♦ య్యాటలఁ జూపి
నీటుకాఁ డంచును ♦ నెఱజాణ యంచు
మాటికి యువతుల ♦ మాన్యతఁ గనిన
మేటియే చర్చింప ♦ మిగుల ధన్యుండు.

రుక్మా—ఇది యేమో స్త్రీకంఠముగా వినవచ్చుచున్నదే! ఎవ్వరో స్త్రీలు తమ శారీరంబునకు వీణియం జతచేసికొని, జంత్రగాత్రంబుల సమంబుగఁ గానంబు సేయుచున్నట్లు తోఁచెడిని. అయిన స్త్రీ లీ విపినమధ్యంబునకు రాఁ బనియేమి? దీనికి గతం బేమైయుండును?

మోహి—చెంత నిలుచు ముగ్ధు ♦ చెలుల సవ్వేళ
వింత లొనర్చి, బల్ ♦ వేడ్కలఁ దేల్చి,
కంతురాజ్యము చూఱఁ ♦ గాఁగొన్న ఘనుఁడు
పంతమేటికి భగ ♦ వంతుఁడ తలఁప.

రుక్మాం—(మహానందముతో)

ఉ. బళిరా! యీమృదుగానవైఖరులు, నీ ♦ భావార్థసందర్భముల్
బళిరా! యీపదసౌష్టవంబు, ఫణుతుల్ ♦ మర్త్యాంగనల్ నేర్తురే?
అలపద్మాత్మజులగానముల్ వినమె? యీ ♦ యానందముం జెందమే?
కలదే యీసుఖ, మీ రసంబు రుచి యీ ♦ కంఠస్వరం బచ్చటన్?

కాన దేవతాగణంబులలో నెవ్వరైన విహారార్థముగ నిటు పోవుచుఁ బాడుకొనుచుండిరేమో.

మోహి.—(లేచి, రాజునకుఁ గొంచెముకొంచె మగపడునట్లు కొమ్మలఁ జాటుచేసికొనుచు, నొక్క ప్రక్కనుండి మఱియొక ప్రక్కకుఁ బోవుచున్నది.)

రుక్మా—ఆహా యిది యేమి! నా కన్నులయెదుట నేమో మెఱసినట్లున్నదే! ఇది యేమైయుండును. అయినను గొంచెము సమీపముగా నరిగి నిజం బెఱింగెద. (అని సమీపించి చూచి యాశ్చర్యముతోఁ దనలో) ఓహో! యిది యెవ్వరో స్త్రీయైయున్నది. ఈ సుందరాంగి యెవ్వరైనను దీని రూపయౌవన సౌందర్యంబులు మాత్రము నా కనులకుఁ బండువు సేయుచున్నవి. సెబాస్! చక్కదనంబన్న నిట్టు లుండవలయు!

క. ఈ పడఁతి వగ యొయారము
రూపము నవయౌవనము ని ♦ రూఢ సుతేజం
బే పురుషుఁడు కని మనసిజు
తాపులఁ బడకుండు నిద్ధ ♦ రావలయమునన్. 16

ఉ. పాటలగంధిమోవి పరి ♦ పాటిగఁ గెంపనఁజెల్లు, మోము ము
మ్మాటికిఁ జంద్రుఁడే, తిలసు ♦ మంబగునాసిక, మిన్నకౌను, పె

క్కేటికి యీ మృగాక్షి సాగ ♦ సెన్నఁగ బ్రహ్మకు నౌనె? యూరకే
మాటలకేమి? దీనిసరి ♦ మానినిఁ గానఁగనౌనె? ధారుణిన్. 17

ఉ. అప్పరమేష్ఠి యేఁటికొ కృ ♦ తార్థునిఁ జేయఁ దలంచిరో, భువిన్
గొప్పతనంబుఁ జూపుకొనఁ ♦ గోరుచునో, తన సృష్టినెపుడుం
దప్పక యీ మృగాక్షినిటు ♦ తద్దయుఁ గోరి సృజించెనాఁగ, హా!
యొప్పుగఁ దీర్చి దిద్దినటు ♦ లున్నవి దీసి తనూవిలాసముల్. 18

ఔరా యి దేమిచిత్రము! ఎవ్వరినో పరకాంత నిచటఁ గాంచి నేను వర్ణింపుచుంటినా! ఇది యెంత గర్హితము! చిత్తమా! ఏల నన్నీ లీలఁ దూలఁజేయుచుంటివి.

చ. జగమున నన్యకామినుల ♦ సంగతి కూడదు కూడదంచుఁ, బె
న్వగలకు మూలమంచుఁ, గడుఁ ♦ బాతకమంచు, ననర్థమంచు, నె
న్నఁగ బహుదూష్యమంచు విని ♦ నాఁడను బెద్దలు తెల్ప; నక్కటా
తగదిది; నన్ను నీ పనికిఁ ♦ దార్పకు చిత్తమ! నీకు మ్రొక్కెదన్.

చ. అగడుఘటించు లోకమున; ♦ నార్యులు మెచ్చరు; పిన్నపెద్దలున్
దగదని మందలించెదరు; ♦ తండ్రి యదల్చును; తల్లితిట్టెడున్?
బగతురు గేలిసేయుదురు; ♦ బందుగు లోర్వరు; కాన నక్కటా
తగదిది; నన్ను నీపనికి ♦ దార్పకు చిత్తమ! నీకు మ్రొక్కెదన్.

(అని కొంచెము సేపాలోచించుచు నిలిచి మరలఁ దనలో) అయినను గొంచెము సమీపముగా నరిగి యీ తరుణి యెవ్వరో, ఇట్టు లొంటరితనంబున నరణ్యంబులం గ్రుమ్మర గతంబేమో విచారించెద. (అనుచు నడుచుచున్నాఁడు.)

విదూ—(ఈ పల్కులు చెట్లచాటుననుండి వినుచుఁ దనలో) శ్లో. బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి. అని చెప్పఁబడిన యార్యోక్తి వ్యర్థమగునా? అయినను నా కేల? నే నరిగెద. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

రుక్మా—(కొంచెము సమీపముగాఁ జని మోహినిం గాంచి.)[17] తరుణీ నీ వెవ్వరిదానవు? నీ జనకుని నామం బెయ్యది? నీ వరుం డెవ్వరుండు? శరభశార్దూలాది నానావిధ దుష్టజంతుసంతానమ్ములకెల్ల నాకరమ్మయి భీకరమ్మగు నియ్యరణ్య

మధ్యమ్మున నీ కేమికతమ్మున నేకతమ్ము భ్రమమ్మురమంటివి? అబ్జవదనా! అల చందమామ యందమ్మునైనఁ గ్రిందుపఱుపసమర్థంబగు నీ మందహాసాంచిత సుందరవదనారవిందంబు నీ వేఁడివెలుంగుల తీని వెలుంగుఁ కేల లోనుఁజేసి తివి? నిక్కంబు వక్కాణింపుము.

మోహి— నేను బ్రహ్మమానసపుత్రిని. మోహిని యను నామంబునఁబరఁగుదాన. నాకు వశం డెవ్వరుండు లేఁడు. మజ్జనకు ననుమతంబున నీచేరువ దేవళమందలి యిష్ట కామేశ్వరునారాధింపుచు నివ్వనప్రదేశంబున స్వేచ్ఛావిహారంబున నుండుదాన. పరపురుషుని కన్నెత్తియైనఁ జూచియెఱుఁగ.* ఇట్టి మాబోంట్లతో మీకుఁ బ్రసంగంబు లేల? మాది మందహాసాంచితవదనమైన మీ కేల? యమందహాసాం చితవదనమైన మీ కేల? మీర లెవ్వరో యేమి కారణంబున వచ్చితిరో విచారించుకొని మీదారిని మీరు పోవుట యుత్తమంబగు. కాని యేకాంతంబుననుండు నింతులఁ జెంతలఁ జేరి వింతవింతల నాడు టెంతయుఁ జనదని యెఱుంగుఁడు.

రుక్మాం— (తనలో) ఈ కాంత పలుకరించినమాత్రముననే తిరస్కార భావము జూపుచున్నది. కావున నెట్లయిన నేని ధరాధీశుండ నని యిపు డెఱిఁగించుట యుక్తంబని తోఁచుచున్నది. (ప్రకాశముగా) తరుణీ! "మీర లెవ్వరో యేమి కారణంబున వచ్చితిరో" యంటివి. చక్కఁగా నడిగితివి. స్త్రీలు సమయోచిత ప్రసంగంబులందు నేర్పరులౌట జగత్ప్రసిద్ధమేకద. విధితనయా! ఎఱింగింతు వినుము.

గీ. వనమృగంబుల వారికిఁ ♦ గనలి నాడు
పురజనంబులు బెగడొంది ♦ మొరలువెట్ట
సరగ శ్రమములఁ దొరఁగించి ♦ సాధుజనులఁ
గావ నరుదెంచినాఁడ రు ♦ క్మాంగదుండ.

మోహి— ఓహో! నీవు రుక్మాంగద భూపాలుండవా? సరి సరి.

రుక్మాం— మతికొంచె మాలకింపుము.

గీ. రమణి! మదధీనమగు నిట్టి ♦ రాజ్యభూమి
నబల లేలయొ వెంటఁ దోఁ ♦ డైన లేక

రెయింటి వనములఁ గ్రుమ్మరు ♦ చుంటఁ గాంచి,
యోర్చి, యన్యునిగతి నూర ♦ కుండఁ గలనె? 22

ఇదికాక మందయానా! ఏమికారణంబుననో కాని నిన్నుఁ జూచినదాదిగ నీయందు నాకపరిమితానురాగంబు కల్గుచున్నది. చంద్రముఖీ! నీ ముఖావలోకనంబుఁ జేసినమాత్రంబున నా బంధుమిత్రాదుల నెల్లరఁ జూచి నంతటి యానందంబు కలుగుచున్నది. చిలుకలకొలికీ! పలుకుపలుకునఁ దేనె లొలుకు నీ వచనామృత పానంబుచేఁ జొక్కి మన్మనంబెల్లఁ బరవశత్వంబు నొందుచున్నది. ఇంతయేల? చూడఁజూడ నాశరీరంబే నీకు దాసత్వంబునకై యర్పణంబు చేసిన సార్థకం బగునని తోఁచెడిని. కురంగనేత్రీ! నీ వేల యిట్లు బెదరి బెదరి చూచుచు దూరంబున నిలిచెదవు?

గీ. అతివ! నీ విట్లు చిరకాల ♦ మట్టె నిలిచి
ముచ్చటలు సల్ప నా మేను ♦ నొచ్చు చుండె;
తరుణి! పెరవాఁడ నేఁ గాను; ♦ ధరణివిభుఁడ;
ముదముతో నిటఁ గూరుచుం ♦ డెదవు రమ్ము. 23

(అని చేయి పట్టుకొనఁ బోవుచున్నాఁడు.)

మోహి.—(కోపముతో వెనుకకుఁబోయి) ఛీ! దంభజ్ఞాన ధురంధరా! [18]

ఉ. కన్నులుకానరావ? పర ♦ కాంతలటం చనుకోవ? యెట్టి సం
పన్నులకేని యిట్లగునె, ♦ భావ్య మెఱుంగఁగ లేవ? దొడ్డరా
జన్ననునీవ! చాలు, ఘన ♦ మైనది రాచరికంబు; పొమ్ము, నీ
కన్నెలు నూర్వు రింట నినుఁ ♦ గానక పాప మదెట్లులుండిరో

చాలుఁజాలు రాజేంద్రా! దూరంబున నిలువుము. పరనారియటంచు వెఱపింతయు లేక బిరబిర దరింజేరి కరంబు పట్టవచ్చెదవుగా! ఇవియేనా మీ రాచరికంపు మర్యాదలు? రాజ్యమదాంధకారం బేమైనఁ గన్నులఁ గప్పెనా యేమి! రాజఁట! రాజాధిరాజఁట! దినరాజవంశజుండఁట! ధర్మాధర్మ విచారణా దక్షుండఁట! పరసతుల నొంటరిపాటునఁ గన్నతఱి నిత్తెఱంగున వెంట

నంటి ముట్టవచ్చునఁట. చాలుఁజాలు. నీ రాజ్యంబు[illegible]యు సంతసించితి. చెలీ యటంచుఁ జేరవచ్చెదవుగా! బాగుబాగు. నీవు పిన్ననాఁటనుండి చదివిన చదువులెల్ల నిప్పు డొక్క యరగడియలోనఁ జెల్లుగ వల్లించితివి. మిక్కిలి యలసితివి కాఁబోలు. సత్వరంబున నీ పురంబునకుఁ బొమ్ము.

రుక్మాం—ముద్దుగుమ్మా! నీ వేల నన్నిట్టులు తూలనాడెదవు?

ఉ. కల్లలు కావు; నిన్ గనులఁ ♦ గాంచినదాదిగఁ బుష్పబాణుఁడై
యల్లరిమన్మథుండు నను ♦ నారడిపెట్టెడు నోర్వఁజాల; ను
త్ఫుల్లసరోరుహాక్షి! కడుఁ ♦ బుణ్యము నీ కగు నాదరింపవే;
చల్లకువచ్చి ముంత నిఁక ♦ చంకను దాఁపఁగ నేల? తెల్పితిన్.

అహింసా పరమో ధర్మ యను న్యాయానుసరణంబుగ నీ వొక్కింత దయం బూని నన్నుం జేపట్టి మారుఁడను పెనుభూతంబుచే నే నొందుచున్న యీ బాధ నివారింపకున్న నే నెవ్వరివాఁడనగుదు. నేను బరసతిని ముట్టితినంటివి. నీకెవ్వండు వరుండు లేఁడని ముందే తెల్పితివికదా. నీ వెట్లు పరుని సతివి కాఁగలవు?

గీ. తరుణి! దాఁపఁగనేల? గాం ♦ ధర్వ విధిని
యట్టె పరిణయమై ననుఁ ♦ జెట్టఁ బట్టి;
యీవి భువికెల్లఁ బట్టపు ♦ దేవి కమ్ము;
మేలుఁ గైకొమ్ము; వేగ న ♦ న్నేలుకొమ్ము. 26

మదీయ పురమందలి యేనూర్వురు పరిచారికలచేత నూడిగంబులు గైకొమ్ము. నేను నీ సొమ్మనుకొమ్ము. నిజము. నమ్ము. కొమ్మా! సమయమ్మిదె సుమ్ము.

మోహి—[19] ఓహోహో రాజేంద్రా! ఎట్టిమాటఁ బల్కితివి! నీవు రుక్మాంగదుండ నవిన మాత్రంబున నే నీ సర్వంబు నెఱింగితి. నే నింతదనుకఁ దగిన వరునికై వెదకుచుండినందుకు గాంధర్వ వివాహంబున నిన్నాఁ జేపట్టవలయు? నీకుఁ గల నూర్వురు సతులతో నన్ను నూటొక్కతెనుఁగాఁ జేయఁబూనితివి కాఁబోలు. మంచి సంబంధంబుఁ దెచ్చితివి. ఔరా! నే నిట్టి నూర్వురు సవతుల నొక్కచో సంపాదించుకొనుటకన్న నొక్క బండ మెడఁగట్టుకొని బావిలోఁ బడిన మేలుకాదే?

—* దశరాగ సంవాద సీసమాల. *—

రు—కల్యాణి! నీ కింత ♦ కాఠిన్య మేటికే?
నీ చెంతఁ జేర్చి మ ♦ న్నింపఁ గదవె
మో—బాగాయె రాజేంద్ర! ♦ ప్రభు చెంతఁ జేరుట
యల సామ తోడి స ♦ య్యాట మగు
రు—మదనుఁ డమ్ముల నాఁటి ♦ యెద సేయ నార్తిఁ గ
లంగితిఁ గావు సా ♦ రంగ నేత్రి
మో—బళి! రాజరాజ! నీ ♦ భైరవార్తి యదెల్లఁ
బాయు నీ పుత్రితోవఁ ♦ బట్టు మయ్య
రు—బుద్ధి నీ వశమౌటఁ ♦ బోవంగ నామది
కేదారి తోఁచదే ♦ యెమ్మెలాడి!
మో—ఆ వసంత జయంతు ♦ లా కంతుమూర్తి ర
క్షించెద రేమొ ప్రా ♦ ర్థింపు మయ్య
రు—అలివేణి నన్ను దుః ♦ ఖాంభోధి ముంచకే
చేపట్టి యొక దరిఁ ♦ జేర్పఁ గదవె
మో—దరిఁ జేర్ప గిరిఁ జేర్పఁ ♦ దగువారు నీదు ద
ర్బారునఁ గలరయ్య ♦ బారు తీరి
రు—గీ. నమ్మి నీవాఁడనని ప్రార్థ ♦ నమ్ము సల్పఁ
గన్నడ యిటుల చేసెదే ♦ కంజ నేత్రి?
మో—అక్కటా యీవె భూపతి ♦ వౌట నిచట
వీలు లేదేమొ పైని యి ♦ ప్పీల టంచు. 27

ఈ ప్రసంగమున లింకఁ జాలును పొమ్ము.

రుక్మాం—సఖీ! ఎట్లుపోఁగలను? నిన్నెడఁబాసిన నిముసంబు యుగంబై తోఁచు! సుందరవదనా! నీ పొందెడఁబాసిన యీ జన్మంబేల? నీచెంగటఁజేరి సుఖింపని

యీ వైభవంబేల?

ఉ. కామిని! రాజ్యమొల్లఁ; దుర ♦ గంబులనొల్ల; నిజంబు భామినీ
స్తోమమునొల్ల; నాదుప్రియ ♦ సూనునినొల్ల; సుఖంబునొల్ల; నే
సీమను నొల్ల; భోగముల ♦ నే నిఁక నెన్నఁడునొల్ల; నమ్ము మో
భామిని నీవు నన్నుఁగఁ గృ ♦ పామతిఁ గౌఁగిటఁ జేర్చు కుండినన్.

నా సౌందర్య[redacted]లతోఁ బాటు నిన్నొక్కతెనుఁగా భావించి తలఁప కుము. వారి నెల్ల నీవు నా దృష్టిపథంబునఁ బడిన నిముసంబునవే నా మనంబు నం ద్యజించితి. కావున నో సుందరవదనా! నీ డెందంబున వట్టి సంశయంబు దిగ నాడి గాంధర్వవివాహంబున నన్నుఁ గైకొనుము. నా రాజ్యంబెల్ల నీ యధీ నంబు చేసెద. ఒక్కనిముసమైన నిన్నెడఁబాయక నీ యాజ్ఞానువర్తినై మెలంగు వాఁడ.

మోహి.—కైతవ వచనరచనా నైపుణ్యాభరణా! భూరమణా! నీకు సమయోచిత ప్రసంగంబులయందుఁ గల నేర్పరితనంబును గూడ నిచటఁ జూపఁదలంచితివా? చాలుఁ. నీ నేర్పరితనంబు లిచటఁ జెల్లవు నడువుము.

క. మాయలు, దౌష్ట్యము, తరుణో
పాయంబులు, దంభమున్, గృ ♦ పాహీనత, య
న్యాయము, పరవంచనముం
బాయని గుణగణము కాదె ♦ మగవారలకున్?. 29

ఉ. బంగరుకుండలంచు, సిత ♦ భానుఁడటంచును, మిన్నటంచు, ము
గ్ధాంగనలెల్లరం గని సు ♦ తారముగా భ్రమవెట్టఁజూచు నీ
వెంగలి పూరుషాళిదగు ♦ వేడ్క జగద్విదితంబ కాదె? హా
పొంగకుఁ దల్పుదీయుచును ♦ తోనె గృహస్థుల లేపు మాఁయకుల్

ఈ మగవారల స్వకార్యఘటనోపాయప్రసంగంబులు జగద్విఖ్యాతంబులు. ఇఁక రాజులన్ననో, అగ్నిహోత్రంబునకు వాయువు తోడైనట్లు, దీనికిఁ దోడుఁగ మహదైశ్వర్యాంధకారముచేతఁ గన్నుఁ గాననివారై కూడ నుందురు. అట్టి రాజులంగూర్చి యింకఁ జెప్పనేల?

మ. కరుణా? నాస్తి; కటాక్షమా? నభయము; రా◆గంబా? హుళిక్కే; మహా
త్తరసత్కార్యములా? యబద్ధము; మహౌ◆దార్యంబ? శూన్యంబి; కన్
బరనారీధనవాంఛయా? ప్రబల; మ◆న్యాయాదులా? కొల్ల; యీ
ధరణీపాలుర నమ్మఁగావగునె దు◆స్తంత్రక్రియాలోలురన్. 31

శా. ఏ రామామణిఁ గాంచినన్ బ్రథమమం◆దెంతేఁ గృపన్ జూపుచున్
జేరం జేర్తురు; కౌఁగిలింతురు; తుదన్ ◆ జింతాబ్ధిలో ముంతు; రా
సి రాజేంద్రుల కూరుముల్ దెలుపఁ బె◆క్కేలా వృథావాక్యముల్?
నూఱేండ్లాయువు నిత్యగండమె యగున్ ◆ నో రెత్తఁ బైపెచ్చుగన్.

ఇట్టి వాక్యంబు లెవ్వ రెఱుంగరని కాఁబోలు! తన భార్యల నొల్లఁడఁట! నిముసంబైన నన్నొడఁబాయ కుండునఁట! రాజ్యంబెల్ల ధారవోయునఁట! ఇంక నేమో తలకుఁ బెట్టెడునఁట కుచ్చుల కుళ్ళాయి. — ఏల యిట్టి వృథాప్రసంగంబులు? ఇవన్నియుఁ గట్టిపెట్టి రాజా నీ దారిని బొమ్ము.

రుక్మాం—[20] నారీమణీ! నేనేమో కల్లలాడుచుంటిననియు, నా వాక్యంబులు విశ్వాసపాత్రంబులు కావనియుం బల్కుచుంటివి. నే నట్లు కల్లలుపల్కువాఁడఁ గాను. నీవు కోరు విధంబునఁ బ్రమాణపూర్తిగఁ బల్కువాఁడ నని నమ్ముము.

మోహి—రాజేంద్రా! నీ వంతటి సత్యవాక్యపరిపాలనాధురీణుఁడవా? అట్లయిన నీ విప్పుడు చేయుదునని పల్కిన దంతయు నివ్వనాధీశుండగు నిష్టకామేశ్వరు పాదసాక్షిగ మఱియొక్కతూరి పల్కి నా చేతఁ జేయి యుంచుము. ఆమీఁద నీ యభీష్టం బీడేర్చెద.

రుక్మాం—ఓహో చందనగంధీ! నాయభీష్టం బీడేర్తువా! వికసితాంబురుహలోచనా! నాకోర్కిఁ దీర్తువా? అహా! యెంత యానందజనకంబగు పల్కు పల్కితివి!

ఉ. కొల్లలుగా సుధారసముఁ ◆ గ్రోలినయట్ల, సుఖాంబురాశిలో
నల్లనఁ దేలినట్ల, ముద ◆ మారఁగఁ బైని హిమాంబుపూరముల్
పెల్లుగఁ జల్లినట్ల, మురి ◆ పెంబులఁ జిల్కెడు నీ మృదూక్తి నా
యుల్లముఁ బొంగఁ జేసెఁ; సఖి ◆ రో! యిఁక ధన్యుఁడ నైతి నీకృపన్

చ. కులమున వన్నె డిందినను, ♦ గూర్మి నెచ్చెలు లేవగించినన్,
నెలఁదుల నూర్వురన్ దొడరి ♦ వీడఁగఁ గల్గినఁ, గీర్తిఁ బాసినన్,
గలిమిదొరంగినన్, మఱియుఁ ♦ గష్టములెన్నియొ చుట్టుకొన్నఁ దా
వలచినకాంత చేపడెడు ♦ భాగ్యముకన్నను భాగ్యమున్నదే? 34

చందనగంధీ! నీకీ సందియంబేల? ఈశ్వరునిసాక్షిగఁ బల్కుచుంటి వినుము.

గీ. ఒల్ల నూర్వురుసతులలో ♦ నొకరి నైన;
భావమిానెల్లఁ బట్టపు ♦ దేవి కైన;
అతివ! నీ యాజ్ఞ నే శిర ♦ సావహించి
మొనర నెన్నఁడు నినుఁ బాయ ♦ కుందు వాఁడ. 35

మోహి—ఓహో రాజేంద్రా! ఇంతదనుక నేను బల్కిన వాక్యంబులచే నీ మనం బెంత నొచ్చెనో కదా. నీవు నాయందుఁ గలిగియున్న యట్టి నిజమయిన యను రాగంబును గ్రహింపఁజాలక చేలనై గోలతనంబునఁ బల్కితి. అదియెల్లఁ దప్పుగఁ బట్టకుము. నన్ను నీ నిండుకౌఁగిటఁ జేర్చి మన్నింపుము. (అని హర్షముతోఁ గౌఁగిలించుకొనుచున్నది.)

రుక్మా—(మహానందముతో) ప్రాణసఖీ! యీ నట్టువపిట్టం జూచితివా? ఇటురమ్ము.

(ఇద్దఱును బోవుచున్నారు.)

సేన—(ప్రవేశించి) మే మీ యరణ్యముం బ్రవేశించి పెక్కుదినము లయినది. వచ్చినందుకు వేఁటకార్యము ముగిసినది. కాని పురంబునకుఁ బోవు యోచన మా ప్రభువుగా రింకను జేయకున్నారు. వారి కరణ్యమైననేమి? పురమైననేమి? వారి కేమి కొదువ? ఆఁకలి దప్పుల బాధ యైశ్వర్యవంతులకుఁ దెలియునా? చెంతకేగి యేమైన విన్నవించెదమన్నఁ బ్రభుచిత్తంబు లతిసున్నితంబులు. ఏమి వచింపఁ బోయిన నేమి యగునో. పరివారజనంబులెల్లరు మిగుల డస్సియున్న వారు. ఏమి చేయనగును? కానిమ్ము. నా మిత్రులతో నాలోచించెద. (అని పోవుచున్నాఁడు.) (మోహినీ రుక్మాంగదులు ప్రవేశించుచున్నారు.)

రుక్మా—పూఁబోఁడీ! మన మీ యరణ్యమధ్యంబునం దిట్టులు కాలంబుఁ గడపనేల? మదీయ పురంబుఁ జేరి వజ్ర వైడూర్య గోమేధిక పుష్యరాగ మరకత మాణిక్యాది

దివ్యమణి ఖచితంబులగు సువర్ణ సౌధంబుల యందును, వకుళ చందన పున్నాగ. నారికేళ కదంబ నింబ దాడింబ కదళికాది ఫలవృక్షసంకులంబులై డెందంబున కమందానందంబుఁ బొందఁజేయుప సమర్థంబులగు మదారామ శ్రేష్ఠంబులందును మన మిచ్ఛ వచ్చిన ట్లుండవచ్చును. కావున నో మచ్ఛకంటీ! యచ్చటికి కేఁగుట యుచితంబని నాకుఁ దోఁచుచున్నది. దీనికి నీ యభిమతంబేమి?

మోహి—ప్రాణేశ్వరా! ఎఱింగింతు వినుఁడు. పురంబునకుఁ బోవుట సమ్మతమే. కాని

గీ. అచట నీ బంధుమిత్రులు ♦ నాలు సుతులు
గురు పురోహితులును మంత్రి ♦ వరులు కలరు;
అకట నా రాక నీకిష్ట ♦ మైన యట్లు
వారి కేరీతి నయ్యెడుఁ ♦ బ్రాణనాథ? 36

గీ. ఇట్టి వీరలు దుర్బోధ ♦ నెట్టులైనఁ
జేసి, నిన్ గతరాగునిఁ ♦ జేయఁ గలరు;
మనల నెడఁబాపుటయె కాక ♦ మఱియు నాకు
నింక నేమైన నెగ్గుఁ గా ♦ వింపఁ గలరు. 37

కావున నచటికిఁ బోవుట యుచితంబుగ నాకుఁ దోఁచుట లేదు. అయినను

ఉ. హెచ్చగు దోర్బలంబున న ♦ హీన మహీతలమెల్ల నేలి, యా
యచ్చరకాంతలెల్ల నహ ♦ హా యనురీతి ననుభవించి, నీ
యిచ్ఛకువచ్చినట్లు సుఖ ♦ యింపఁగ స్వేచ్ఛవహించినట్టి నీ
కిచ్చటనున్న నేమి? యొక ♦ యింత కొఱంతయుఁ గల్గనేర్చునే?

ఎట్టులైన నిచ్చటనుంటయే మేలని నాకుఁ దోఁచుచున్నది. పిమ్మట నీయిష్టము.

రుక్మాం—మనోనాయికా! ఇట్లు సంశయించుట యనావశ్యకము.

క. నా పుత్త్రుఁడు నా మిత్రులు
నా పట్టపుదేవి మఱియు ♦ నా పురజనముల్
నా పల్కు లేశమాత్రము
నే ప్రొద్దును మీఱ కుందు ♦ రిందునిభాస్యా! 39

అట్టి వారలు నా కేమో బోధింతురంటివి.

గీ. కన్నులారఁగ నిన్నిటఁ ♦ గని, వరించి,
పైని శంకరు సాక్షిగఁ ♦ బరిణయంబు
పొలుపుగాఁ గాంచి, నేఁ ♦ గొని పొప్రచుండ
వారు వీరును బోధింప ♦ వచ్చు టెట్లు? 40

ఇది కాక ఆత్మబుద్ధి స్సుఖంచైవ యనునట్లు నాకు న్యాయమని తోఁచు తెఱంగున నడచువాఁడఁ గాని వారివీరి బోధనలను వినువాఁడఁ గాను. నీ వింక నట్లు సంశయింపకుము. పురంబునకుఁ బోవుదము లెమ్మ.

మోహి—ప్రాణేశ్వరా! అట్టులే కానిండు.

రుక్మా—నా పరివారజనంబు లావల నాకై వేచియుండిరి. మనము బోవుదము రమ్ము

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)

గద్య. శ్రీమదుమారమణకరుణాకటాక్షపాత్ర శ్రీవత్ససగోత్ర బేతపూడి
వంశ క్షీరపారావార రాకాసుధాకర మల్లేశ్వరామాత్యపౌత్ర,
నిరంతర శివారాధనపరాయణ లక్ష్మీనారాయణామాత్య
చతుర్థపుత్ర గుణకదంబ లక్ష్మాంబాగర్భ సంభూత,
సుజనవిధేయ, భగవంతాభిధేయ ప్రణీతం
బైన రుక్మాంగదనాటకంబున నిది
తృతీయాంకము.





శ్రీ

రుక్మాంగద నాటకము.

చతుర్థాంకము.

రంగము:—అంతఃపురము.

(సంధ్యావళియు, చకోరాక్షియు, పద్మగంధియుఁ గూరుచుండియుండఁగా రుక్మాంగదుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

సంధ్యా—నాథా! మీరు మృగయా వినోదార్థంబుగఁ జని పెద్దకాలంబయ్యె. మీ రాక దీర్ఘంబయ్యెనని యేనును నాతోడిసతులును బ్రత్యహంబును బ్రతిక్షణంబును నెల్లెదురు చూచుచుంటిమి!

చ. అచటి మృగాళినెల్లఁ దెగ ♦ టార్చితిరే? యల కాఁపులెల్ల మీ
సుచరితఁ బాడుకొంచుఁ,దమ ♦ శోకములెల్ల దొరంగెనంచు, మేల్
వచనము లాడుకొంచు, సుఖ ♦ వారిధి నోలలనాడుచుండిరే?
అచలితధైర్యసార! సుగు ♦ ణాకర! మాకు నెఱుంగఁ జెప్పవే! 1

రుక్మా—(తల వంచుకొని కూర్చున్నాఁడు.)

చకో—అక్కా! సంధ్యావళీ! మనము కాచుకొని యుంటిమని చెప్పుచుంటివి. మనవలెనే నాథుండును మనలఁ గాచుకొనియుండునెడ రాజ్యవ్యవహారంబు లెట్లు నెఱవేఱునమ్మా! కాని నాథుండు కడుబడలియున్నట్లు కానిపించుచున్నవాఁడు. కాంచితివా?

గీ. కాయమెల్లను శ్రమబింద ♦ కలిత మయ్యె;
మోము వేకువచందురుం ♦ బోలు చుండె;

వేఁడి నిట్టూర్పు లూరక ♦ వెడలఁ జొచ్చెఁ;
కాంత! యరమోడ్పు లౌచుండెఁ ♦ గన్ను దోవలు. 2

పద్మ—అవునమ్మా చకోరాక్షీ! నాథుండు మిగుల డస్సియుండుటయే కాక యేమో దీర్ఘాలోచనపరుండై యున్నట్లు తోఁచుచున్నదమ్మా.

గీ. పల్కరించినఁ బ్రతిమాటఁ ♦ బల్కలేక
కోలుపోయిన చందానఁ ♦ గూరుచుండి,
క్రిందుమీఁదుల నరయుచు ♦ ముందు త్రోవ
యెద్దియో యను గతి నుండె ♦ నిందు వదన! 3

రుక్మాం—పద్మగంధీ! నీవు సరియైన యోచనఁ జేసితివి. నేను నిజంబుగ దీర్ఘాలోచనపరుండనయ్యే యున్నవాఁడ. ఏను మీ కెఱింగింపవలసిన కార్యం బొకటి యావశ్యకంబగుటంజేసి యది మీ కెట్లెఱిఁగింతునాయని యోచించుచున్నాఁడ.

సంధ్యా—నాథా! మీకింత యోచనయేల? మమ్ము నార్వుర భార్యలఁగా గ్రహించి యేలుచున్నను ఒక్కప్పుడైన నొక్కరియందైనఁ బరస్పరభేదంబులేక యెల్లగ సమదృష్టి నేలుచు బద్ధానురాగులరై వర్తించుచుండు మీరు మాకు నేదొక్క విషయంబుఁ దెలుప నింతయోచనకావలెనే? సందియంబుమాని యెఱింగింపుఁడు.

రుక్మాం—కాంతలారా! వినుఁడు.

చ. సరగునఁ గాన కేగి, మృగ ♦ సంతతు లన్నిఁటి వెంటనంటి సం
హరణ మొనర్చినంత, విధి ♦ మానసపుత్త్రిఁ, ద్రిలోక దివ్యసుం
దరమృదుగాత్రి, మోహినియ ♦ నందగు నోర్తుఁ దదంతికస్థలిన్
దిరుగఁగఁ గాంచి, మోహ♦మెద నించి, వరించి, పురంబుఁ జేర్చితిన్.

అక్కాంతామణిని మనయంతఃపురంబున నొక్క సౌధాంతరంబున నుంచితి.

చకో—ఏమేమీ! మేము నార్వురుకాంతలము గాక యింకొక్క కాంతామణిం గాంచి, మోహించి, తెచ్చితిరా! పోనిండు. మాకు మీ యనుగ్రహం బుండినం జాలదే!

రుక్మాం—ఉ. అట్లు వరించువేళ వన ♦ జానన మిమ్ముల నేరి నొల్ల కే
పట్లను నైనఁగాని తనుఁ ♦ బాసి క్షణంబును నిల్వనంచు న

న్నిట్లుగ బాసఁ జేయుమన ♦ నే మదనాస్త్ర నిపీడితుండనై
యట్లె యొనర్చువాఁడ నవి ♦ దా! యని ప్రీతి కరంబుఁ బట్టితిన్.

కావున నో సఖులారా! మీరు నట్లు ప్రవర్తించుట నా యుద్దేశంబు.

సంధ్యా—అక్కటకటా, ప్రాణేశ్వరా! ఏమి యీ యన్యాయంబు! మే మెవ్వరి వార మగుదుము? మావంటి సతుల నింక నూర్వుర వివాహమైనఁ గావచ్చుఁగాని యొక్కతరుణికై మ మ్మెల్లరఁ ద్యజింపఁబూనుట యెంతయుఁ బరితాపకరంబు కాదే? కావలెనన్న నా తరుణీమణియం దెక్కుడు ప్రేమంబునఁ గలసిమెలసి వర్తింపుఁడు. మాయం దెప్పటియట్లే యుండుఁడు. అంతియ చాలు.

పద్మ—కాదమ్మా సంధ్యావళీ! నాథుండు మన మనంబు లరయుటకై యిట్లు పల్కుచున్నవాఁడు. కాకయున్న నెచ్చటనైన నిట్టి విచిత్రం బుండునా?

ఉ. నమ్మకు నమ్మకమ్మ నర ♦ నాథులు దంభవిలాసు; లిట్టి మే
లమ్ములు సంతసమ్ములు నె ♦ లంతరొ వారికిఁ; గాక యివ్వి స
త్యమ్ములనంగ నున్న మము ♦ నందఱినన్ వరియించువేళఁ దా
నిమ్మెయిఁ దోఁటివారల న ♦ దేటికి వీడకయుండెఁ నెచ్చెలీ? 6

కాంతుఁ డెప్పటియట్ల మనయెడ బద్ధానురాగుఁడైయే యున్నవాఁడమ్మా.

చకో—ఉ. చాలును జాలు నీ వగలు ♦ చాలును కట్టుము;
పద్మ— ... ... కాదుకాదె, భూ
పాలుఁడు సత్యశీలుఁడు గృ ♦ పాళుఁడు కాఁడఁటె?
చకో— ... ... ఔనుగాని, స్త్రీ
లోలుఁడు కాఁడె? చిత్తచప ♦ లుండునుఁ గాఁడఁటె?
పద్మ— ... ... తాళు కోమలీ
తూలఁగనాడఁ జెల్లునె?
చకో— ... అ ♦ ధోగతిపాలిటు చేయు టొప్పునే? 7

పద్మ—[21]చెలీ! నీవు పొరఁబడుచుంటివి సుమా.

చకో—పద్మగంధీ! ఏటికమ్మా యీ ప్రసంగంబులు? నీ కేమో పూనిపెట్టి

మాటలాడవచ్చెదవు. ఈ మగవారిని నమ్మనచ్చునటమ్మా!

ఉ. ఒక్కతెఁ బల్కరింతురు; మ ♦ ఱొక్కరితోఁ సరసాల మింతు;రిం
కొక్కతెఁ జేరఁ దీయుదు; రిఁ ♦ కొక్కతె బిగ్గఁ గౌఁగిలింత్రు; వే
ఱొక్కతెపాల దక్కుదు; ర ♦ హా! మగవారల నమ్మఁజెల్లునే?
చక్కరపూఁతవెట్టిన వి ♦ షంబుల మాత్రలుగారె యక్కరో? 8

ఇప్పుడు నాథుం డన్యసతీలోలుండై యున్నవాఁడు. ఇంక మీవాక్యంబు లెట్లు చెవిం జొరఁగలవమ్మా?

గీ. వగలఁ బొగులఁగ మనలను ♦ దిగువఁ ద్రోసి,
వనిత యొక్కతె విభునకు ♦ స్వర్గ మయ్యె;
ముందు కల్గిన చెవులను ♦ గ్రిందుఁ జేసి,
పైకి నిక్కెడి కొమ్ముల ♦ పగిది నకట! 9

సంధ్యా—చకోరాక్షీ! మన నాథుండు లోకములోని మగవారల వంటి వాఁడు కాఁడమ్మా. ఇంతవఱ కెన్నండైన నిట్టి లోపంబుఁ గని పెట్టి యుంటిమమ్మా? జీవితేశ్వరుం డలసియుండె. చెలీ! నీవొక్కింత విసరుము. సేవకా! ప్రభువారి కొసంగవలయు నొక్క విడెంబుఁ గొనిరమ్ము. పద్మగంధీ! నీ వొక్కపాట పాడెదవటమ్మా?

పద్మ—అలాగే పాడెదనమ్మా. (అని యిట్లు పాడుచున్నది.)

పాదపవృత్తము.

సామిగ నేఁడిటు ♦ జాలమి దేరా?
కామిని నేఁచుట ♦ కాదుర ధీరా!
కాముని తూపులఁ ♦ గందితి గారా
తామస మేలర ♦ తాళఁగ లేరా. 10

సంధ్యా—ప్రాణేశ్వరా? ఏల మీ రీదినంబున మాతో నిట్లు మేలమాడఁ దొడంగితిరి?

రుక్మా—కాంతలారా! మీ రేమేమో పరిపరివిధంబులఁ బలుకఁజొచ్చితిరి. నేను చెప్పినది పరిహాసంబు కాదు. నిక్కంబు. రేపటినుండి నేను మీచెంతకు రాఁజాలఁ.

పద్మ—హా, పరమేశ్వరా! ఇఁక నేమిగతి? మే మెవ్వరిపాలఁబడుదుము? మాకెవ్వరు దిక్కు? మమ్మిఁక నక్కునఁజేర్చి యాదరించువా రెవరు? హాసఖీ! యింకేమి సేయుదుమమ్మా? ప్రాణనాథుండు రేపటినుండి మన చెంతకే రాఁజాల నని చెప్పుచుండెఁగదమ్మా.

క. తన విభు మన్నన వడయని
వనితల బ్రతుకులును వారి ♦ వైభవ మెల్లన్
గన నడవిని వెన్నెల కా
సిన మాడ్కియకాదె? బ్రదుకఁ ♦ జెల్లునె ధరపై? 11

గీ. ప్రాణసముఁడగు పతిఁ బాయు ♦ బ్రతుకుకంటె
మేనుఁ బాసిన నెక్కుంత ♦ మేలె సుమ్ము;
ప్రాణములు దాల్చి యపకీర్తిఁ ♦ బడుట కంటె
స్వర్గముననుండి పతిభక్తి ♦ సలుపఁ దగును. 12

[22] ఉశ్, అప్పా, సఖీ! నా కేమియుఁ దోఁచుట లేదమ్మా.

చకో—సఖీ! యిఁక నెక్కడఁ దోఁచుటమ్మా? ప్రాణనాథు నెడఁబాసిన యీ బ్రతుకేటికమ్మా? లోభివానిచేతి ధనమ్మును, రణభీరునిచేతి యాయుధమ్మును, సంగీతసాహిత్యవిద్యావిహీనుని వచనంబులును, విభుని మన్నన వడయని యతివల బ్రతుకులును వ్యర్థంబులు కావటమ్మా?

ఉ. అందముగాఁగ మమ్ము లల మ ♦ హాకరుణామయదృష్టి నేలి, యా
నందరసాబ్ధిఁ దేల్చు ప్రియ ♦ నాయకు చెంగట నాదుమొల్ల నే
డందని ప్రామానిపండుకొఱ ♦ కఱ్ఱులు చాచుటలాయె; నింక నే
మందు; నిఁ కేదిమందు; జగ ♦ మందున నేగతి మందు నక్కటా?

ఇట్టి వృథాజీవనంబునకన్న రజ్జువిషాగ్నిజలంబుల దేహంబు వాసిన మేలని తోఁచుచున్నదమ్మా. శ్లో. మానః స్త్రీణాం విభూషణం అన్నట్లు స్త్రీలకు మానమే ప్రధానముకదమ్మా. అట్టి మానంబుఁ బోగొట్టుకొని యిఁక నవమానకరంబగు బ్రతుకు బ్రతుకఁజాలనమ్మా. ఈ పైఁట చెఱఁగున నురివోసికొని ప్రాణంబులు దొరఁగెదనమ్మా.

పద్మ—నేనును అట్లేచేయుదునమ్మా. (అని యిద్దఱును ఉరిపోసికొనబోవఁగా సంధ్యావళి లేచి వారలఁ బట్టుకొని)

సంధ్యా—కాంతలారా! తాళుఁడు, తాళుఁడు. మీరిట్లు ప్రాణంబులఁ బాయ నుంకించుట మేరకాదు. ప్రాణనాధుం డెట్టివాఁడైనను, ఎట్టి యకృత్యంబు లాచరించినను వాని నెల్ల సహించి నాధుని యాజ్ఞాబద్ధురాలై వర్తించుట యుత్తమ స్త్రీ ధర్మంబు.

సీ. పతి యాగ్రహించిన ♦ బదులు పల్కఁగరాదు
కోపించె నని మదిఁ ♦ గుందరాదు
కఠినోక్తు లాడినఁ ♦ గంటగింపఁగ రాదు
దూషించె నని మదిఁ ♦ దూల రాదు
అలసట వెట్టిన ♦ నడ్డు చెప్పఁగరాదు
కలఁగించె నని మదిఁ ♦ దలఁప రాదు
పరిహాసించినఁగాని ♦ ప్రతి సేయఁగా రాదు
వేఱు పెట్టెనటంచు ♦ విసువరాదు

గీ. ఆటపాటలనైనను ♦ నలుక నైన
సరససల్లాపములనైన ♦ శ్రమల నైనఁ
బతియె దైవమటంచు స ♦ న్నుతి యొనర్చి
కాని యెదురాడ రుత్తమ ♦ కాంత లెపుడు. 14

ఉ. కుంటియుగ్రుడ్డియున్, జడుఁడు ♦ క్రూరుఁడు, దుష్టుఁడు, పాపకర్ముఁడున్
దుంటరి, వేసకాఁడు, గడు ♦ ధూర్తుఁడు, నన్యసతీప్రియుండు, వే
తంటలమారివాఁడయిన ♦ దగ్గరఁ జేరి, పదంబులొత్తి, వా
ల్గంటిరో! దైవమంచుఁ గల ♦ కాలము నాధునిఁ గొల్వఁగాఁదగున్.

క. పతి యలిఁగిన సతి యలుఁగక
నతివినయస్ఫూర్తి నతని ♦ యాజ్ఞ శిరసునన్

సతతము సహించి మనుటయె
సతులకు ధర్మంబునాఁగఁ ♦ జను సఖులారా! 16

బుద్ధిపూర్వకంబుగాఁ బ్రాణంబు వాయుచుమన్నను విభునియనుజ్ఞలేక మీ రెట్లుచేయఁగలరు? ఇదిగాక రాజేంద్రుండు వనంబునకుఁ బోవకమున్న మీరెట్లు పల్కినను బాగగును. ఇప్పుడు నాథుం డాకస్యకామణిం గాంచి, మోహించి, బాసలిచ్చి, కొనివచ్చి, యతఃపురంబున నిల్పిన పిమ్మట మీ రెట్టి కఠినవాక్యంబు లాడినను, కఠినకృత్యంబు లొనరించినను విభుం డేమిచేయఁగలఁడు? మఱియుఁ గాంతలారా!

గీ. కనులు కల్వలు మేను బం ♦ గారటంచుఁ
జాన కౌఁగిలి యబ్బుటే ♦ స్వర్గమంచు,
వలచి, భ్రమియించి, మించి, యీ ♦ ప్రభుఁడు సుఖము
లందఁబోయెడుఁ; గంద మా ♦ యంద మెల్ల. 17

కుడువఁబోయెడి కూరకు రుచియడుగ నేటికమ్మా? మీరుతొందరనొందకుడు. ఆ సయ్యాటలును, ఆ సరాగంబులును, ఆ చిత్రంబును మనము శీఘ్రకాలంబులోనే చూడఁగలము.

చక్రో—అక్కా! నీ పల్కుల కెదురాడను గాని యెంతగఁ బ్రయత్నించినను నా మనం బూరటఁజెందకున్నది. ఏమిచేయుదును. హా! మోహినీ! దుష్టహృదయా! యెంతచేసితివి!

ఉ. ఏదెసనుండివచ్చితి? వి ♦ దేటికి మాకిటు దాపరించి మా
మోదమునెల్ల సంద్రమున ♦ ముంచితివే పతిఁబాపి; నీకు మ
ర్యాదయె? కోమలీ! తగుదు ♦ నంచును గుల్కెదొ సిగ్గులేక; హా
మా దురదృష్టదేవతవొ ♦ మా తలవ్రాఁతవొ యేమి చెప్పుదున్!

గీ. నీ విలాసంబు, హాసంబు, ♦ నీదు వగలు,
నీటు గోటులు చూపుచు ♦ నేర్పు మీఱ
సతిపతులపొందు నెడఁబాపు ♦ చాన నిన్ను
ధర సృజించుట పరమేష్ఠి ♦ తప్పు కాదె? 19

గీ. సతుల నూర్వుర నిటు దుఃఖ ♦ సాగరమున
నెక్కుపెట్టఁన ముంచి నీ ♦ వ్రెక్కిరితవు
పొందఁబోయెడి సౌఖ్యంబు ♦ పోల్చి చూడ
నూటయొక్కటి యగాఁ జుమ్ము ♦ మాట నమ్ము. 20

మ. జగతిన్ గాంతలు లేరె? పూరుషుల స్వే♦చ్ఛావృత్తిఁ బ్రేమింపరే?
తగురీతిన్ వలపింపరే? వలవరే? ♦ తత్సౌఖ్యముం జెందరే?
తగునే మోహిని! యిట్టులాలుమగలన్ ♦ దంత్రంబునన్ బాపఁగన్?
మగువా! మాకొఱకై జనించితె? కటా ♦ మా ప్రేమముం బాపితే?.

పద్మ—చెలీ! ఇందు మోహినిం దూషింపనేల?

మ. ప్రణతుల్ చేసి భజించెనో, యితని రా ♦ రమ్మంచుఁ బ్రార్థించెనో
వనితా! మోహినిదేమితప్పు చెపుమా? ♦ ప్రాణేశుఁడక్కాంత గాం
చినయంతన్ వివశాత్ముఁడై తగునె యి ♦ స్సీ! యిట్లు వాకిచ్చుటల్
మన బంగారము మంచిదైన నికనే ♦ లా దూఱఁ గంసాలినిన్ 22

హా, సఖీ! చకోరాక్షీ! యీ దుఃఖసాగరం బెట్టు లీఁదనేర్తుమమ్మా? [28]

గీ. తారసిల్లిన పెరకాంతఁ ♦ దగిలి విభుఁడు
మనల విడనాడి తనదు యూ ♦ వనము నెల్ల
బాని పాలొనరించుటఁ ♦ దలఁచు నపుడు
గుండె జల్లని ప్రాణముల్ ♦ క్రుంగ కున్నె?. 23

సంధ్యా—చెలీ! నీ విట్టు లట్టిట్టనరాక మట్టుమీఱిన శోకంబున రట్టువడుచుంటివి సుమా.

ఉ. ఆపఁగరాని ఖేదమున ♦ నయ్యొ కృశింపఁగ నేటికమ్మ? యీ
యాపద లెల్లకాల, మగ ♦ టా విను, జీవుల వెంటనంటుచున్
గాపురముండఁబోనె? ప్రియ ♦ కాంతరొ! వింటివె? కష్టకాలమం
దోపిక బూనునట్టి జను ♦ లుర్వి సుధీమణు లెంచిచూడఁగన్ 24

పద్మ—నీవాక్యంబులు నిక్కంబులే కాని యక్కాఱొక్కటివినుము. రాజాధిరాజ

టంచు రసికాగ్రణియటంచుఁ జిరకాల మీతనిం జేరి యపరిమితసుఖంబు లనుభవించి యిప్పు డిట్టినీచత్వంబునకుఁ బాల్పడ మనం బెట్టులోర్చు? ఈ రాజేంద్రుఁడు

గీ. అచటఁ గాంచిన తరుణికై ♦ యాసఁ జెంది,
చేయరానట్టి బాసలు ♦ చేసి, తుదకు
మనల నలయించి, బహుళ వే ♦ దనల నించి,
యట్టు వచించి, నట్టేటఁ ♦ బుట్టి ముంచె! 25

సంధ్యా—సఖీ! యివేటిమాటలు; ఈ రాజేంద్రుఁడు మన కొనర్చిన యపకార మేమి?

ఉ. కాలముఁబట్టి కర్మమును ♦ కర్మముఁబట్టి మనంబునుంట నీ
లీల శుభాశుభంబు లవలీలగఁ ♦ గల్గుచునుండు; కర్తలై
మేలును గీడొనర్చుటకు ♦ మేదిని నెవ్వరు శక్తులమ్మ? భూ
పాలుఁడు కర్తయానె మన ♦ పాలిఁటి కర్మ మొనర్చుచేఁతకుఁ?

చకో—అక్కా, సంధ్యావళీ!

గీ. ఎల్లకాలంబు బతిఁబాసి ♦ యేకతమున
బ్రదుకఁ గల్గుట యేరీతి ♦ భాసురాంగి;
ప్రాణమైనను గోల్పోయి ♦ మాన ధనము
నిలుపుకొనుటయె మేలంచు ♦ నేఁ దలంతు. 27

సంధ్యా—చెలీ! చకోరాక్షీ! నా పలు కొక్కింత యాలకింపుము. ఏరికైన నిట్టి తీవ్రవైరాగ్యంబు చెల్లునా? కాలం బెప్పు డొక్కతీరుననే యుండునా? ఓడలు బండ్లగును. బం డ్లోడలగును.

మ. ఒకకాలంబున నాథుఁడే మనల క ♦ త్యుల్లాసముం గూర్చె, వే
ఱొకకాలంబున నాథుఁడే మనల న ♦ య్యో! పీడఁగాఁజూచె, నిం
కొకకాలంబున నాథుఁ డెట్లనఁగ నౌ ♦ నో, యెట్లు మన్నించునో
యకటా యేగతి నిశ్చయింపఁదగున ♦ మ్మా? భాగ్య మెట్లుండునో

[24] కావున కాంతలారా! మీ కీ వేగిరపాటేల? కానున్నది కానిండు నాధుని యభీష్టమునే జరుగనిండు.

పద్మ—అక్కా! అట్లే కానిమ్ము.

చకో—విభుని యిష్టము నే జరుగనిమ్ము.

రుక్మా—కాంతలారా! ఇంతదనుక మీ పల్కులెల్ల నాలకించితి. మీరలు పరిపరి విధంబులఁ భాషింపఁ దొడంగితిరి. కాని

ఉ. కాలమొ, కర్మమో, గతియొ ♦ కాక మదృష్టమొ నే నెఱుంగ; వే
యేల? మృగాక్షులార, నను ♦ నేమని దూఱిన, నేమియన్న, ని
క్కాలమునందు మోహినిని ♦ గాంచి, వరించి, ప్రమాణవాక్యముల్
చాలఁగఁ బల్కినాఁడ; నిది ♦ సత్యము, తప్పదు, పోయివచ్చెదన్.

ఉ. అచ్చట మోహనాంగి తడ ♦ వయ్యెనటంచు మహోగ్రహంబునన్
హెచ్చుగ నేమిపల్కునొ, మ ♦ రేగతిఁ జూచునొ, యస్వతంత్రుఁడన్
వచ్చినకార్యమయ్యెఁ, బెఱ ♦ వానినిగా ననుఁ జూడుఁ డింక; నేఁ
జెచ్చెర నేగి యా సుదతి ♦ చిత్తమెఱింగి మెలంగఁ జూచెదన్. 30

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

గద్య. శ్రీమదుమారమణకరుణాకటాక్షపాత్ర శ్రీవత్ససగోత్ర చేతపూడి
వంశ క్షీరపారావార రాకాసుధాకర మల్లేశ్వరామాత్యపౌత్ర,
నిరంతర శివారాధనపరాయణ లక్ష్మీనారాయణామాత్య
చతుర్థపుత్ర గుణకదంబ లక్ష్మాంబాగర్భ సంభూత,
సుజనవిధేయ, భగవంతాభిధేయ ప్రణీతం
బైన రుక్మాంగదనాటకంబున నిది
చతుర్థాంకము.





శ్రీ

రుక్మాంగద నాటకము.



పంచమాంకము.

రంగము—మోహిని యంతఃపురము.

(మోహిని ప్రవేశించుచున్నది.)

మోహి—ఈ రాజేంద్రుఁడు నన్నిచటికిఁ గొనివచ్చిన దాదిగ నాయందు బద్ధానురాగుఁడైయే యున్నవాఁడు. కాని యాతని నూర్వురుభార్యలయొద్ద నేమిజరుగుచుండెనో యిప్పు డెఱుఁగవలసియున్నది. ఎవరి నడుగుదును? చెలీ, పుష్పమాలా! (అని పిలువఁగాఁ జేతిలో నొక పుష్పమాలను బటమును దీసికొని పుష్పమాల యను చెలి ప్రవేశించుచు)

పుష్ప—ఇదో వచ్చుచుంటిని. వచ్చుచుంటిని.

మోహి—చెలీ! ఎంతసేపే? ఇంతలో వత్తునని పోయి యెంతసేపు చేసితివే?

పుష్ప—మఱి యెక్కడకును బోవలేదు. నీకొఱకే పుష్పములఁ గూర్చుకొని వచ్చుచుంటిని. ఇదిగో మాల; కైకొమ్ము. (అని యిచ్చుచున్నది.)

మోహి—నీ వొక పుష్పమాలవు నాకుఁ జెలివైయుండి వేఱొక పుష్పమాలను గూడ గూర్చుకొనివచ్చితివా?

పుష్ప—అవును. తెచ్చితిని. అట్లు తేఁగూడదా?

మోహి— తేవచ్చును. కాని యిది నీకు పైపోటీ యగుచున్నదే.

పుష్ప—లోకములో నిట్లు పైపోటీలుగా వచ్చువా రెందఱులేరు?

మోహి—చెలీ! యిది నామమాత్రముచేతనే కాక సౌకుమార్యముచేఁ గూడ నిన్నుఁ బోలుచున్నది.

పుష్ప—కనుకనే నీయొద్దఁ జేరినది.

మోహి—నిన్ను మించు తలఁపునన్నో యనునట్టు లిది కొంచెము కొంచెముగా నొక వింతయైన వికాసమును జూపుచున్నది.

పుష్ప—అవును. అట్లుండుట నైజమేకదా.

మోహి—ఎందుచేత?

పుష్ప—దానికి నీతోడి స్నేహము నూతనముగనుక.

మోహి—ఔరా! చెలీ! నీ పలుకు లేమో చిత్రముశే.

పుష్ప—ఆ చిత్ర మేమో నీకే తెలియవలెను.

మోహి—(ఆశ్చర్యముతో) అదేమే, చెలీ యట్లనెదవు?

పుష్ప—అనుభవజ్ఞానము నీ కెక్కుడుగఁ గలదని.

మోహి—(తనలో) ఇది యేమాటపల్కినను నన్ను సూచింపుచునే పల్కుచున్నది. ఈ ప్రసంగ మొక్కింత మార్చెద. (ప్రకాశముగా) చెలీ! నీ చేతిలోని దేమియది?

పుష్ప—ఓహో, యిదియా? యిందే నీకిచ్చుట మఱచితిని. ఇది మన ప్రభువువారగు రుక్మాంగద మహారాజుగారి పటము. తీసికొమ్ము. నీకొఱకే తెచ్చితిని.. (అని యిచ్చుచున్నది.)

మోహి—ఇ దెందుకు తెచ్చితివే?

పుష్ప—నీవు చూచిన యానందింతువని.

మోహి—(తనలో) ఈ పటమునుఁ దెచ్చి యిచ్చుటఁ జూడఁగా నీ చెలి యీ విషయమై కొంత పొడుపు ప్రసంగమునుఁ గావింప నెంచిన ట్లగపడుచున్నది. కావున నీ ప్రసంగముఁగూడ మార్చివేసెద. (అని యా పటమును దూరముగా నుంచి ప్రకాశముగా) చెలీ! యీ దినము నీ కొఱ కెంతసేపు కాచుకొని యుంటినే! ఈ పుష్పమాలను దెచ్చుట కింత సేపు కావలయునఁటే?

పుష్ప—ఆఁ. మఱచితిని. నేను వచ్చునప్పుడు దారిలో నెవరో మాట్లాడుకొను చుండఁగా వినుచుఁ గొంచెము సేపు నిలువఁబడితిని. అందుచేఁ గొంచె మాలస్య మైయుండును.

మోహి—ఆ మాట్లాడుచుండినవా రెవరే?

పుష్ప—దారిని బోయెడువా రెవరైన మనకేలా?

మోహి—ఊరకయే యడుగుచుంటిని. వారు రహస్యపుమనుష్యులా?

పుష్ప—అయ్యో! రహస్యపు మనుష్యులు కారు. మన యంతఃపుర పరిచారికలే?

మోహి—వా రేమిచెప్పుకొనుచుండిరే?

పుష్ప—(మూతి ముడుచుకొని) ఏమో చెప్పుకొనుచుండిరి. నాకుఁ దెలియలేదు.

మోహి—నీకుఁ దెలియకయే యింతసేపు వినివచ్చితివటే?

పుష్ప—ఏమో; విన్నాను.

మోహి—చెలీ! యింత మర్మమఁటే?

పుష్ప—నే నేమియుఁ బైపోటిఁగ రాలేదుకదా. నాకు మర్మమెందుకు?

మోహి—చెలీ! ఆ ప్రసంగము లంత రహస్యములఁటే.

పుష్ప—లోలుత రహస్యములే యయినను బిదప బహిరంగములే యయినవి.

మోహి—అవి మన ప్రభువుగారి విషయములా?

పుష్ప—కనుక నే యింత సందేహించితిని.

మోహి—ఈమాత్రపుమాటను నీవు చెప్పకపోవునెడ మన స్నేహ మేమి స్నేహమే?

పుష్ప—పోనీ చెప్పెదను విను. మన రాజుగారు తన నూర్వురుభార్యల నొల్లనని త్యజించిరఁట.

మోహి—ఆఁ.—ఏమీ!—త్యజించిరా!—ఎందుకొఱకు?

పుష్ప—నీకొఱకే.

మోహి—ఈయన త్యజించినమాత్రమున వార లూరకుండిరా?

పుష్ప—లేదు. వారిచేత నైనట్లు నయభయములచేఁ బ్రార్థించిచూచిరి. ఐననేమి? గూఁటఁజిక్కినపక్షి గుంపులోనికి వచ్చునా?

మోహి—చెలీ! వారల నీ నాఁడు త్యజించెనఁటే?

పుష్ప—కాదు. నీ విక్కడఁ బాదము పెట్టిన దినమందే.

మోహి—ఆ నాఁటి సంగతి కీ నాఁడు విచారణయేల?

పుష్ప—రే పేకాదశియగుటచేత నీ రాజేంద్రుఁడు వ్రతసమయంబునకుఁ బట్టపు దేవి నైనఁ జెంతఁ జేరనిచ్చునో లేదో యని యొల్లరును గుబ గుబ గుబ లాడుచున్నారు.

మోహి—(తనలో) రేపే వ్రతము సాగునెడఁగదా పట్టపుదేవి చెంతకేగుట. ఈ చెలి నింకఁ బంపివేసి తగిన యోజన సేయవలయును. (ప్రకాశముగా) చెలీ! బయట నెవరో వచ్చుచున్నట్లున్నది చూడుము.

పుష్ప—(అటునిటుచూచి) ఎవ్వరును లేరు. ఊరకయే యిట్లు చెప్పి నన్ను మోస గింపఁ జూచితివా?

మోహి—కాదే. మరలి చూడుము.

పుష్ప—(చూచి) మన ప్రభువువారు వచ్చుచున్నారు. కాని చాలాదూరమున నున్నారు. ఆ సడి నీ కెక్కడకు వినవచ్చెనా? ఔరా! నీకు దూరదృష్టి దూర శ్రవణములు కూడఁ గలవేమో!

మోహి—ప్రభువుగారు వచ్చుచుండిరా? (కొంచె మాలోచించి) సఖీ! నీవు నా కొక మందారమాల నిత్తునంటివే; ఏదీ?

పుష్ప—అవును. ఇచ్చెదను లెమ్ము.

మోహి—ఇపుడుపోయి కూర్చుకొనివత్తువా?

పుష్ప—ఇప్పుడే కావలయునా? అలాగే తెచ్చెదను. పోయివచ్చెద. (అని తనలో) రాజుగారువచ్చుచుండఁగా నిచట నేనేల? (అనుచుఁ బోవుచుండఁగా)

మోహి—మరల వేగమే రావలయుఁ జుమీ.

పుష్ప—అలాగే వచ్చెదను. (అని వెళ్ళుచున్నది.)

మోహి—(స్వగతము) ఈ చెలి నొక మిష పెట్టి పంపివైచితిఁగదా. రాజేంద్రుఁడు నాకొఱకై తనయాఱ్వురుభార్యలఁ ద్యజించెనని యీ చెలివలన నెఱింగితి. ఈ చెలి వలన నా రాజేంద్రుని పటమొకటికూడ నాకుఁ జిక్కినది. అతఁ డిప్పు డిచటికే వచ్చుచున్నవాఁడు. రేపే యేకాదశి. కావున రేపటివ్రతముఁ జెఱచుటకై నే నిప్పుడేదైన నొక్క తంత్రముఁ గావింపవలసియున్నది. (అని మింటికై చూచుచు నాలోచించి) ఆఁ. మంచియోజన తోఁచినది. రాజేంద్రుఁ డిచటికి వచ్చునప్పటికి నేను శయ్యపైఁ జేరి యాతనిరాక నెఱుంగనట్లును, నాతని రాక యాలస్యముగు టంజేసి నేను విరహాపరవశురాలనైనట్లును నటింపుచు నాతనికి నాయందపరిమిత మోహ మూరించెద. ఇదియే ప్రథమకర్తవ్యము. (అని శయ్యకై కేగుచున్నది.)

(రుక్మాంగదుఁడు ప్రవేశించి ప్రక్కను నిలిచి తనలో)

రుక్మా—ఈ నా ప్రాణసఖి యంతఃపురంబున నొంటిగ నుండుటతో నేమిచేయు

చుండునో. (వినుట నభినయించి) తనలో నేమేమో మాటలాడు కొనుచున్నది. అది యేమో యాలకించెద. (అని వినుచున్నాఁడు.)

మో—గీ. అక్కటా నాథ! నీవిట్టు ♦ లాలసించు
కారణంబేమొ నామదిఁ ♦ గానరాదు;
నీదు సతిసుతహితులెల్ల ♦ నీకు నేమి
బోధఁ జేసిరో యేనెందుఁ ♦ బోవు దాన?.

రుక్మా—నేను నా భార్యాపుత్రుల బోధనలకు లోఁబడుదుననియే యీ కాంతామణి యింకనుఁ దలఁచుచున్నది. కానిమ్ము. ఇచటనే యుండి యింకనేమి జరుగునో చూచెద.

మోహి—అక్కటా నాథా! యింకను రావైతివేమి? నాయందు నీ వింతటి నిర్దయ నెట్లు వహింపఁగల్గితివి? ఇఁక నే నేమిచేయుదును? పోనిమ్ము. నీ యీ పటమును జూచుకొనియైనఁ గొంత తృప్తిఁజెందెద. (అని పటమును జేతఁ దీసికొని యాశ్చర్యమభినయించుచు) అహా! ఏమి యీ సోయగంబు! భానుసమతేజుండైన యీ రాజేంద్రుండు తన దివ్యతేజంబున నీ జగంబెల్ల వెల్గొందఁజేయఁ జాలియున్నవాఁడు. ఈతఁడు సౌందర్యంబున శరీరధారియై భూస్థలి కరుదెంచిన కంతుఁడో లేక జయంతుఁడో యనఁదగియుండెఁగదా! వహవ్వా! సౌందర్యమన్న నిట్టులుండవలయు?

చ. కిలకిలనవ్వు నెమ్మొగము, ♦ కెంపులఁ జిల్కెడు కావిమోవి, క్రొ
న్నెల నిరసించు నెన్నుదురు, ♦ నిక్కెడు వీనులకంటు నేత్రముల్,
వలపులఁగుల్కెడు శీవి, వహ ♦ వా! జిగిదేఱెడు మేనిసౌరునున్,
గలిగిన యీ నృపాలు బిగి ♦ కౌఁగిటి కన్నను స్వర్గ మెక్కడే?

సీ. నళినారి యీమోము ♦ నకు సాటి యనవచ్చు
క్షీణత్వ మాతఁడు ♦ చెందకున్న
దర్పణంబులు గండ ♦ తలముల సరియగు
కలుకు కోఁతలఁ బడి ♦ తలఁగకున్న

పద్మంబు లీమ్మృదు ♦ పదసామ్యమునుబొందు
వాడిపోయెడి గోడు ♦ వడయకున్న
కనక మీ తనువున ♦ కెనయునఁ జెల్లును
కఱఁగి నీరైపోవు ♦ కులుకఁగకున్న

గీ. నందఱకు నన్ని దోషంబు ♦ లంటి యుండెఁ
గాని జితమన్మథాకార ♦ కలితుఁ డితఁడు
అక్కటా నాదుకన్నుల ♦ కద్దు కొంచుఁ
బూజసల్పుదు నిమ్మహా ♦ పురుషు నెపుడు.

ఇట్టివానితోడఁ గలసి మెలసి వర్తింపుచుఁ జిరసౌఖ్య మనుభవింపఁ జాల కుండిన యీ జన్మంబేల?

రుక్మా—చిరసౌఖ్య మను మాట నామనంబున నొక్క వింత యానందమును గల్పించు చున్నది.

మోహి—ఔరా! అంతటిభాగ్యము నా కబ్బెడునా? వింతసుద్దులచేత నీతనిం దేల్చి యొద్దఁజేరి ముద్దునెమ్మొగంబు నంది ముద్దుఁగొను భాగ్యము నాకింక లభించునా? వెంగటఁజేరి మడుపులిచ్చుచు నొక్కమడుపు నోటి కందీయఁబోయి నా నోట వైచికొని నాథా యోడితి రోడితిరని గేలిఁజేసి మెప్పించుట నాకుఁ గలుగునా?

రుక్మా—అక్కటా, యిప్పుడీ ముఖసౌందర్యముఁ జూచుటకు నాకు రెండుకన్నులు చాలకున్నవి. ఏమిచేయుదును? (అని కన్నులు నలుచుకొని మరలఁ జూచు చున్నాఁడు.)

మోహి—(ప్రక్కనిలిచి నాథా యొక్క రహస్యం బెటింగింతునని చెవిఁ జేరం జని మక్కువఁ జెక్కిలి చురుక్కన నొక్కి "యక్కటా, నాథా! యలసితివి కాఁబోలు, క్షమింపు" మని యాదరించు నెపంబునఁ గౌఁగిలించు భాగ్యంబు నా కబ్బెడునా?

రుక్మా—(సంతోషముతో) హా! హా! యిప్పుడుకదా నాజన్మ సఫలతఁ గాంచినది.

మోహి—హా! అంతటి భాగ్యం బెంతటి భాగ్యశాలురకోగదా. [25]

చ. కరమునఁబట్టి, యొక్కచవి ♦ గాఁ దరితీపులఁగుల్కు పల్కులన్
మురిపెములొల్కునక్షులను, ♦ మోహపుటాలు,ముగ్ధగుల్కులన్
గరము మదిం గరంచి, బిగి ♦ కౌఁగిటనుంచి, ముదంబు నించుబల్
సరసగుణాఢ్యు పాదజల ♦ జమ్ముల కేను నమస్కరించెదన్. 4

హా ప్రియా! హా మనోహరా! నిన్నింక నా కన్నులఁ నెన్నఁడయినఁ గాంతునా?

రుక్మా—అక్కటా యేమందు.

ఉ. బాపురె! యీమృగాక్షిమృదు ♦ భావము నాపయి నాఁటఁజేసి,తా
నాపఁగరానిమోహవిర ♦ హాంబుధి ముగ్గుచు మాటిమాటికిన్
హా ప్రియ!హామనోహర!మ ♦ హాకరుణానిధి!యంచునార్చు, నే
నీ ప్రియకాంత మోహమున ♦ మెట్టులు తీర్పఁగ నేర్తునో కటా!

మోహి—అట్టి భాగ్యశాలుర కొక్క నతిఁ గావించినను మేలగును.

చ. ఎదనెదహత్తి, కోర్కు లిగు ♦ రెత్తఁగఁ గౌఁగిటనొత్తి; జల్లుప
య్యెదఁ గడకొత్తి, కేళితమి ♦ హెచ్చిన కాముకవృత్తి, నచ్చెలిన్
బదఁపడి మోహవార్ధి భుజ ♦ బంధననైపుణిఁ దేల్చి, యేలు బల్
సదయుని దివ్యపాదజల ♦ జమ్ముల కేను నమస్కరించెదన్. 6

రుక్మా—అక్కటా యి దేమివింత!

గీ. తరుణి విరహార్తిఁ దీర్పంగఁ ♦ దలఁచు చుండ
నాదు చిత్తంబె విరహార్తి ♦ నవయు చుండె;
కొండనాల్కకు మందీయఁ ♦ గోరు చుండ
నుండు నాల్కయె మొదలంట ♦ నూడె నట్లు. 7

(అని మోమువంకఁజూచి) అదిగో! మరల నేమొ చెప్పఁబోవుచున్నది.

మోహి—హా! హా! వారలదే సౌఖ్యము.

చ. చెలిఁ దలిరాకుపాన్పుపయిఁ ♦ జేర్చి, బరాబరిఁ జెంతఁజేరి, యో
యలికులవేణి!యో జలరు ♦ హానన!యోయమృతాధరోష్ఠి!యో

వలపులబొమ్మ! యంచు మృదు ♦ భాషల నెచ్చెలి గారవించు ని
శ్చలసుచరిత్రు పాదజల ♦ జమ్ముల కేను నమస్కరించెదన్. 8

రుక్మాం—అయ్యో! హృదయమా! నీవు కలవరమంద నేల!

పంచచామరము.

బళా! యిదేమి డెందమా? శు ♦ భప్రతీక నీదెగా?
హాళాహళిం గృశించి యిట్టు ♦ లార్తిఁ జెందె దేటికే?
తలంచు నీదు పెట్టెలోన ♦ దాఁచినట్టి సొమ్ముకై
కలంతఁ జెంద వెఱ్ఱి వంద్రు ♦ కాదె? సుంత తాళుమీ. 9

మోహి—అక్కటా! నా ప్రాణవిభుఁ డింకను రాకయుండె. ఏమిచేయుదు? హా! మరియు సుమశరుండై నన్నలయింపఁ జూచుచున్నవాఁడు. ఔరా, మదనా! ఇది నీ కదనా? నీ శూరికి నే నోర్చెదనా? పుష్పబాణుండవగు నీవు పుష్పకోమలులమగు మ మ్మేఁచఁదగునా? శుకమా! నీవు క్రోధరసంబెల్ల ముక్కునం బెట్టుకొని యిట్టు లేటికి చెవులు చీదరవోవ వదరెదవు? కొమ్మలఁజేరి ఫలభంగంబుఁ గావించు బుద్ధి నీ కీనాఁడు పుట్టెనా? జన్మతోనే కలిగినది. ఇంక నీ వదరుడు చాలింపుము. పికమా గొంతుఁ జించుకొనుచు నేల యిట్లెగిరి పడెదవు? నీవు పిన్ననాఁటినుండి పలుగాకుల కూటమిం బెరుఁగుట యెవ్వరెఱుంగ రనుకొనకుము. భృంగమా! కొమ్మల తావు లపహరించి మదించి మరలఁ గొమ్మలపై దాడివెడలుచుంటివా? చాలుఁజాలు.

అక్కటా! యీ తాపం బెంతయని భరింతును? నా ప్రాణవిభుండు, నా మనోనాయకుండు, నా తొలినోముఫలము, నా మనోభీష్టప్రదాత యింక నా కనుల కగపడు భాగ్యము నాకు లేదు కాఁబోలు. హా, శంకరా! (అని మూర్ఛ నభినయించుచున్నది.)

రుక్మాం—(త్వరపడుచుఁ దనలో) ఈ యువతి నాపై మోహాతిశయమున విరహోత్కంఠితయై మూర్ఛనొందుచున్నది. ఏ నింక నాలసింపఁ జనదు. (అని సమీపించుచున్నాఁడు.)

మోహి—(తన సంతాపంబును దాఁపనెంచి నట్టులు యత్నింపుచు, నించుక సంతోషం బభినయించుచుఁ గూర్చున్నది.)

రుక్మాం—తరుణీ! వనాంతరంబున స్వేచ్ఛావిహారంబుననుండు నీ కిచట నెట్టు లుండెనో. ఇచటి రత్నఖచిత సౌధంబులును, శుకశారికారవంబులఁ బ్రతిధ్వను లిచ్చు మదీ యారామశ్రేష్ఠంబులును, నీ కేమైన సంతోషదాయకంబులుగ నున్నవా? నీ విచట సుఖంబుగ నుంటివికద?

మోహి—ప్రాణేశ్వరా! నీ విటులు శంకింప నేల?

క. పరమకృపామయుఁడగు భూ
 వరనాథుఁడు చెట్టఁబట్టి ♦ వాంఛలు తీర్పన్
 సరసనె వసించి యుండఁగ
 నురుతరసౌఖ్యంబు వేఱె ♦ యుండునె చెపుమా? 10

అఖండ భూమండలాధీశ్వరులగు దేవరవారి యనవరత సాన్నిధ్యమే నిఖిలకామితార్థ దాయకంబై యుండ నే నింక వేఱుగఁ జెప్ప నేల?

రుక్మాం—ఔరా, యెట్టిమాటఁ బల్కితివి!

క. తరుణిరో నీ సాన్నిధ్యమె
 మఱిమఱి వాంఛించు నిట్టి ♦ మాబోంట్లకు నీ
 దరి నివసించెడి భాగ్యం
 బురుతర సామ్రాజ్యపదవి ♦ నొందుట కాదే? 11

మోహి—సరసాగ్రేసరులగు దేవరవారికి నేను విన్నవింపవలసిన దేమికల్గు? వినను

సీ. అఖిలాండకోటి బ్ర ♦ హ్మాండనాయకుని ది
  వ్యాంశ కేశవుఁడు పు ♦ ణ్యాలయంబు
 సకల దివ్యాంగనా ♦ చక్రంబునకు నే మ
  హాత్ముని గృహసీమ ♦ యాటపట్టు
 సంగీత సాహిత్య ♦ సరసకవిత్వ బో
  ధల కే సుజను సేవ ♦ తల్లి దండ్రి

ధర్మసంస్థాపన ♦ తత్పరత్వమునకు
నే మహాజనుఁడు శ్రీ ♦ రామమూర్తి

గీ. ఏ సుజను చెల్మి యింద్రలో ♦ కైక భోగ
మే సరసుకల్మి శ్రితచక్ర ♦ వాస భూమి
యట్టి మహనీయుఁడైన ధ ♦ రాధి నాథు
చెలిమి కల్గుట తొలిపుణ్య ♦ ఫలము కాదె? 12

ఇదంతయు దేవరయెఱుంగనిదికాదు. మనోహరా! యీ విడెంబుఁ గైకొనెదరా?

రుక్మా—మహాభాగ్యముకదా? కీరవాణీ! నీ వీ మదుపులిచ్చుతఱి మనోహరంబగు నొక్క పాటఁ బాడవలయు.

మోహి—ఏపాటఁ బాడుదును ప్రాణేశ్వరా?

రుక్మా—అరణ్యమధ్యమ్మున నేను వేటాడి యలసి నిదురించియున్నతఱి నా చేరువ సంపఁగివృక్షంబునీడను గూర్చుండి ధన్యునింగూర్చి నీవు పాడిన పాటను నా మనంబు మరలమరల వినఁగోరుచున్నది. దాని నొక్కతూరి పాడుము.

మోహి—చిత్తము అలాగే పాడెదను. (అని యిట్లు పాడుచున్నది.)

ద్విపద - ఖమాచిరాగము - ఏకతాళము - మిశ్రజాతి.

[16] అల్లరిమారుని • యలయికలకును &c., &c., 11, 12, 13, 14,

రుక్మా—ఆహా! కీరవాణీ! ఏమి దీని మాధుర్యము! ఈపాటయే నాయదృష్టదేవతఁగా దలంచెద. ఏలయన, ఇట్లు నీ చెంతఁజేరి నీ శారీరసుఖంబు కొల్లలుగ ననుభవించు భాగ్యమును గలిగించి నన్ను ధన్యుని జేసినది యీ పాటయే. ప్రాణసఖీ! ఇప్పుడు నిశీధ సమయం బగుచున్నది. ఏను విశ్రమించెద.

మోహి—చిత్తము. ప్రాణేశ్వరా! ఇప్పుడు నాకును నిదుర కన్నులఁ గ్రమ్ముచున్నది. (అని యిద్దఱును శయనగృహంబున కరుగుచున్నారు.)

(తెరలోపల జాంఘికుడు.)

ఓహోయి, ఛమస్తమయినోరు యినండి. యినండి. తెల్లారు జాము అయ్యింది నాలుగు గెంట లయ్యింది. తెల్లారితే యాకాశి. అంతా నిద్దర తెగవాలిశింది.

యాకాశిరతం శెయ్యాల. అంతా లెగశి, మొగాలు కడుక్కొని, తానాలు శెయ్యాలిశిం దోహాయి.

రుక్మా—(చాటింపు విని శయనగృహమునుండి వెలికి వచ్చి తనలో) అక్కటా! ఏమి యీ చిత్రంబు! రేపటి దినంబే యేకాదశి యఁట.

క. ఏకాదశి యేకాదశి
యేకాదశి యంచుఁ బలవ ♦ రించెను నేనే
యీ కాలంబున నకటా!
యేకాదశియనెడు మాట ♦ యే మఱచితిఁగా! 13

ఇట్లగుట కామినీలోలుండ నగుటచేతనే కదా. కావుననే కామినీసంగమంబులు పుణ్యస్వర్గవిఘ్నకారణంబు లని పెద్దలు చెప్పుదురు.

మోహి—(నిదురలేచివచ్చి యా ప్రక్కను రాజున కగపడకుండునట్లు నిలిచి విని తనలో) ఔరా! కామినీసంగమంబులు పుణ్యస్వర్గవిఘ్నకారణంబులా! (అని రాజు నుద్దేశించి తనలో)

ఉ. కామినిలేకయే యిటు జ ♦ గంబులు కల్గెనె? భోగ మబ్బెనే?
నేమము నిష్ఫలుల్ సలుపు ♦ నీవు జనించితె? పుత్రపౌత్రులం
చీ మహి నెల్లవారలు ర ♦ హిం గనుచుండిరె? నేఁటికీ గతిన్
గామిను లక్కటా దురిత ♦ కారిణులైరె? సెబాసు భూవరా! 14

రుక్మా—అయ్యో! యిప్పటికే కాలహరణమయినది. వ్రతసమయం బాసన్నమగుచున్నది. నే నింక సత్వరంబునం జనవలయు. (అని నాలు గడుగులు నడచి) మోహినికిఁ జెప్పకయే పోవుదునా? చెప్పినఁ బోవనీయ దేమో! అయిన నిపుడు నిద్రించుచుండెఁగదా. మేల్కొన్న వెనుక నేను చెంగట లేకుంటఁ జూచి యెంతకోపగించునో! ఎన్నఁ డెడఁబాయనని మున్నె బాసఁజేసియుంటి. ఇట్టి సఖి నెట్టు లెడఁబాసి పోవుదు? (అని కోపముతో) ఛీ! ఏమి యీ సందియము! యౌవనమదాంధుఁడనై పువ్వుఁబోఁడుల కౌఁగిండ్లందగిలి తుచ్ఛంబులగు భోగంబు లనుభవించుచు, సర్వాభీష్టప్రదంబును, సమస్తశలువ సాశకంబును, శ్రీవిష్ణుప్రీతికరంబును నగు హరివాసరవ్రతం బాచరింపఁజనుటకు సంశయించు

చున్నవాఁడ. ఇది యెంతటి వెఱ్ఱితనము. (మెల్లఁగాఁ గొంచెము నడచి) పోవలె నన్నఁ గాళ్ళు రాకున్నవి. మోహిని కోపగించునేమో. వనంబునకుండి కొని వచ్చినదాదిగ నాయం దత్యంతానురాగంబున మెలఁగుచున్నది. ఒకప్పుడైన నా మనంబును నొప్పించి యెఱుంగదు. అట్టి ప్రియురాలికిఁ జెప్పక యే నెట్లు పోవనేర్తు?

మోహి—(హర్షముతోఁ దలయూఁచి తనలో) ఈపాటి మోహము నీ హృదయమం దుండిన, నా యుద్యమంబునకుఁ గొరంత కలుగనేరదు.

రుక్మా—నిద్దుర లేపి చెప్పి పోదునా? చెప్పినఁ బోవనీయదేమో. పోనీయకున్న వ్రతభంగం బగునుగదా. (రౌద్రముతో) ఆఁ! ఏమీ! వ్రతభంగమా? ఔరా! వ్రతభంగం బన్న నా మేను వడఁకుచున్నదే. ఇట్టి

ఉ. వేవురు కాంతలేని, పది ♦ వేల సుఖంబులునేని, శిష్ట సం
భావితమై, యజాదిసుర ♦ మానితమై, వరమౌనియోగి సం
సేవితమై, మహాసుజన ♦ చింతితమై, శతకోటిభక్తులో
కావనమైన యీ వ్రతశ ♦ తాంశమునైనను బోలనేర్చునే? 15

కావున నిప్పుడు సర్వవిధంబుల వ్రతం బాచరింపఁ జనుటయే కర్తవ్యంబని తోఁచుచున్నది. ఇప్పటికే కాలమతిక్రమించుచున్నది.హా! ఈశ్వరా! దీనబంధూ!

మ. దురహంకారుఁడ, దుష్టచిత్తుఁడను, మ ♦ త్తుండన్, నికృష్టుండ,నే
దరుణీలోలమనస్కుఁడౌచును భవ ♦ ద్భక్తిం బ్రవర్తింప నే
మరితిన్ నీ పద మాశ్రయింతు వరదా! ♦ మన్నింపవే తప్పులన్
గరుణాసాగర! దీనబాంధవ! జగ ♦ త్కళ్యాణ! సర్వేశ్వరా! 16

(అని మోకాళ్ళపై నిలిచి మింటికై దృష్టినిగిడించి నమస్కరించుచుండఁగా)

మోహి—(తనలో) ఇప్పుడింక నూరకుండఁజనదు. (తటాలునవచ్చి చేయిపట్టుకొని) [26] ఇదేమి ప్రాణనాథా! నీవిచట నేమి చేయుచుంటివి? నన్నొంటిగ నింట విడిచి నీ విచట నొంటరితనంబున మింటికై చూచుచు నేమో గొణఁగుచుంటివి. అదియేమి? అలసి నిదురించుతఱి నేమైనఁ బీడకలఁ గంటివా?

రుక్మాం—తరుణీ! కాదు. నేఁ డేకాదశీవ్రతం బాచరింపవలసి యున్నది. దాని నింతదనుక మఱచితిఁగదా యని తమార్పణ పూర్వకంబుగ నా హరిని స్మరింపుచున్నవాఁడ.

మోహి—చాలుఁజాలు రాజేంద్రా! మన కేమి, వ్రతములేమి! అంతఃపురమునకుఁ బోవుదము రమ్ము.

రుక్మాం—తరుణీ! యిట్లు పల్కఁ జనదు. ఈ హరివాసరవ్రతం బవశ్య కర్తవ్యంబు. ఈ దినంబున కామినీ సంగమంబులు కేవలదూష్యంబులు. నీవును నన్నుం జేరి వ్రతం బాచరింపుము. ఇది సర్వోత్కృష్టమైన వ్రతంబు. సమస్తకలుష నాశకంబు. శ్రీవిష్ణు ప్రీతికరంబు. దీనిచే నీకును శ్రేయంబగు.

మోహి—(పకపక నవ్వి) రాజేంద్రా! నేఁడేమో క్రొత్తవానివలెఁ బ్రసంగించుచుంటివే!

చ. వ్రతమఁట, మౌనివంద్యమఁట, ♦ పాపహరంబఁట, దానినిట్టి భూ
పతియఁట, యాచరించునఁట ♦ బాపురె! సజ్జనులార! వింటిరే?
అతులసుఖాబ్ధిఁ దేలుచు మ ♦ హావిభవంబున నోలలాడు భూ
పతులకు నిట్టి దుర్భ్రమలు ♦ పాడియె? లోకులు విన్న నవ్వరే?

ఇట్టివ్రతంబును నేనుగూడ నాచరింపవలయునా!

ఉ. ఆరయ కుంటి, గ్రుడ్డి, వికి ♦ లాంగులు, వృద్ధులు, కుష్ఠరోగులున్
దారు జగాన నేరికి వ్య ♦ ర్థాయగుటం దమ ప్రొద్దుపోకకున్
సారెకుఁ గృష్ణ!కృష్ణ!హరి! ♦ శౌరి!ముకుంద!యటంచుఁజప్పటల్
వారక దట్టుచున్ మది నె ♦ బాసనుకొంద్రు తమంతఁ దృప్తులై.

అట్టివారింకఁ గొంచెము యుక్తిపరులును సమర్థులునుఁ గూడ నగుదురు

ఆ. తమ్ముఁ జేరు వారిఁ ♦ దమబోంట్లఁగాఁ జేయ
బుద్ధిఁ గలిపి యిటులె ♦ బోధఁ జేసి
నరగ వ్రతము లంచు ♦ సంతర్పణము లంచు
వారి నెల్ల గతులఁ ♦ జూరఁ గొంద్రు.

ప్రాణనాథా! నీ వెచ్చటనో యిట్టివారి మోసములలోఁ దగిలినట్లు కనవచ్చుచున్నది. లేకున్న నిన్నటిదనుక సంతఃపురంబున కామోపభోగంబు లనుభవించుచు నన్నుంగూడి సరససల్లాపంబులచేతఁ గాలంబుపుచ్చుటయేడ! నేఁటి దినంబునఁ గృష్ణకృష్ణాయంచు, గోవిందగోవిందాయం చఱచుచు వెఱ్ఱివానిపగిది నానందించుట యేడ! ఇట్టిది చూడ నెవ్వరికైన నాశ్చర్యంబుగనుండదా? పరులు వినిన నవ్వరా? నాథా! ఇట్టి వెఱ్ఱితలంపులు విడిచిపెట్టుము. సంశయింపక యంతఃపురంబునకుఁ బోవుదము రమ్ము.

రుక్మా—తరుణీ! ఈ వ్రతంబు లాచరించుమనుట యంతయు వ్యర్థుల బోధయనియా పలుకుచుంటివి?

చ. భువి సకలార్థబోధన ల ♦ పూర్వగతిం దగఁ జేసినట్టి యా
ప్రవిమలమూర్తులా మను ప ♦ రాశరముఖ్యులె తెల్పలేవె యీ
ప్లవసరబోధ లెల్ల? నస ♦ మర్థులె వార లఖండ ధర్మ శా
స్త్రవిరచనాధురీణులును ♦ సజ్జనమాన్యులు గారె? కోమలీ! 20

నీ వీ వ్రతమాహాత్మ్యం బెఱుంగక వేలవై యిట్లు తూలనాడితివి. ఇదిగాక

గీ. ధరణి సద్బ్రాహ్మణునకిచ్చు ♦ ద్రవ్యగరిమ
యార్తునకుఁ బ్రీతిఁ జేయు సా ♦ యంపు మహిమ
నెన్న నజునకు నౌనె? నీ ♦ వేల వెఱ్ఱి
మాట లాడెద వబల క్ర ♦ మంబుఁ దప్పి?. 21

ఈ హరివాసర వ్రతంబునుఁ బోలు వ్రతం బింకఁ గలదా? ఈ దినం బంతయు నుపవసించి విష్ణుకథాలాపంబులచేతనే కాలంబుఁ గడపవలయుఁ గాని యంతఃపురం బన్నమాటఁ దలఁపనైన రాదు. అంగనామణులఁ గన్నెత్తి చూడనైనఁ జనదు. కావునఁ గోమలాంగీ! నీ వింకఁ జనుము.

మోహి—(ఈసడించుచు) నీ విచటనుండ నేనెచటికరిగెద? నీవును వెడలిరమ్ము. ఉభయులము పోవుదము.

రుక్మా—తరుణీ! నేటిదినంబంతయు మాత్రము నన్ను విడువుము. పలుకరింపకుము. లేకున్న వ్రతంబున కాటంకంబగు.

మోహి.—రాజేంద్రా! ఏమి నీ వాక్యంబులు! ఏమోవ్రతంబఁట! అట్టి వ్రతంబున కాటంకంబఁట! వయసుచెల్లినవెనుక పండ్లూడి, కన్నులు కానరాక, చెవులు వినరాక, దేహేంద్రియములెల్ల శుష్కించి, యొరులుముట్టుటకును జూచుటకును గూడఁ గొఱగాకయుండునట్టి వార్ధకదశయం దిట్టివ్రతంబులు వేయి నోఁచినను నోఁచఁదగును. కాని యట్టి వృద్ధత్వంబున నీవు కావలయునని కోరినను ఇట్టి కామినీసౌఖ్యంబు లనుభవింప సమర్థుండవై యుండఁగలవా?

క. ఆఁకలి దప్పులఁ గనలుచుఁ
ప్రాకటమగు యౌవనంబుఁ ♦ బా డొనరింపన్
నీకెట్టులు మదిఁ దోఁచెను?
తోఁకకు కళ్ళెంబు వెట్టు ♦ దురె యెవ్వరైనన్?. 22

సీ. నా ప్రాణనాయక ♦ నా మనోహర! యంచుఁ
జెక్కు నొక్కెడు సఖు ♦ లొక్క చోట
రాజ్యతంత్రము లోన ♦ రఁగఁ జెప్పి విసికించు
నురు పురోహిత మంత్రు ♦ లొక్క చోట
తాత తండ్రులనుండి ♦ జాతలు మీఱంచు
మ్రొక్కి వేఁడెడు శ్రితు ♦ లొక్క చోట
వనమృగంబుల బారిఁ ♦ బడలేము రక్షించు
మో ప్రభూ! యను పౌరు ♦ లొక్క చోట

గీ. నెల్ల విధముల నిన్నుల ♦ యించు చుండ
జపతపంబులు వ్రతములు ♦ జరగు టెట్లు?
గాసి నొందకు వ్యర్థోప ♦ వాసములను
జనదు జన దిట్టిరీతి యౌ ♦ వనము నందు. 23

యౌవనము ఝరీవేగతుల్యం బనుమాట నెఱుంగవా? ఇట్టియౌవనంబంతయు నీ యుపవాసంబులకును, నేమంబులకును నిష్ఫలకును ధారవోసి పిమ్మట వార్ధకంబున నీవు చేయునది యేమున్నది? కాలు కదల్పలేని కాలంబున కామినీసౌఖ్యంబు లనుభవింపఁబోయెదవా?

క. తల నరసి యొడలు వడఁకుచుఁ
బలుకులు తడఁబడఁగ వయసు ♦ బాసిన వెనుకన్
లలనలు చెలియలు నేటికి?
చలిపోయిన వెనుక మంచి ♦ సాలుల కరణిన్ 24

అప్పుడు నీ యందలి యసమర్థతం జూచుకొని వృథా వగవఁజొచ్చిన నేమి ప్రయోజనంబగు? గతజలసేతుబంధనంబుగ నుండుఁగద. ఇంక నట్టి వార్ధకదశ నీ వ్రతంబుల కనుకూలంబుగ నుండును. సర్వవిధంబుల నదియే తగిన సమయము. ఎట్టులనిన:—

ఉ. వ్యర్థమటంచు నష్టు ప్రియ ♦ భామలు పల్మరుఁ జేరరారు; నీ
యర్థము రాజ్యమున్ సుతున ♦ కర్పణసేయఁగనౌను; జన్మమున్
సార్థకమంచునెంచి యని ♦ శంబును నొక్కెడఁ గూరుచుండి,యా
వార్థకమందు నెన్నియుప ♦ వాసములైనను జేయఁగాఁదగున్.25

ఇంక నెన్నివ్రతంబులనైన నాచరింపవచ్చును. ఎంతసేపైన గోవింద గోవిందా యని యఱచుచుఁ గూరుచుండవచ్చును. కాని యిప్పుడు వ్రతంబులేల నాధా? ఇట్టి వెఱ్ఱితలంపులెల్లఁ గట్టిపెట్టి యంతఃపురంబునకుఁ బోదమురమ్ము. కలిసి వచ్చు భోగంబును గాలఁ దన్నకుము.

రుక్మాం—తరుణీ! నీ పల్కులును సత్యంబులే కాని యే నొక్క ధర్మసూక్ష్మం బెఱింగింతు వినుము.

ఉ. కన్నియ! యావనం బిహసు ♦ ఖంబులఁ జెందనెకాదు;చూడుమిం
దెన్నఁగ ధర్మరక్షణము, ♦ నీశ్వరసేవయు, సాధుమైత్రి, యా
పన్నజనావనంబు, గురు ♦ భక్తియు, సద్వ్రతముల్, జపంబు లి
ట్లెన్నియొ చేయఁగావలయు ♦ నిన్నిఁటి వీడి సుఖంపఁ బాడియే?

ఇదికాక

చ. ఇల జనియించు వేలయొకొ, ♦ యెచ్చటికేగుటొ, యేమిదిక్కొ,యా
వల గతియేమొ, కానకయె ♦ భామలకౌఁగిళులందుఁ జిక్కి హా

కలదిఁక యౌవనం బనుచుఁ ♦ గామసుఖంబులె కోరఁజెల్లునే?
కలిగెను నోరటం చిలను ♦ కట్టడి తప్పి భుజించు టొప్పునే? 27

ఈ వ్రతంబులు వార్ధకంబునఁ జేయఁదగుననియు, యౌవనము ఝరీవేగ తుల్యంబనియుం జెప్పితివి. కాని జీవనము బుద్బుదప్రాయం బను మాట మఱచితివి కాఁబోలు.

ఆ. మాయ బొమ్మ సుమ్ము ♦ మానిని! దేహమ్ము
క్షణము లోన నట్టె ♦ సమసి పోవు;
దీని సత్య మంచుఁ ♦ దెల్వి చాలక నమ్మి
మురియు చుండ్రు వెఱ్ఱి ♦ మూర్ఖు లతివ!. 28

ప్రపంచ మున్నంతకాలము బ్రతుకుదుమంచుఁ దలంచితివేమో. ఎప్పుడో కాలుఁడు మ్రింగఁగాచియున్నవాఁడు. శ్లో. నిత్యంసన్నిహితోమృత్యుః కర్తవ్యో ధర్మసంగ్రహః అన్నట్లు మృత్యు వెల్లప్పుడు మన వెంట నంటియే తిరుగుచున్నది దేహేంద్రియాదులు బలవత్తములై యుండునప్పుడే నరుండు హరిసేవాపరుండై వర్తింప వలయు. కావున భాసురాంగీ! ఈ ప్రసంగంబులు చాలించుము. ఇష్ట ముండిన నీవును వ్రతం బాచరించుము. నీకు శ్రేయంబగును. లేకున్న నేఁటికిఁ జనుము. రేపటినుండి మన యిచ్చవచ్చిన ట్లుండవచ్చును.

మోహి—[27] సెబాస్, రాజేంద్రా! మంచి జ్ఞానోపదేశంబుఁ గావించితివి. మిగుల సంతసించితి. నన్నరణ్యంబునఁ గాంచి, మోహించి, వరించి, కొని తెచ్చినదెల్ల నిట్టి వ్రతంబు లాచరించుమనుటకేనా? ఇంక నీకుఁ జెప్పవలసిన దేమున్నది?

గీ. ఉండినట్టులె వనమున ♦ నుండ లేక
కుడిచి కూర్చుండి నిఁక జేరి ♦ గొప్ప తగులు
తెల్వి చాలక నీతోడఁ ♦ దెచ్చు కొంటి
కొఱవి తోఁడుతఁ దల గోఁకు ♦ కొన్న రీతి. 29

మత్తకోకిల—పూరికల్యాణి రాగము—త్రిపుట తాళము—త్రిశ్రజాతి.

పంకజాక్షునిఁ బార్వతీప్రియు ♦ భక్తి నెప్పుడుఁ గొల్చునా
శంక లేకయె డాసి బాసలొ ♦ సంగి నేఁ డిటు చేసితో

నింక నిన్నన నేల నీ విటు ♦ లెంతకైనను జాలవే?
చంకబిడ్డల జారఁదీసెదు ♦ జాణ వౌదువు భూవరా! 30

ఎన్నఁడు నిన్నెడఁబాసి యుండనంచుఁ బాసఁజేసి, కొనివచ్చి, యే నిప్పుడు మదనప్రేరితనై వేఁడుకొనఁగా నేకాదశియంచును బున్నమయంచును దినంబులు కడపఁ జొచ్చితివి. హా! ఏమి నీ సత్యవాక్యపరిపాలనాధురీణత్వంబు!

ఉ. సత్యవిహీనుఁడైన విర ♦ సంబుగఁ జూతురు సాటివార లే
భృత్యుఁడుగాని మాట చెవిఁ ♦ బెట్టఁడు, పెద్దలు చేరరారు, దాం
పత్యమునందుఁ గూడ నెడఁ ♦ బాపులు కల్గును; గాన భూవరా!
సత్యము లేకయున్న నరు ♦ జన్మమ దేటికి యీ జగంబునన్ 31

రుక్మాం—కోమలాంగీ! ఇప్పు డసత్య మెవ్వరు పల్కిరి?

మోహి—ఎవ్వరుపల్కిరా! అవునవును. (అని తలయూఁచి) హా! ఎంతటి ద్రోహచిత్తుఁడవు!

రుక్మాం—నేను గావించిన ద్రోహమేమి?

మోహి—ఒక్కటియైనఁగదా లెక్కించి చెప్పనగును! కృతాపరాధికి దోషనియమ మెట్లు? నీవు నిరపరాధి ననుకొను చుంటివి కాఁబోలు. ఇటు వినుము.

చ. అట ననుఁ జేరలేదె?

రుక్మాం—నిజమే చేరితిని.

మో—విర ♦ హార్తుఁడ నంచును బల్కలేదె?

రుక్మాం—పల్కినమాటయు నిజమే.

మో—ఏఁ। చుటయిదిపాఁడికాదనుచుఁ ♦ జొక్కుచుసోలుచు వేఁడలేదె?

రుక్మాం—ఇదియు సత్యమే.

మో—ఎ। ప్పటికిని నన్నుఁ బాయనని ♦ బాస లనేక మొనర్పలేదె?

రుక్మాం—యథార్థమే.

మో—ఈ।యటమట లేల నేఁడు? నిజ ♦ మాడిననిష్ఠురమహానుభావరా!

రుక్మాం—ఇప్పుడుమాత్ర మేమికల్గినది? నేఁ డొక్కదినమేకద ని న్నెడఁబాయ

వలసి వచ్చినది.

మోహి — (ఆగ్రహముతో) హా! ముగ్ధాంగనాచిత్తచోరా! స్వకార్యనిర్వాహణ విచారా!

శా. ఏవేళన్ బరపూరుషున్ దలఁపకే ♦ యెంతో ముదంబంది స్వే
చ్ఛావృత్తిన్ విహరించునన్ గదిసి, యా ♦ సల్ గొల్పి, కన్యాత్వమున్
బోవన్ ద్రోచి సుమాస్త్రతాఁకకిటులన్ ♦ ద్రోయంగ నౌనే నృపా?
వేవే వృత్తము నెక్కుమెక్కుమని యీ ♦ వే నిచ్చెనన్ దీసెదే?

ఇట్టివాఁడ వొక్కచోఁ గూరుచుండి నిష్కాముఁడవై తపంబాచరించుకొనఁ జాలక నన్నేల కొనితెచ్చితివి? ఇట్లిదివఱ కెందఱిను మోసపుచ్చితివి? ఇంక నెందఱి మోసపుచ్చఁ దలఁచితివి? నీ నూర్వురు సతుల నిట్లే తెచ్చితివి కాఁబోలు. ఇట్లు నిముసంబునకు నూఱబద్ధములాడు నీవంటి మోసగాండ్రకేనా కావలయు నీవ్రతంబులన్నియు! ఇట్టి వ్రతనిష్ఠలు కలవాఁడవు ముందే నాతో నేల చెప్పవైతివి?

రుక్మాం — ఓ మత్తగజగామినీ! ఏల నన్నిట్లు తూలనాడెదవు?

ధ్రువకోకిల - త్రిపుట తాళము - త్రిశ్రజాతి.

పడఁతి! సిగ్గనినంత మ త్ప్రియ ♦ పత్నులెల్లర నూర్వురన్
విడిచివైచితి నిన్నుఁ జేరితి ♦ వేవిధంబులఁ బొంగితిన్
అడుగు దాఁటక నీదు భృత్యుఁడ ♦ నౌచునుంటి సఖీ యెటో
కడపు నేఁటికి; రేపు నీమదిఁ ♦ గల్గురీతిఁగ నుండెదన్. 34

ఈ వ్రతకారణంబున నేకద నిన్నొక్కింత యెడఁబాయవలసివచ్చె. వనంబున నిన్ను వరించుతఱి నేకాదశీవ్రతదినములయందుమాత్రము నీ చెంతకు రాఁజాల నని తెలుప మఱచితి. అందుకు మాత్రము క్షమించుము. ఇంక నీ మనంబున సంశయింపకుము. నేనెప్పటికి నీవాఁడననియే యెఱుంగుము.

మోహి — రాజా! నాముందర నా నీవగలు చూపవచ్చెదవు? (నిందాగర్భముగా) అరణ్యంబునందు నన్ను వరించుతఱి నేకాదసులమాటఁ దెలుప మఱచితివి. వట్టి యమాయికుఁడవు.

ఉ. పాపము! చిన్నిపాపఁడవు ♦ ప్రాణగతానైనను జేతరా దదే
పాపమొకాని నాఁడు హరి ♦ వాసరవాక్యము వీడినావు; నేఁ
డీపని జ్ఞప్తికందినది; ♦ యే పని ♦ రేపిఁక జ్ఞప్తి కందునో
భూపతినంచు నిన్ను పలు ♦ పోకలు వ్రావ జగంబు మెచ్చునే?. 35

చెప్పెడివి శ్రీరంగనీతులు దూరెడివి దొమ్మరిగుడిసెలన్నట్లుగానే యున్నది.

రుక్మా—[28] (ఒక్కింతకోపముతో) తరుణీ! ఏల యిట్లు వృథాప్రసంగంబులఁ గావించెదవు? మాటిమాటికి వ్రతంబు విడువుమంచుఁ బల్కెదవు. యజ్ఞయాగాది క్రతువులందైనను, వివాహోపనయనాది శుభకార్యంబులందైనను, జాతమృత సూతకంబులందైనను, రోగపీడితులైనను, పిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు, సకలజనులు నాచరింప వలసిన వ్రతమైయున్నది. ఇట్టివ్రతంబునుమానసేర్తునా!

చ. క్షితి సకలంబు నిత్తు, గత ♦ శీలునకైనను కేలుమోడ్తు, నే
వెతలకునైన నోర్తు, మఱి ♦ వేయి సుఖంబుల నుజ్జగింతు, మ
త్సుతుని శిరంబునైన నిటఁ ♦ ద్రుంతునుగాని బళారె! యిట్టి స
ద్వ్రతమునుమానఁజాలఁ నిది ♦ తథ్యము తథ్యము తథ్యమంగనా!

నీ వృథాప్రసంగంబులు కట్టిపెట్టుము. నీవేకాదు. దేవేంద్రాదిదేవతలెల్లరును వచ్చి యడ్డగించినను మాన నని యెఱుంగుము.

మోహి—(తనలో) రాజేంద్రుఁ డిట్లు శపథము చేయుచున్నవాఁడు. ఇఁక నీతండు వ్రతంబు మానుటెట్లు? అయిన నీతని నింతటితో విడువఁజనదు. (అనిప్రకాశముగా) రాజేంద్రా! నీవు సత్యవ్రతుండవు. నిజభక్తితో వ్రతంబాచరించుచున్నవాఁడవు. ఈవ్రతంబునకై "మత్సుతుని శిరంబునైననిట ద్రుంతు" నంచుఁబల్కితివి. సరే. అట్లేకావింపుము. నీకు లేనివిచారము నాకేల? లేకున్న వ్రతంబువిడిచి లేచిరమ్ము.

రుక్మా—(విస్మయమును దుఃఖమును బొందుచుఁదనలో) హా దైవమా! దీనబంధూ! ఆశ్రితకల్పభూరుహా! దేవా! నీమహిమం బగణ్యంబుకదా. అరణ్యంబున దుష్ట మృగంబు లపారంబుగ జన్మించుట. సాధుసంరక్షణార్థంబుగ వానిని సంహరింప జన నిశాకాంత ప్రత్యక్షమగుట. అంత నేను మోహాపరవశుండనై వరించుటతటి బాసలుచేయించుట. సర్వజనస్తవనీయమగు నీ వ్రతం బీమె కనిష్టంబగుట.

నేను ప్రతాపేక్షానూచకంబుగ సుతునైన ఖండింతు ననినమాత్రంబున నట్లే ఖండించుమని యీమె బాధించుట. ఇది యంతయు నీవిలాసంబుకాకున్న నిట్టి విచిత్రం బుండునా? భక్తవత్సలుండవగు నీవే మమ్మిట్టి కఠినపరీక్షలఁ జిక్కించి యలయింపఁ జూచిన మా కింక దిక్కెవ్వరు? నిన్ను సేవించి సులభంబుగఁ గడతేర నెవరు సాహసింతురు?

ఉ. మేలగుసామివంచు, మిడి ♦ మేలపుకొల్వది కాదటంచు, నా
కేల భయం బిఁక న్నిఁటికి ♦ నేలినవారిదె భారమంచుఁ, గా
ఖాలు గుణించినట్టి పసి ♦ కాలమునుండియు నేఁటిదాఁక నిక్
జాలఁగ నమ్మియుంటి భవ ♦ నాశ ! శ్రితావన ! దీనరక్షకా! 37

ఆపద్బాంధవా! నేఁడు న న్నీవిధంబునఁ బరీక్షింపఁ దలఁచితివా? [29]

(తల వంచుకొని నిలుచున్నాఁడు).

మోహి—రాజేంద్రా! వ్యసనముగానుండెనా యేమి?

రుక్మా—(స్వగతము)

శా. ఔరా! యెంతటిద్రోహచిత్తలుసతుల్ ♦ హా! యెంతక్రూరాత్మలో
రారా! యేమనఁజెల్లుఁ గామినుల య ♦ త్యాశ్చర్యచారిత్రముల్
వే తేఁ దెల్పఁగనేల యింక నకటా ♦ వేయింటికైనన్ భువిన్
స్త్రీరూపంబునుఁగల్గు బొమ్మనయినన్ ♦ ఛీ! నమ్మఁగాఁ జెల్లునే?

చ. మగువల నమ్మరాదు; పలు ♦ మాయను జెంతకుఁజేర్చి ప్రేమలఁ
దగులఁగరాదు; నెయ్యము నె ♦ నర్పఁగరాదు; వరించివారి పె
న్వగలకుఁజిక్కరాదు; చిరు ♦ నవ్వులకున్ భ్రమఁజెందరాదు; దా
చఁగనిఁకనేల; చాలు వెయి ♦ జన్మలకైనను స్త్రీలనెయ్యముల్.

సీ. పరకాంతపై యాసఁ ♦ బడుట దీపపుకాంతుఁ
శలభంబు వడిచుట్టు ♦ నలయు రీతి
కులకాంత విడనాడి ♦ వెలకాంతఁ గూడుట
యోడ వీడి జలధి ♦ నుఱుకు రీతి

పడఁతిబోఫలలోనఁ ♦ బడి నటించుట యెల్ల
గారడివాని మ ♦ ర్కటము రీతి
భామ కౌఁగిలిఁ గోరి ♦ బాసఁ జేయుటఁ జూడ
కుంపటి మెడఁ గట్టు ♦ కొన్న రీతి
గీ. వనిత వలచుట యగ్గిలోఁ ♦ బడిన రీతి
కొమ్మ నెయ్యము గుట్టపు ♦ కొమ్ము రీతి
ఎట్టి శత్రున కైన హా ♦ యిట్టి వనిత
వలలఁ దగులుట హరిహరీ! ♦ వద్దు వద్దు. 40

(అని చెంపలు వేసికొనుచున్నాఁడు.)

మోహి—రాజేంద్రా! ఏల విచారించెదవు? పుత్రుని ఖండింతు నంటివే. పోనిమ్ము. అంతఃపురంబునకుఁ బోవుదము రమ్ము.

రుక్మాం—ఏల తొందరనొందెదవు? ఒక్కింత తాళుము. ఎవరురా అక్కడ?

(దౌవారికుఁడు ప్రవేశించి)

దౌవా—దేవా! జయమగుఁగాక. సేవకుఁడు దేవర యాజ్ఞకై వేచియున్నవాఁడు.

రుక్మాం—(వ్యసనముతోఁ బెదవులు తడుపుకొనుచు) మదీయపుత్రుండగు ధర్మాంగదుని బిలిచికొనిరమ్ము.

దౌవా—చిత్తము దేవా. (అని వెళ్ళుచున్నాఁడు.)

రుక్మాం— తరుణీ! ఈవ్రతవిషయం బిట్టు లుండనిమ్ము. మన ప్రసంగవశంబున నా నిత్యకర్మానుష్ఠానసమయంబు వ్యత్యయంబయ్యె. గౌణకాలంబును నతిక్రమించుచున్నది. కావునఁ బుత్రుఁడు వచ్చునంతలో నేను శీఘ్రంబ చని త దనుష్ఠానవిధి నెఱవేర్చుకొని వచ్చెద.

మోహి—అఁ! ఏమీ! నిత్యకర్మానుష్ఠానవిధి నెఱవేర్చుకొనెదవా? అట్టులయిన నేనును నీతోడనే వచ్చెద. నీ వరుగుచుండ నిచట నే నేల?

రుక్మాం—అట్లే రమ్ము. సందియమేమి? (మోహిని యాతని చెఱఁగుఁ బట్టుకొని వెంట నడచుచున్నది.) (ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)



శ్రీ

రుక్మాంగద నాటకము.



షష్ఠాంకము.

రంగము—పుర వీధి.

ప్రవేశము—మాధవుఁడను విద్యార్థి.

మాధ—నా ప్రియమిత్రుఁడు గోపాలుఁ డింకను గానరాఁడయ్యె. కారణం బేమై యుండును? (అటు నిటు చూచి) ఈ కైపునుండి యెవ్వరో వచ్చుచున్నారు! గోపాలునివలెనే యున్నాఁడే!

(గోపాలుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

గోపా—మాధవా! ఇచట నుంటివేమి? హరివాసర వ్రతార్థంబుగఁ బజారు ద్రవ్య సంపాదనకై పోవుదమంటివే!

మాధ—అవును గోపాలా! పోవుదము. నీవు జాగుచేయుటచే నీ కొఱకై వెదకుచు వచ్చితిని.

గోపా—అవునవును. కొంచెము జాగైనది. నాకు మన యుపాధ్యాయులుగారు వ్రాసియిచ్చిన ఆటవిడుపుపద్యమును చదివి పెట్టుకొని వచ్చితిని.

మాధ—ఇప్పుడే చదువవలయునా? నా పద్యమును నేను రాత్రియే చదివితిని. నాకు మిక్కిలి మంచిపద్యమును వ్రాచియిచ్చిరిసుమా.

గోపా—అంతకంటె మంచిపద్యమును నాకు వ్రాసియిచ్చిరి.

మాధ—నీకు దేనినిగురించి వ్రాసియిచ్చిరి?

గోపా—పేదవిద్యార్థినిగూర్చి.

మాధ—అట్టి విద్యార్థి విద్యాగ్రహణకాంక్షచే నన్యదేశంబుల కేగ నుద్యమించు తఱి వానినిక్కఁ గల్గు పాట్లంకములంగూర్చి వాడు వ్రాసియిచ్చిరి.

గోపా—అట్టులయిన నీ రెండు పద్యములకు నన్యోన్య సంబంధము కలదే! ఏదీ నీ పద్యమును చదువుము.

మాధ—నీ పద్యమునే ముందు చదువుము.

గోపా—అలాగే చదివెదను.

సీ. ఇల్లు వాకిలిఁ బాసి ♦ యిష్టబంధుల రోసి
పోరుగూరు విద్యకై ♦ పోయి పోయి
శ్రద్ధతోఁ బాఠముల్ ♦ చదువలేదని కొట్టు
చదువర్లయ్యకుఁ గేలు ♦ చాఁచి చాఁచి
కూడుగుడ్డలు లేక ♦ కొంప కొంపకుఁ బోయి
యయ్యలమ్మల బిచ్చ ♦ మడిగి యడిగి
రేపువచ్చుఁ బరీక్ష ♦ మాపు వచ్చునటంచు
నూరక యుష్విళ్లు ♦ లూరియూరి

గీ. పాఠములనెల్లఁ బాటలు ♦ పాడి పాడి
కడకు జయవార్త వినఁగను ♦ గాచి కాచి
సఫలతనుజెంది యావార్త ♦ చాటి చాటి
పూజ్యతను బొందు బాలుని ♦ బుద్ధి బుద్ధి

మాధవా! నాపద్యమును వింటివికదా. నీపద్యమును జదువుము.

మాధ—గోపాలా! ఇట్టివిద్యార్థి నూతనవిద్యాగ్రహణేచ్ఛచేఁ దనకుఁ బ్రేమాస్పదు లగు బంధుమిత్రాదుల నెడఁబాయుచున్నాఁడు. ఇది యెంత దుష్కరము!

సీ. నా ముద్దు బిడ్డఁడా? ♦ నా మేలిమి బంగార!
యనుచు ముద్దిడు తల్లి ♦ నట్టె విడిచి

యాడుకొందము రార ♦ యన్నన్న! యని పిల్చి
బుడుతలకెల్ల దో ♦ బూచి పెట్టి
యెడఁబాయఁజాలక ♦ తడఁబడు హితకోటి
కిదుగో వచ్చెద నంచు ♦ నెల్లొ చెప్పి
మహితవిద్యగడించు ♦ మాయని దీపించు
ప్రాత గురున కొక్క ♦ ప్రణతిఁ జేసి

గీ. చదువు సాధించు కోరిక ♦ సందడింపఁ
బురము వెలువడు ధృతిఁదూలి ♦ బుద్ధిశాలి
యకట! విద్యల కిటు లెన్ని ♦ యుల్లొ తగులుఁ
గాన వీరికిఁ దోడ్పడు ♦ ఘనులె ఘనులు.

గోపా—మన పురమందలి పేదవిద్యార్థుల కెట్టిలోపంబులును గలుగక యుండు నట్లు మన ప్రభువువారు సమస్త సౌకర్యముల నమర్చియుండిరి కదా.

(శంకరుఁడను మఱియొక విద్యార్థి ప్రవేశించి)

శంక—హా! రాకొమరున కెట్టి యిక్కట్టు రానున్నదో కదా. (అని యిటుచూచి) మాధవా! గోపాలా! మీ రిచట నేమిచేయుచుంటిరి?

మాధ—శంకరా! నేఁ డేకాదశి యని నీవు నెఱుఁగుదువు కదా. తద్వ్రతార్థము పూజాద్రవ్యసంపాదనకై పోవుచుంటిమి.

శంక—పూజాద్రవ్యములా? అక్కటా! పూజావిషయమే సందేహాస్పదమగుచున్నది. రాకొమరున కేమగునో. (అని భయము నభినయించుచున్నాఁడు.)

గోపా—మిత్రమా! అట్లనెద వేమి?

శంక—మిత్రులారా! సుకుమారుండగు రాకొమరుండు నేఁడు సెలవుదిన మగుటచే నాబోఁటి తోటివిద్యార్థులఁ గూడి యొక్కదివ్యభవనంబున ప్రహ్లాదుని చరితం బానందంబుగ నాలకించుచుండ నొక్క రాజభటుం డరుదెంచి సత్వరంబున నక్కుమారుని రాజసమ్ముఖంబునకుం గొంపోయె. దీనికిఁ గత మేమైయుండునో.

మాధ—అఁ, యేమైయుండును. ప్రభువులు నూతనప్రియులు కదా. ఏదేని నూతన

వస్తుసందర్శనార్థమై పిలిపించియుందురు.

శంక—కాదు కాదు. రాజేంద్రుఁడును, మోహినీదేవియు నేఁటి వ్రతముంగూర్చి వాదులాడుచుండిరనియు, విని, పరితపించుచుంటిని.

గోపా—అయిన నేమి? ఆయన తండ్రికాఁడా! ఆమె తల్లికాదా? తలిదండ్రుల చెంతకుఁ బుత్రుఁడేగుటయందుఁ బరితాపకారణం బేమికలదు?

శంక—కలదు. కలదు. రాజేంద్రునకును మోహినీదేవికిని ఒండొరులయెడఁ గల మెండు తమకంబెల్ల విరసంబై యిప్పుడు ప్రణయకలహంబుగాఁ బరిణమించె ననియు వింటిని.

మాధ—దానికేమిలెమ్ము. ఆలుమగల సందు జగడము అద్దమునీడ, బెసరగింజ నిలుచు నంత పేపు అని పారిజాతాపహరణగ్రంథమందు మున్నుఁ జదివియుండ లేదా? అంతమాత్రముచే రాకొమరునకుఁ గల్గు భయమేమి?

శంక—ఏమా? ఇట్టి ప్రణయకలహసమయంబునఁ బుత్రుఁడేటికి? తగువుఁదీర్పనా?

గోపా—తగవుఁ దీర్చుటకుఁ గాకపోయినను, ఎట్టి సమయమందైన పుత్రసందర్శనంబు సంతోషదాయకంబే కదా.

శంక—ఇ దెట్టిమాట? ఎట్టిసుఖంబైన దేశకాలానుగుణ్యంబై యుండు. ఇదిగాక ముకుళితముఖుండైన యా రాజభటుని ముఖవైఖరిం జూచినప్పటినుండియు నేను వేఱుగ శంకించుచున్నవాఁడ.

మాధ—ఏమని?

శంక—ఈ బాలుండా కలహఫలం బనుభవింపవలసినవాఁ డగునేమో యని.

గోపా—అఁ! అఁ! అలాగా? అట్లులయిన మన కీ ముసుఁగులో గుద్దులాట యేల? అట్లుపోయి మఱికొంచెము విచారింతము రండు.

మాధ—అవునవును. పోవుదము రండు. (అందఱును నిష్క్రమించుచున్నారు.)

ఇది విష్కంభము.



రంగము—మోహినీదేవి యంతఃపురాంగణ ప్రదేశము.

ప్రవేశము——మోహినీ రుక్మాంగదులు.

మోహి—రాజేంద్రా! పుత్రుని బిలిపించుచుంటివే. ఏఁడీ? అబద్ధమేనా?

రుక్మా—అబద్ధ మేటికగును? పుత్రుం డీపాటికి వచ్చుచునేయుండును.

ప్రవేశము—దౌవారికుఁడు, ధర్మాంగదుఁడు.

దౌవా—దేవా! జయమగుఁగాక. అబ్బాయిగారు దయచేసినారండి. తోటిబాలుర తోడఁగూడి ప్రహ్లాదుని చరిత్రంబును వినుచుండఁగాఁ బిలిచికొని వచ్చితిని. ఎందుకుఁబిలిచితిరో కదా యని పరుగెత్తుకొని వచ్చినారండి. (అని తనలో) వీ రుభయులును వివాదపడుట యింతదనుక నేను వినుచునేయుంటిని. ఆవులు పోరాడి లేఁగలకాళ్ళు విఱుఁగఁద్రొక్కినట్లు వీ రీ ముద్దుబాలు నేమిచేయు దురో కదా. (అని యనుకొనుచు వెళ్ళుచున్నాఁడు.)

ధర్మా—(సమీపించి) జనకా? నమస్కారము.

రుక్మా—(చూచి వ్యసనముతోఁ బలుకక తలవంచుకొని నిలుచుచున్నాఁడు.)

ధర్మా—(ఆశ్చర్యముతో) జనకా! నేఁ డేల ఖిన్నవదనుండవై యున్నవాఁడవు?

గీ. నన్నుఁ జూచినతోనె యా ♦ నంద మంది
బిడ్డ! వచ్చితివా? యని ♦ ప్రేమ మీఱ
నట్టె కరములనెత్తి ము ♦ ద్దాడు నీవు
వెతల మున్గినరీతి నుం ♦ డితి విదేల?. 3

నేను నమస్కరించినను ఆశీర్వదింపనొల్లక చింతాక్రాంత మానసుండవై కన్పట్టుచున్నవాఁడవు. ఎట్టి యిక్కట్టులు కల్గినను గుట్టుచెడక దిట్టతనంబును బూని యుండు నీ కిట్టి విచారం బెట్టుకల్గె? జనకా! సత్వరంబున తెలింగింపుము. నీ విట్టు లుండుటచేత నా గుండెలు కొట్టుకొనుచున్నవి.

రుక్మా—పుత్రకా! ఈ తరుణి బ్రహ్మమానసపుత్రి! పేరు మోహిని యండ్రు. నే నరణ్యంబునకు వేఁటకుం జనినతఱి నీ యువతిం గాంచి, మోహించి, ఎన్నఁడుఁ దను నెడఁబాయక తన యాజ్ఞానువర్తినై యుండునని బాసఁజేయుమన నట్లొనర్చి

గాంధర్వవిధిం బరిణయమై కొనివచ్చితి. నేఁటిదినం బేకాదశియగుటం జేసి నేను వ్రతాచరణంబునకుఁ జనుచుండ నీ తరుణి యరుదెంచి వ్రతంబు విడువుమనియు నంతఃపురంబునకు రమ్మనియుఁ బరిపరివిధంబుల బాధింప నేమియుఁదోఁచక నేను

గీ. మీాఱి నీ విటు లాడంగ ♦ మేర కాదు
పడఁతి! నా రాజ్యమైన న ♦ ర్పణ మొనర్తుఁ
గన్న సుతునైన ఖండింతుఁ ♦ గాని వ్రతముఁ
బాయఁజాల నటంచును ♦ బల్కినాఁడ.

అంతట నిక్కాంత "అట్లేసుతుని ఖండింపుము. లేకున్న వ్రతంబు విడిచి రమ్ము. ఈ రెంటిలో నేదైనం గానిమ్ము" అంచు మూర్ఖత్వమునఁ బలుకఁజొచ్చినది. కావున నిందుకు నా కేమియుం దోఁచక—.

ధర్మా—జనకా! తెలిసినది. తెలిసినది. దీని కింక సందియంబేల? ఈ కాంతామణి యభిమతంబు చొప్పున నన్ను ఖండించి నీ వ్రతం బీడేర్చుకొమ్ము. వ్రతంబునకన్న ప్రాణం బెక్కుడగునా? శ్లో. జాతస్య మరణం ధృవం అనునట్లు కాలుఁడెప్పుడో యే వేళనో యే నిమిషంబుననో యే విధంబుననో మ్రింగఁ గాచియున్నవాఁడు.

ఉ. ఎట్టినరుండుఁగాని, పృథి ♦ వీశ్వరనందనుఁడైనఁగాని, యిం
కెట్టిఘనుండుఁగాని, జగ ♦ దేకమహాబలశాలిగాని, తాఁ
బుట్టుటకల్గుతోనె మృతిఁ ♦ బొందుటయుణ్ సతమాయెఁగాని,యే
పట్టుననైన దాని నెడఁ ♦ బాయఁగఁ జాలునె మానవేశ్వరా?. 5

చిరకాలము జీవించి, కడకు వార్ధకదశయందు బలశౌర్యంబు లుడిగి, దేహంబెల్లఁగృశించి, శీతశ్లేష్మవాతపైత్యాది వ్యాధులచేతఁ బీడితుండై యొక్కుమ్మడి మంచంబునం బడి, మలమూత్రాదులలోఁ గొట్టుకొనుచు సోదరదార పుత్రాది బంధుజనులెల్లరచే రోయఁబడి, యొక్కసారి యా పరాత్పరుని దివ్యమంగళస్వరూపంబుఁ దన మనస్సున నిల్పి ధ్యానింపవలెనన్నఁ జిత్తచాపల్యంబుఁ గల్గి, తుదకు నశించి, అప్పుడు ఈ శరీరంబును వృథాగా మట్టిపాలుఁ గావించుటకన్న నిట్టి సమయంబున శ్రీవిష్ణుప్రీతికరంబగు నీ హరివాసర వ్రత నిర్వహణార్థము బలిఁగా నొసంగిన మేలు కాదా? కావున జనకా! నీవు సంశ

యింపక నా శరీరంబును బలియిచ్చి నీ వ్రతంబు నెఱవేర్చుకొమ్మా. నీ కీఁడున కావంతయైన వంత నొందఁ దగదు. శీఘ్రం బట్లు కానిమ్మా.

ధర్మా—పుత్రా! ఏమిరా నీ వాక్యంబులు! మరణంబున్న నొక్కింతయు వెఱవక పెక్కు నీతులు బోధించుచు నాకిదుకు ధైర్యంబుఁ జెప్పుచున్న వాఁడవు. బిడ్డా! శ్లో. అనిత్యానిశరీరాణి యనియు, శ్లో. జాతస్య మరణం ధ్రువమ్మనియు శ్లో. ఋణానుబంధరూపేణ పశుపత్నీసుతాలయాః అనియు లెక్కకుమిక్కిలి యగు పెక్కునీతులు లోకులకు బోధింపవచ్చును గాని శ్లో. స్వస్వానుష్ఠాన వేళాయాం మునయోపిన పండితాః అనునట్లు శాస్త్రప్రకార మవలంబింపవలసి వచ్చునప్పుడు మునీంద్రులు లోనగువారుకూడ వ్యర్థులయి పోయిరని పెద్దలు మిక్కిలిగాఁ జాటి చెప్పుచున్నవారు. ఇట్లుండ నీ విన్నినీతు లెట్లు నేర్చితివి? నేర్చిన నేమాయె? నాపున కదురేఁగఁ జూచుచుంటివి. నీ మనం బెట్టు లున్నను నేను

క. ఒక్కఁడ వంచును బుత్రక!
యక్కునఁ జేర్చుకొని పెంచి ♦ యానందము పెం
పెక్కఁగఁ బొంగితి; నేఁ డిటు
లక్కట నినుఁ ద్రుంప కరము ♦ లాడునె చెప్పుమా? 6

మోహి—అవును రాజేంద్రా! పుత్రుని కరములార నేల ఖండించెదవు? వ్రతంబు విడువుము. సుతుని బ్రదుకనిమ్మా. మన మంతఃపురంబునకుఁ బోవుదము గమ్మా.

ధర్మా—జననీ! తాళుము. తాళుము. నీ యభీష్టం బిప్పుడే నెఱవేఱఁగలదు. జనకా! నామరణంబునకై నీకింత వంతయేల? ఈతనువులు శాశ్వత బ్రహ్మకల్పంబులని నమ్మియుంటివే? తొంటి పెద్దలు

క. నవరంధ్రంబుల తిత్తియు
భువిఁ గ్రిమి కీటక పురీష ♦ మూత్రంబులలోఁ
దవులుచు క్షణభంగురమై
యవిమలమైనదియు ననుచు ♦ నాడరె తనువున్? 7

ఇంతియకాని దీనియం దొక్కింతయైనఁ గాంక్ష వహించియుండిరే? సమయమా

ప్రారబ్ధవశంబున సంభవించిన యీ శరీరంబు నింతకంటె సార్థకం బగున ట్లెట్లు చేయఁగలను? కావున జనకా! నీ వింక సందియంబు విడిచి, పుత్త్రుండను భ్రాంతి దిగనాడి, న న్నీ క్షణంబున ఖండించి నీ వ్రతంబు నెఱవేర్చుకొమ్ము. ఈపాటి కార్యంబునకై వ్రతంబు విడువనేల?

రుక్మా—మంచిది పుత్త్రా! అట్లే యొనర్తును. (అని ఖడ్గము చేతఁబూని యాతని ఖండింపఁబోవుచున్నాఁడు.)

(దౌవారికుఁడు తెరలోపల బిగ్గరగా)

దౌవా—అమ్మగారూ! మన ధర్మాంగదమహారాజుగారిని అయ్యగారు కత్తితో నఱుకఁబోవుచున్నారండి.

సంధ్యా—ఎందుకొఱకురా!

రుక్మా—(ఆలకించి) ఎవరో పట్టపు దేవితోఁ దెల్పుచున్నారు. (అని యింక నాలకించుచున్నాఁడు.) (మరల తెరలోపల)

దౌవా—మోహిని అమ్మగారున్ను అయ్యగారున్ను జగడమాడుకొనుచున్నారండి. ఆమె వ్రతము విడువుమనుచున్నది. ఈయన విడువననుచున్నారు. కుమారుని నామె చంపుమనుచున్నది. ఈయన చంపఁబోవుచున్నారండి. తమరు దయచేసి బిడ్డను బ్రతికించుకొనండి.

సంధ్యా—హా! దైవమా! ఎంతటి విపత్తు వాటిల్లఁజేసితివి! (అని యేడ్చుచుఁ బ్రవేశించి విభుని పాదములపైఁ బడి) నాథా! నాథా! శివశివా? పరమేశ్వరా! అక్కటా, నాథా! ముక్కుపచ్చ లారని ముద్దుబిడ్డను బట్టి కరవాలంబున ఖండింపబూనితివి. జనకుం డెట్టి కఠినుఁడైనను కన్నబిడ్డను కరములార ఖండింప నుంకించునే. అక్కటకటా! విధి కట్టడి నేమనవచ్చు? ఇంక నే నేమి చేయుదుః శివశివా పరమేశ్వరా!

ఉ. కానల కేగనేల? పర ♦ కాంతను గాంచి భ్రమింపనేల? యా
చానకుఁ జిక్కనేల? విర ♦ సంపు ప్రతిజ్ఞలు పల్కనేల? నా
ప్రాణపదంపుఁ బుత్త్రుని శి ♦ రంబును ద్రుంపనె వ్రాలు; నక్కటా
యేనిఁక నెందుఁజొత్తు? భువి ♦ నెట్టులు జీవము దాల్తు నీశ్వరా?. 11

తటస్థించినప్పుడెల్ల బుద్ధిపూర్వకముగ దీనిఁ ద్యజించుటకై సిద్ధపడి యుండలేదే! శిబిచక్రవర్తి తన శరీరమునుండి పావురంబునకు సరితూగునంతటి మాంసంబును గోసియిచ్చె. కర్ణుండు తనశరీరమునకుఁ జర్మముగా నేర్పడియున్న యినుపకవచంబును దానమొసంగె. త్రిలోకకంటకుఁడగు వృత్రాసురసంహారణార్థంబుగ వజ్రాయుధంబు నిర్మించుటకై దేవేంద్రుఁడు ప్రచ్ఛన్నవేషంబునఁ బ్రార్థింప దధీచిమహాముని తన వెన్నెముక నొసంగియుండె. వీర లింతటి సాహసంబు నేల వహించిరి?

శుక్రా—నీ వాక్యంబు లన్నియు నిక్కంబులే. కాని యొక్క సుఖజీవిం బట్టుకొని యకారణంబుగ ఖండింపఁబూనుట యెంతయుఁ బరితాపకరంబుకదా. ఇట్టి కార్యం బే నెట్టులు చేయనోపుదును.

ధర్మా—అయిన జనకా! వార లెల్లరును సుఖముగాఁ బ్రతుకజాలకయా యిట్లొసంగిరి? వారికీర్తి యీ లోకంబున శాశ్వతంబై ప్రకాశించుచుండలేదా? నీ మనంబున యోచించి చూడుము.

చ. మలినము, రోగపూరితము, ♦ మాటి కనిత్య మరోచకంబు, దు
ర్మల క్రిమిమూత్రశుక్లరుధి ♦ ర ప్రథితమ్మగు మేనిఁ బాయుటల్
సలలితమై త్రిలోకముల ♦ శాశ్వతసౌఖ్య మొసంగఁజాలు ని
ర్మలమగు కీర్తిఁగాంచుటది ♦ మానవనాథ! ఘనంబు కాదొకో? 8

ఇదియునుగాక

గీ. శ్రీకరంబిది యేకాద ♦ శీవ్రతంబు
పేర్మి శ్రీరమా విభునకుఁ ♦ బ్రియతరంబు
ధర సుధర్మములకు నెల్ల ♦ దాపురంబు
భక్తవినుతంబు భవపాశ ♦ భంజనంబు. 9

క. వినుమా యీ సుదినంబున
ననుపుగ నీ చేయు సద్వ్ర ♦ తార్థంబుగ నా
తనువు నొసంగిన స్వర్గం
బనఁగా నే దాఁచుకొనిన ♦ యర్థము కాదే? 10

హా! పుత్రకా! నీ కిట్టి దురవస్థ సంభవించునని కలనైనఁ దలఁపనైతిఁగదరా. తండ్రీ! నీవు చిరకాలజీవివై వర్ధిల్లి యీ రాజ్యంబునకెల్లఁ బ్రభుఁడవై మాకు ముందు గతులు కల్పింపఁగల కర్తవగుదువంచు నెంచియుంటిఁ గాని నేఁ డిట్టి నీ తరుణీమణి కారణంబున నకాలమృత్యువునోటఁ జిక్కి మా కన్నులఁ గప్పి పోదువం చెఱుఁగనైతిఁగదరా! నీ విప్పు డీ జనకుని వ్రేటున ఖండితుండవై నీ మేనెల్ల రక్తధారల మునుంగ నేను గన్నులఁ గాంచి యెట్లు మనియుండ నేర్తు? పుత్రకా శివశివా! పరమేశ్వరా!

ఉ. అక్కట దైవమా! వరద ♦ యానిధి! యార్తశరణ్య! రక్షకా!
యి క్కమనీయగాత్రుని న ♦ హీనచరిత్రుని బుత్రుఁ జేయఁ బెన్
రక్కసిఁబోలు పాతకి య ♦ నందగు నాదగు గర్భసీమ నీ
కెక్కడఁ జిక్కె? నింకఁ దెరు ♦ వెయ్యది? యేనెటు వోదు నీశ్వరా!

(అని దుఃఖమును గొంచె మడఁచుకొని) నాథా! నీ విప్పు డేమియు నెఱుఁగని యీ పసిబాలుని ఖండింపనేల? వీనిపై నెట్లయినఁ గరుణించి విడిచి వీనికి బదులు నన్ను ఖండించి నీ వ్రతం బీడేర్చుకొమ్ము.

(అనఁగానే కుమారుఁడు తల్లిని కరంబులఁ బట్టి లేవనెత్తి)

ధర్మా—తల్లీ! తల్లీ! నీ కేటికమ్మా యీ ఖేదంబు? ఏ నెఱిఁగింతు నొక్కింత తాలిమి వహింపుము.

సంధ్యా—నాయనా! ఇది యంతయుఁ జూడ నాకు దుఃఖంబుగాక సంతోషం బెట్లు కలుగనేర్చు? (అని మోహినివంకఁ దిరిగి) అక్కా! మోహినీ!

చ. హృదయ మదెంత దిట్టయిన, ♦ నీసుఁడు నెంతగఁ గారవించినన్
ముదితరో! చెంతఁ జేరిచి ప్ర ♦ మోదము నించిన, లోకనింద కా
స్పదమగులీల నిట్టి విర ♦ సంబగు కోరికఁ గోరఁజెల్లునే?
పొదుఁగునఁ బాలుగోరుచును ♦ బొంగుచుఁ గోయుదురమ్మ కోమలీ?

నాబిడ్డయైన నొకటి నీ బిడ్డయైన మఱొకటి యగునా? బిడ్డలుకలవార లందఱు బిడ్డలఁ దమ బిడ్డలవలెనే చూచుకొందురు కాదఁటమ్మా? అక్కా! ఇఁక

మైన నీ పసిబిడ్డను మన్నించి కాపాడుమమ్మా. నీకుఁ బుణ్యంబగునమ్మా.

మోహి—చాలుఁజాలు! అక్కలక్కయంచుఁ దగుదువని తలఁ ద్రిప్పుకొనుచుఁ జెప్పవచ్చితివిగదా! ఈ నీతులు నీవే నేర్చితివి కాఁబోలు! బిడ్డలు లేనిదాననంచు నన్నేమో చెప్పవచ్చెదవు. నీ వాక్యంబు లన్నియు బిడ్డలుకలవారి పల్కుడి వేకద?

గీ. ఒరుల బిడ్డలఁ గానల ♦ నొంటి పాటు
నందుఁ గాంచి, వరించి, కా ♦ ర్యంబుఁ గడపి,
నాఁటి మాట ల వెల్లను ♦ నీటఁ గల్పి,
యోటుఁ బుచ్చఁగ నీమది ♦ యోర్చె నొక్కొ? 14

పాదుఁగుఁ గోసికొనియఁట! పాలు ద్రావుదురఁట! ఇట్టి చేయి దుష్కృతంబు లైన నొనర్ప నీ నాథుండే సమర్థుఁడు కాని నేను గాను. వ్రతంబు విడువుమని యెంత చెప్పినను వినక నాథుండే పుత్రు నిట్టులు చంప సంకించి యున్నవాఁడు. యౌవనధనరాజ్యమదాంధులగు వార లిట్టి క్రూర కృత్యంబుల నెన్నిటినైనఁ జేయ సమర్థులయియే యుందురు.

సంధ్యా—అక్కా! ప్రాణేశు నేల దూఱెదవమ్మా?

ఉ. అక్కరొ! యాగ్రహింపకు; ద ♦ యామతి నా పలు కాలకించు;
నే ద్రొక్కెదనమ్మ; బిడ్డయుసు ♦ రుల్ గొనకమ్మ; విభుండు ప్రే
మలం జిక్కెనటంచు నారసి మ ♦ నీషులసమ్మతిఁ జేయు సద్వ్రతం
బొక్క దినంపు భోగమున ♦ కూడ్పఁగ జూతురఁటమ్మ నెచ్చెలీ? 15

ఎట్టివ్రతంబయినఁ దన యిష్టముచొప్పున మాటిమాటికి మానుటయు మరల మరల నొనర్చుటయు నుండునా? కావున రాజేంద్రుని వ్రతంబు మాన్పింప మనకు సాధ్యంబగునా? మానకున్న నేమాయె? పుత్రుని జంపింపవలయునా? పుత్రుని జంపిన నేమగును? నీ కోర్కె తీరునా? వృథా గాఁ బుత్రు నేల చంపించెదవమ్మా? నేఁటికిమాత్ర మూరకుండి పిమ్మట నీ యిచ్చవచ్చినట్లు విభుంగూడి కేళీవిలాసంబులం దేలుచు నానందాబ్ధి నోలలాడుమమ్మా.

మోహి—అబ్బో! అలసిపోయితివి. నీ దీర్ఘోపన్యాసంబు లింకఁ గట్టిపెట్టుము.

క. ఆతండు వ్రతము విడఁడఁట;
యీతల్లికి సుతునిచావ ♦ నిష్టంబఁట; నే
నేతల్లిఁ గొల్తు? నీయుమ
చేతులు జాడించుకొనుచుఁ ♦ జెప్పెను నకటా!

వ్రతము విడఁపరాదట; సుతునిఁ జంపవలదఁట; మాబోటి సతులతో దొంగ బాసలుచేసి, కొనివచ్చి, వారి కన్నెతికం జెల్లఁ గొల్లలాడి తుదకు వ్యర్థులం జేయఁ జూతురఁట. తగుదునంచుఁ జేలఁ ద్రిప్పుకొనుచుఁ జెప్పవచ్చెదవు. మొగ మునకు సిగ్గయినం దోఁపదే?

సంధ్యా—(ముక్కున వ్రేలు పెట్టుకొని) ఔరా! ఔరా! ఎంత యాశ్చర్యము.
మోహి—విభుఁ డరణ్యంబున బాసలుచేయునప్పుడు నీవైన నడ్డుపడకపోయితివా? "వ్రతంబు విడఁ దమనఁదగునా" యని యిప్పుడు నాకు ధర్మోపదేశంబులు చేయ నరుదెంచితివి.

శా. దుర్మార్గంబని లేక, యన్యయువతిన్ ♦ దుర్బోధచేఁ గామ్యదు
ష్కర్మంబందుమనఁజొన్పి, తుట్టతుద కా ♦ శాభంగముం జేయుటల్
ధర్మంబంచును దోఁచెనేమొ యిఁకనే ♦ లాతర్కముల్; పృథ్వినీ
ధర్మాధర్మవిచారణాంచణత యే ♦ తన్మాత్రులం దుందునే?. 17

ఔరా! ఇట్టి యసత్యవ్రతుండగు రాజుచేతను, అధర్మబోధినియగు నీ రాణి చేతను పాలితంబగు నీరాజ్యమందలి ప్రజ లెట్టిసౌఖ్య మనుభవించుచుండిరో కదా. ఇంతయేల? నీకు సుతునిపై నంతటి ప్రేమయే యున్నయెడ, సుతుఁడు జీవింప వలయుననియే నీ యాప్సితం బగునెడ "వ్రతంబువిడిచి నా యిష్టము చొప్పున వర్తింపు" మని విభునకు బోధింపుము.

సంవాద ద్విపద.

సం—అక్కటా నాథ! యీ ♦ యన్యాయ మేమి?
యి క్కమలాక్షి నీ ♦ కేల ప్రాప్తించె!
రు—నాప్రాకృత ఫలంబొ ♦ నా పుణ్యబలమొ
యీ పడంతుక యాచు ♦ నిట్లు లభించె

ధ—జనక! యీ గతి నీకు ♦ సంతాపమేల?
తనయుడ నే నీదు ♦ దరిని వసింప.

మో—నీ యింతియును నీవు ♦ నేఁడేల వగప
హాయిగా శయ్యాగ్ర ♦ హముఁజేర రమ్ము.

సం—తగుఁ దగు వ్రతము వ్య ♦ ర్థము చేయు మనెదె?
మగువరో! యిటులాడ ♦ మరియాద యౌనె?

రు—ఇది నేఁటి ధర్మమో ♦ యిది యేటి కృతియొ
మొదటినుండి వ్రతము ♦ ముంపఁ జూచెదను.

ధ—సూర్యచంద్రాదులు ♦ సుడిఁగొన్నఁగాని
ధైర్యంబు చెడకు వ్ర ♦ తంబును విడకు.

మో—వ్రతమునకై సుతుఁ ♦ బరిమార్తు నంటి
ప్రతిమాటలేల యీ ♦ ప్రతిన యే జరుపు.

సం—కటకటా యిది యేమి ♦ కఠినాత్మురాల
కుటిలతాపేటి! దు ♦ ర్గుణజాలవాటి!
క్రూరత సుతుఁగొంతు ♦ కోయుమటంచు
నీరీతిఁబల్కనో ♦ రెట్లాడె నీకు?

మో—నీ ప్రాణనాథుండు ♦ నీ బంధుజనులు
నీ ప్రియ పుత్రుండు ♦ నీకుండవలయు,
"చిన్ని నాపొట్టకు ♦ శ్రీరామరక్ష
సన్ను తాంగిరో నీవు ♦ సాగిపో" మ్మనెదె? 18

సంధ్యా—(కొంతవిస్మయమును జూపి) ఆహా! ఈతరుణి కేవలమనుష్యమాత్రురాలై కానిపించుటలేదు! ఇట్టి ప్రసంగంబులు మన రాజగృహంబులయం దెన్నఁడైన వినియుంటిమా!

సు. చాన పల్కు నద్దియెల్ల ♦ సద్వ్రతంబు మాన్పనే
కాని యొండు కానరాదు ♦ కాంచ నేమి చిత్రమో

మానవాఘనాథ! దేవ ♦ మానిచోదనంబునఁ
బూనినేమొకాని యిట్టి ♦ బుద్ధు లెందుఁ గల్గునే? 19

ఇట్టి కఠినహృదయం బెచ్చటనైనఁ గంటిమా?

మోహి— నీకంటెఁ గఠిను లెవ్వరును లేరు. అధికప్రసంగంబులు చాలించుము.

క. ఇట్టు లధర్మపథంబుల
నెట్టయినం దెల్పుమంచు ♦ నెవ్వరు నిన్నుం
బొట్టనుఁ గాటుక వెట్టుచు
దిట్టా! రమ్మంచుఁ బిలిచి ♦ తెచ్చిరి చెపుమా? 20

సంధ్యా—(విచారముతో గుండెకొట్టుకొనుచు) పరమేశ్వరా! యింకేమిచేయుదు?

ధర్మా—[29] తల్లీ, ఏటికమ్మా నీకీ ఖేదంబు? నీమనంబున వ్రతంబునకన్న నా ప్రాణంబెక్కుడుగఁదోఁచుచుండెనా? ఏనొక్క రహస్యం బెఱింగింతు వినుము.

సీ. ప్రారబ్ధ మనునది ♦ పరికింప స్వకృతమె
కాని యన్యులు చేయఁ ♦ గలదికాదు
దాని నవలఁద్రోయఁ ♦ దల్లడిల్లుటకాని
పచ్చికుండా? కాదు ♦ పగులఁ గొట్ట
బహుజన్మసంచిత ♦ ఫలమయి వెన్నంటి
తగులు సాలెపురువు ♦ తంతు భంగి
హరిహరబ్రహ్మాదు ♦ లైన దానినిఁ బాయ
నేర్చిరే? మనమిఁక ♦ నేర్చుటకును
గీ. తెలియవే? పంచముఖుఁడట్టి ♦ నలువ యయ్యె;
కనవె? శంకరుఁడే నీల ♦ కంఠుఁ డయ్యె;
వెన్నుఁడే కాఁడె? యలనాఁడు ♦ తన్ను వడియె;
ఔర! ప్రారబ్ధమహిమ యే ♦ మనఁగవచ్చు. 21

ఇదిగాక, తల్లీ! మఱియొకటి వినుము. జీవుఁడు బహుజన్మసంచిత ప్రారబ్ధ

కర్మ వశంబున శరీరధారినై, మాతృగర్భంబు సొచ్చి, యచ్చట నవమాసంబులు పెరిఁగి, తత్కాలంబున నచ్చటి క్రిమి కీటక మూత్ర పురీషంబులలోఁ బగులు కొని పెక్కుడుమలంబడి గర్భనరకం బెల్ల ననుభవించి పిమ్మట జననంబగును! తదాదిగ బాల్య యౌవన కౌమారాద్యవస్థలం దగిలి బాల్యంబెల్ల నాటపాటల యందును, యౌవనంబెల్ల నహంకారబద్ధుండై పువ్వుఁబోఁడులకౌఁగిండ్లయందును, వార్ధకంబెల్ల దారసుతాదుల ప్రేమలం దగిలి వారి యుదరపోషణార్థమై ధనార్జనము చేయుటయందును గడపుచు నిట్లు జనన మరణ తాపత్రయ ప్రవాహ రూపంబైన సంసారంబునందుఁ దగులుకొని కడు నిడుమలంబడి నశించుచు, మరలమరలఁ బుట్టుచుఁ గిట్టుచు నిట్లు జన్మపరంపరలం బడి కొట్టుకొనుచుండు. ఈప్రకారంబుగ నేను బ్రహ్మసృష్టి మొదలు నేఁటివఱకెన్ని జన్మంబు లెత్తితినో, యెందఱికిఁ బుత్రుండనైతినో, యెందఱకు భ్రాత్రుండనైతినో, మఱియెందఱకు జనకుండనైతినో యెఱుంగఁగలమే?

సంధ్యా—సత్యమే బిడ్డా నీ వాక్యంబు లన్నియు నిక్కంబులే.

ధర్మా—ఇప్పటి కీరీతి ఋణానుబంధకారణంబునఁ బుత్రరూపంబున నీ గర్భంబున జన్మించి నీ చెంగట మెలంగుచున్నవాఁడ. ఋణంబు తీరినతోడనే యీ శరీరంబు నిచ్చట దిగనాడి మఱి యెచ్చటికో పోవనున్నవాఁడ. కాని మనకుఁ గల యీ మాతాపుత్రసంబంధం బెంతమాత్రమును శాశ్వతంబని యెంచకుము. మఱియును

శా. మాతా! నాటకమందుఁ బాత్రలబలెన్ మాయాప్రపంచంబునన్
మాతాపుత్రహితాదివేషులగు నీ ♦ నానాస్వరూపాలతో
నీ తాత్కాలికబంధముల్ సతమటం ♦ చెంతే భ్రమం బెందుచున్
జేతో మోదముఁగాంచి బాయుటకునై ♦ భీగుందఁగాఁ జెల్లునే? 22

ఉ. పొందుగ నాది నాది యని ♦ పుట్టినదాదిగఁ బాలు మీఁగడల్
విందులు భూషణంబులును ♦ వేడ్క నొసంగుచుఁ బెంచు దేహమే
యొందును వాసిపోవు; నిఁక ♦ నేటికి దుర్భ్రమ? యిట్టి దేహసం
బంధులు కూడవత్తురె ప్ర ♦ మంపడి యెంతగఁ బాలఁబెంచినన్?

కాఁబట్టి జననీ! ఇంకనైన నీవు నా వాక్యంబులందలి సారంబు గ్రహించి నేను నీ పుత్రుండ నను భ్రాంతి వదలి, ప్రేమానుబంధంబులనెల్లఁ దెగఁగోసి, యీమె యిష్టముచొప్పున నన్ను ఖండించి వ్రతంబు నెఱవేర్చుకొనునట్లు నా జనకుని నీవును బురికొల్పుము. దీనిచే నేను బవిత్రుండనై, శ్రీవిష్ణు పదకమల సమీపవర్తి నగుట కత్యంతార్హుండ నగుదు.

సంధ్యా—అహో బిడ్డా! యేమిరా నీ యమృతతుల్యవాక్యంబులు! ఇట్టివాక్యంబులఁ నే నిదివఱ కెవ్వరివలనను అనుభవసిద్ధిగ వినియుండనైతి.

ఉత్సాహా వృత్తము

పరుస వేది నెనసి యినుము ♦ స్వర్ణమైన రీతిగన్
దురితభంజకంబు మఱియు ♦ దుఃఖనాశమైన నీ
పరమనిర్మలాత్మబోధ ♦ వలన నాదు డెందముం
సరగ పారిశుద్ధ్య మంది ♦ శాంతి నొందెఁ బుత్రకా! 24

బిడ్డా! నా హృదయంబను నడవియం దుత్పన్నములై బహుకాలంబునుండి పెరిఁగి పెద్దవియై యజ్ఞానంబను కాఱుచీఁకటిని గ్రమ్ముచున్న శోకమోహంబులను రెండు ఘనవృక్షంబులను నీ వాక్యకుఠారములచేతఁ దుత్తునియలుచేసి మూలచ్ఛేదం బొనర్చితివికదరా పుత్రకా! ఇఁక నిన్నుం జంపవలదని యే నొక్కింతయైన నీ రాజేంద్రు నడ్డగింపఁజాల. ప్రాణనాథా!

గీ. పుత్రి బుద్ధియెఱింగి యె ♦ ప్పుడును వినని
నీతు లెన్నియొ బోధించి ♦ నిర్మలాత్మ
నొసఁగె నీతఁడు సాధుజ ♦ నోత్తముండు
పుత్ర మాత్రుండు కాఁడు; ప ♦ విత్రుఁ డధిప! 25

కావున నీ వింక సంశయింపక వీనిని ఖండించి నీ వ్రతం బీడేర్చుకొమ్ము.

సంవాద మత్తేభము.

ధ—జనకా! కాల మతిక్రమింపదె?
సం— ... ... విభూ! ♦ జాగేల యుక్కాంతతో?

రు—వనితా! సత్యమె.

మో— ... సత్యమే జరగని.

రు— ... ... ♦ పద్మాక్షి శాంతించు.

మో—నీ! వినయాలాపములేల పుత్రుఁడునుర్విన్?

రు— ... ... ♦ బింబోష్ఠిగో! త్రుంచెదన్.

ధ—జనకా! వేగమె.

సం— ... నాథ! గ్రక్కున

రు— ... ... ఇదే ♦ శాతాసి చేఁ బూనితిన్ 25

పుత్రకా! నీ వివట నిలువుము. (అని ఖండింపఁ బోవఁగా)

మోహి—(తనలో) అహా! వీరు మువ్వురును జావునకు వెఱవకయే యున్నారు. ఈతని జంపినమాత్రంబున వీరికి వ్రతభంగం బెట్లగును! ఇపుడు నే నేమిచేయుదు? అయినను మఱియొక తంత్రముఁ బన్ని చూచెద. (అనిత్వరగా రాజునకడ్డముపోయి) రాజేంద్రా! ఒక్కింత తాళుము.

రుక్మా—నాకుఁ దడవగుచున్నది. నేనింకఁ దాళఁజాల. (అనిత్వరపడుచున్నాఁడు)

మోహి—(మరల నడ్డముపోయి చేయిపట్టుకొనుచు) [30]ఏమి యీ వెఱ్ఱితనము!

క. ఇది సత్య మిది యసత్య
మ్మిది శిష్టజనానుకూల ♦ మిది యగ్రాహ్య
మ్మిది ధర్మ మిది యధర్మ
మ్మిది గర్హిత మంచు నెఱుఁగ ♦ వేమందు నృపా! 26

రు-క. ధర్మాధర్మము లెఱుఁగక
దుర్మతినై యే నొనర్తు ♦ దుడుకుఁదనం బే
కర్మమునఁ గాంచి తకటా
మర్మ ముడిగి తెల్పు, వేఱు ♦ మాట లిఁ కేలా?.

మో-గీ. వ్రతమటంచును మఱియేమొ ♦ గతులటంచు
సుతునిఁ జంపఁగనౌనె యో ♦ శూరవర్య?

నూత బిడ్డను బడవైచి ♦ లోఁతు జూచు
రీతి నున్నవి నీ వెట్టి ♦ చేఁత లెల్ల.

మ-క. ముసుకున నొడలి నెఱుఁగక,
కడువడి వ్రతమనక, మఱి సు ♦ కర్మ మనకయే,
కుడుచుచు ముడుచుచుఁ గట్టుచుఁ
గడుపే కైలాసమంచుఁ ♦ గడపుఁ మనియెదే?

మోహి—స్వర్గాదిభోగములు నీవు కల్గునను చుండ నే నేల లేదనవలెను?

ఉ. నీవనుమాటయే నిజము ♦ నిక్కము కల్గును స్వర్గభోగముల్;
పోవఁగనిమ్ము దాని నిఁకఁ ♦ బొల్పుగఁ దెల్పు మి దొక్కమాట; నీ
నీ వరపుత్రనాశమున ♦ నీశ్వరపూజ నొనర్పఁ బాడియే?
గోవులఁజంపి చెప్పులను ♦ గొల్లగ దానమొసంగు రీతిఁగన్. 30

సుకర్మ—అబలవగు నీ విట్టి రహస్యంబు లెల్ల నెట్టు లెఱుంగఁగలవు?

ఆ. దేహి నైన సుతుఁడు ♦ తెగువాఁడె? శుద్ధాత్మ;
మలిన దేహ మెప్డు ♦ మట్టి పాలె;
సద్వ్రతార్థ మితఁడు ♦ చయ్యన మే నిచ్చి
పడయు గతులు యజ్ఞ ♦ పశువు మాడ్కి. 31

నాకు సుతుండై జన్మించినందుల కీ జీవునకు మద్వ్రతకారణంబున సద్గతుల గల్పింపుచుంటి. కాని గోవులఁ జంపుట యనెడి దుష్కార్యంబొనర్చి, తద్దోష పరిహారార్థముగ దానిచర్మముతోఁ గుట్టిన చెప్పులను దానమిచ్చినట్టులు నే నొనర్చిన దుష్కార్యమే లేకయుండఁ దద్దోషపరిహారార్థము వ్రతం బొనర్చితి ననుట ధర్మమా?

మోహి—హాహాహా! ఇదియేమి! వెఱ్ఱి వేదాంతంబు లేవఁబెట్టుచుంటివి! ఇప్పటి నాగరికు లెల్లరు నిట్టివేదాంతంబుల నే మిట్టవేదాంతంబు లందురు. కావుననే నేఁటిదినంబున నీ వచ్చుటనో మూఢభక్తిపరాయణులగు పౌరాణికుల మాయలలోఁ దగిలితి వని ముందే మొఱపెట్టితిని. ఔరా! స్వర్గభోగాపేక్షలు

లోకంబున కెంత యపకారంబు బొనరించుచున్నవి! దేహి తెగఁడఁట! దేహమే తెగునఁట! ఆ దేహికి ప్రతకారణంబున సద్గతులు కల్గునఁట! అట్టి గతుల నీతఁడు కల్పించు చుండెనఁట!!! ఏటి కిట్టి యసంబద్ధ ప్రలాపంబులు?

రుక్మా—ముద్దగాలా! వేదంబు లప్రమాణంబు లనుచు, శాస్త్రంబు లప్రస్తుతోప యోగంబులనుచు, పురాణంబులు కల్పనాకథలనుచు, గురుకులవాసమున్న దెఱుంగక, చిరకాలాశ్రితమైన యాచారంబునందు విశ్వాసములేక, పెద్దలగు వారల పల్కులందు గౌరవమైనలేక, నోరికివచ్చినట్లు ప్రసంగించు నిరాధారము లైన యాకాశపంచాంగ సిద్ధాంతములే ప్రమాణముగాఁగల నీ బోంట్లయొద్ద ఆత్మవిషయిక ప్రసంగంబు లసందర్భప్రలాపంబులుగాక మఱి యేమగును!

మోహి—ఒకవేళ గతులు గల్గు ననుకొన్నను

క. ఎంతైన డొంద మమలతఁ
జెందిన గతికల్గుఁగాని ♦ సిగ్గటి యకటా
తందాన తాన యనుచును
జిందులు ద్రొక్కుటను ఫలముఁ ♦ జెందుదురె నృపా? 32

రుక్మా—ఏమేమీ? చిందుఁద్రొక్కుటయా? ఇట్లనుటచేత నీ యభిప్రాయమేమి?

మోహి—రాజేంద్రా! అప్రత్యక్షంబును, ననుమానంబును నగు నాకలోకాను భవముంగూర్చి యీ మిథ్యావాదంబు లేల కావించెదవు? పోనిమ్ము. నీ వి ట్లొనర్పుట చేఁ గలుగబోవు ప్రత్యక్షానర్థంబులఁగూర్చియైన యోజింపరాదా?

రుక్మా—ప్రత్యక్షానర్థంబు లేమికలవు!

—* సంవాద సీసమాలిక. *—

మో—పుత్రశోకంబును ♦ మిత్రదూషణమును
నపకీర్తి వచ్చి ని ♦ న్నలము కొనవె?

రు—ఈశ్వరార్పణబుద్ధి ♦ నే నొనర్చినదాని
కపకీర్తి దుఃఖంబు ♦ లలము టెట్లు?

మో—పరలోక మనియెడు ♦ వైకుంఠ మనియెడు
వచ్చి నీ వెప్పుడైనఁ ♦ జూచియుంటె?
గు—చూడఁగోరినఘనుల్ ♦ సొంపు దీపింపఁగా
జ్ఞానదృక్కులచేతఁ ♦ గాంచలేదె?
మో—భావిసౌఖ్యము నమ్మి ♦ ప్రత్యక్షమున బాధఁ
బడఁగోరు టెంతైన ♦ భ్రాన్తి గాదె
గు—ప్రత్యక్ష మనునది ♦ భ్రమ కాదె? యంతలో
హరియించు నంచు నీ ♦ వరయవొక్కొ.
మో—కాసుచేయని హరి ♦ వాసవ్రతకాంక్ష
బాలుని ఖండింపఁ ♦ బాడి యౌనె?
గు—హరివాసరమహత్త్వ ♦ మరయంగ మనబోఁటి
స్వల్పబుద్ధులకెల్ల ♦ సాధ్య మౌనె?
మో—గీ. భ్రూణ శిశుహత్య లివి నీకు ♦ ముక్తిదములె?
గు—ముక్తి యన నెద్ది? రాగవి ♦ ముక్తి కాదె?
మో—ఎట్టి ఘనుఁడవు! హా స్వర్గ ♦ మెదుర వచ్చు!
గు—స్వామికృపకన్న మఱి వేఱె ♦ స్వర్గ మేడ? 33

మోహి—(హాస్యముగా) అవునవును రాజా. స్వామి నీకుఁ బ్రత్యక్షము కాఁబోవు చున్నవాఁడు. ఇటు వినుము.

సీ. తనను యోజనశాలి ♦ యనుకొను మానవుఁ
డొరుల మాటలఁ జెవి ♦ యొగ్గి వినఁడు
వినినచో దానిని ♦ వికటంబుగా నెన్ను
నెన్నెఁబో వారల ♦ హీనపఱచు
పఱిచెబోఁ మరలఁ జె ♦ ప్పఁగఁబూను బుద్ధిని
జెప్పఁబో వారలఁ ♦ జెనఁటు లనును

పలుమాఱు నీ రీతిఁ ♦ బహుళవాక్యవిస్ఫూర్తి
క్రిందు మీఁ దరయక ♦ కెరలివడుచు

సీ. పనులు చెడిపోఁగ, నపకీర్తి ♦ పైకి రాఁగ,
ధైర్యమును లోఁగ, వ్యధను చి ♦ త్తంబు వేఁగ,
చింత లాఁగి మూఁగ, వేడ్కలు ♦ చీలి సాఁగ
దైవమును దూఱు కుజనుండు ♦ తవిలి తవిలి. 34

ఇట్టివారిని లోకములో నెందఱఁ జూచుటలేదు రాజేంద్రా?

రుక్మా—నీ వొనర్చెడి సుబోధ నేను వినకుండినందులకా యిట్టు లాడుచుంటివి?

మోహి—సుబోధల నిన్నాక్షేపింపనేల? నీ వభిమానించెడి యా శాస్త్రాభి
ప్రాయములనయినఁ జక్కఁగా మన్నించితివా?

రుక్మా—మన్నింపక యేమొనర్చితి?

మోహి—ఏ మొనర్చితివో నీ వెఱుఁగవా?

రుక్మా—అట్లనెదవేమి? నేను శాస్త్రవిరుద్ధముగఁ బ్రవర్తించుచుంటినా?

మోహి—నీ ప్రవర్తన శాస్త్రసమ్మతమగుటచే శాస్త్రసమ్మతమని యనుకొనుచుంటి
వేమో.

చ. తనయుఁడితండు, రాజ్యపద ♦ దక్షుఁడు, కీర్తివిశాలుఁ డాపయిన్
జనకసుశాసనానుగ వి ♦ చారుఁడు, ధీరుఁడు, ముందుముందు మీ
కనువగు పుణ్యలోకఫల ♦ వాప్తినొసంగెడు దాత, యిట్టి మేల్
గొనములరాసి గూల్చి,యటఁ ♦ గూలెదె పున్నరకాగ్ని కీలలన్?

రుక్మా—అబలా! నీ వచనంబులు చూడ పిట్టకొద్ది కూఁత ఘన మన్నట్లుగా
నున్నవి. ఏమంటివి? పున్నరకాగ్ని కీలలా? ఏ నెఱింగింతు వినుము.

ఉ. మానసకాంత యల్ల పర ♦ మాత్మవిభుం గొని క్రీడసల్ప, వి
జ్ఞానసుతుండు పుట్టి, భవ ♦ నాశ మొనర్చును గాని, యేటి య
జ్ఞానము? దేహపుత్త్రుఁడు ఋ ♦ ణస్ఫుటవేషుఁడు మోక్షమిచ్చునే?
పూనిక వేషధారియగు ♦ భూపతి దేశము లేలఁ జాలునే? 36

మో—నీవంటివానికి హితోపదేశంబు చేయఁబూనిన లోపంబు నాదికాని నీదికాదు.

క. నీతి విడిచి సుతుఁ జంపుట
పాతక మని తెల్పు నాదు ♦ పల్కులు భూపా!
యీ తీరున నీ మనసను
నాతికి గిలిగింతఁ బ్రోలి ♦ రంజిలె నకటా! 37

కానిమ్ము. రాజేంద్రా! నీయిష్టముచొప్పన నేకానిమ్ము. నీకులేని ప్రేమాను బంధంబు నాకేల? (అని కొంచె మూరకుండి వారలు వినునట్లు తనలో) అయ్యో! ఊరకుందుమన్న ను మన సొప్పదే! ఏమియు నెఱుంగని పసిపాపనిఁ బట్టి యన్యా యంబుగఁ జంప నుద్యమించియున్న వాఁడు. బిడ్డలుకలవా రెవ్వరైన నిట్టి కార్యం బొనర్తురా? (అని జనాంతికముగా ధర్మాంగదుని బిలిచి) నాయనా! బిడ్డా! ధర్మాంగదా! ఇటు రమ్ము. (అని చేరఁదీసికొని) నీ జనకుని వాక్యంబులు విను చుంటివికదా? నీవును చావున కేల సిద్ధమయ్యెదవు? అయ్యో బిడ్డా! నిన్నుఁ జూచిన నాకు ముద్దగుచున్నది. నిన్నుఁ జంపుదురన్న నా గుండెలు కొట్టుకొను చున్నవి. ఈ రాజేంద్రుఁడు లేనిపోనిపంతంబులు పూని నిష్కారణముగా నిన్ను జంప నుంకించుచున్న వాఁడు. వీరల జోలి నీ కేల? చిరంజీవివై నాయొద్ద సుఖంబుగ నుందువు రమ్ము. ఆవులు పోరాడి లేగలకాళ్ళు విఱుగఁ ద్రొక్కి నట్లున్నది. తాను వ్రతముఁ విడువఁడఁట; దానికిబదులు నిన్నుఁ జంపెడునఁట! ఇట్టి యన్యాయ మెచ్చటనైన నుండునా?

గీ. రాచధర్మంబు న్యాయంబు ♦ రట్టు పాలు
చేయఁ జూచెను నీ యయ్య ♦ చేతఁ జిక్కి
బాధ లిట్లేల పడియెదు? ♦ ప్రాణ మున్న
బలుసుకూరను దినియైన ♦ బ్రదుక లేవె? 38

ఇంతకుముందు స్వర్గమేమో కల్గునని చెప్పుచుంటివి. అయ్యో బిడ్డా? ఇది యెట్టి కట్టితలంపు! మతిపోయిన పౌరాణికులు చెప్పెడి వచనంబు లేమైన విని యుంటివా? ఏమియు నెఱుంగని పసికూనకు నీకీ గాథలన్నియు నేల నాయనా? జనకునితో 'నే నీ చా వు న కొ ప్పు కొ న ను' అని చెప్పుము. దానిపైజనకుం

డలుగు నెడ నిన్ను నాయొద్దనే యుంచుకొనియెద. నీకుఁ గొదవేమి బిడ్డా? నా మాట వినుము.

ధర్మా—(స్వగతము) అయ్యారే!

చ. అమలచరిత్రుఁడౌచు, సుజ ♦ నావళిచే నుతిఁగాంచు, మేటి నే
మమునవ్రతంబొనర్చ్చి బుధ ♦ మానితుఁడౌ జనకుంహు దుష్టస
త్తముఁడఁట స్త్రైణుఁడౌనఁట! వ్ర♦తంబులుఁ గల్లలఁట! యింతె కాక, యీ
యమననుఁగాచి పెంచునఁట ♦ యౌర! బళారె దయాస్త్రి వాక్యముల్

(మహాజనుల నుద్దేశించి) ఓ సుజనాగ్రగణ్యులారా!

చ. వ్రతము మహత్తరంబు, ఘన ♦ పాపహరంబు, సురార్చితంబు, నా
శ్రితజన కల్పకంబు, నల ♦ శ్రీశసుప్రియంబు, శుభప్రదంబు, నీ
కృతికయి మేనిఁబాయుటది ♦ కీడఁట! గోడఁట! యిట్టి కాయమే
సతమఁట! వింటిరే జనని ♦ స్వార్థపరైకమహాప్రసంగముల్? 40

(ప్రకాశముగా) జననీ! [31]

సీ. తల్లిదండ్రులకన్న ♦ దైవమే లేఁడని
పలుమారు పెద్దలు ♦ పల్కుచుండ,
నక్కటా వారల ♦ యభిమతంబునకు నే
ననుకూలుఁడనుగాక ♦ యదరిబెదరి,
నీతంత్రవాక్యముల్ ♦ నిజమని మదినిడి
యిప్పటి ముప్పును ♦ దప్పకొనిన
క్షణభంగురమగు నీ ♦ కాయంబు నెన్నాళ్లు
భద్రంబొనర్చి కా ♦ పాడఁగలము?

గీ. నీవు, నేనును, మఱిఁగల్గు ♦ నిఖిల జనులు
నెప్పుడో, యెట్టివేళనో ♦ యెట్టిగతినో
ఏ రుజలఁ జిక్కుపడియొ యా ♦ మృత్యువాతఁ
బడుదుమే కాని యది తప్పి ♦ బ్రదుకఁ గలమె? 41

అట్లు వ్యర్థంబుగ మృతిఁ బొందుటకన్న నేనీ హరివాసరదినంబున వ్రతనిర్వహణార్థంబుగ మేనిఁ బాయుట మేలుకాదే? జననీ! ఇట్టి పల్కులు చాలింపుము.

మోహి — ఓయబ్బ! యీనీతులన్నియు నెప్పుడు నేర్చితివోయి! ఇవి యన్నియు జావఁబోయెడువాని కుండునీతులే. ఔను. పైత్యరోగికిఁ బంచదార విషమగు నట్లును దివాంధమునకుఁ బగలు కనఁబడనియట్లును, యువతీలోలునకు హరికథాలాపం బనిష్టమగునట్లును నా వచనంబులు నీకుఁ జేదగుచున్నవి కాఁబోలు. అవునవును.

ఉ. అంబరవీథి నేగుచు, ర ♦ యంబున భూమినిగల్గు మాంస ఖం
డంబును గాంచఁగల్గెడి దృ ♦ ఢంబగు దృక్కులుగల్గు పక్షు లు
గ్రంబగు మృత్యువాతఁ బడు ♦ కాలము డాసిన యట్టివేళ పా
దంబులముందుగల్గు నురి ♦ త్రాళ్ళను గానఁగఁజాలవక్కటా 42

అట్లే నీకును జావుసమీపించుటచేతనే నావచనంబులు కర్ణశూలంబులగుచున్నవి పోనిమ్ము. నీకు లేని బాధ నాకేల? ఎద్దునకులేని యేడుపు గానుఁగ కుండునా?

ధర్మా — జనకా! ఈ నాతిమణితో నిట్లు వృథాప్రసంగంబులఁ గాలంబుఁ గడపనేల? సత్వరంబున నన్ను ఖండించి నీ వ్రతంబు నెఱవేర్చుకొమ్ము. తడవగుచున్నది.

రుక్మా — అట్లే యొనర్తు పుత్రకా! (అని మోహినిం జూచి) తరుణీ! నీవు కోరిన ట్లీ పుత్రు నిప్పుడే ఖండించి నా వ్రతంబును సాగించుకొనఁ బోవుచున్నవాఁడ.

మోహి — రాజేంద్రా! నన్ను బెదరించెదవా?

క. కొడుకును జంపెద ననుచును
బుడబుడలాడెదవు; చంపు; ♦ పో; నాకేలా?
గుడినుండు గంట పోయిన
నడుమ నచటి నంబి కేమి ♦ నష్టము చెపుమా? 43

వ్రతంబు విడువుమని యెంతచెప్పినను వినక పుత్రు నే ఖండింతు ననుచుంటివి. నీకు లేని దయారసంబు నాకేల? నీ యిష్టముచొప్పున నే కానిమ్ము. (అని తనలో) ఈతండు నిక్కంబుగ సంహరించునేమో. సంహరించిన — ఫల మేమి? ఇచటకర్తవ్యాంశంబు పుత్రవినాశంబు కాదుకదా. కాని యీషణత్రయంబునఁ

జూడ పుత్రేషణం బత్యధిక బాధకంబని మహావిరాగులగు తత్వజ్ఞులుకూడ నడలుచుందురు. ఈతఁడూరక బింకంబు లాడుచుండెఁ గాని కదిసి వధింపఁబోవ నీతని హృదయం బదరకయుండునా! ఒకవేళ దిట్టరియై గట్టితనంబునఁ బట్టి వధించునేమో. ఈ శిశుహత్యాపాతకంబు నాకేల? అయినను దేవతాప్రేరణంబునఁగదా యే నిట్లు పూనితి. వారిట్టి దురంతంబుం జూచి సహింతురా? ఈ సచ్చరిత్రు నిట్టి యకారణదుఃఖంబున ముంతురా? తగిన వేళ నొక్కటిన్ యోజింపక విరమింతురా? కానిమ్ము. ఏమగునో చూచెద.

రుక్మాం—పుత్రకా నీ వీ బల్లపైఁ బరుండుము.

ధర్మాం—చిత్తము. అట్లే చేయుదును. (అని పడుకొనుచున్నాఁడు.)

రుక్మాం—(ఖడ్గంబు చేతఁ బుచ్చుకొని యొద్దనిలిచి) ఆహా! ఖండింపఁబోవ దేహము కంపమొందుచున్నదే!

తురంగప్రయాతము.

ఔర, యెంత కార్య మయ్యో! ♦ నాత్మజున్ వధించు నీ
క్రూర కర్మ మెట్లొ నర్తు ♦ గోపికా మనోహరా?
చేరి వీనిఁ ద్రుంపఁ బోవఁ ♦ జేతు లాడ వక్కటా
యూరకున్న సద్వ్రతం బ ♦ హహో! వృథా యగుం గదా.

ఆఁ! ఏమీ! ఏనిప్పుడు పుత్రేషణా ప్రతిబంధంబున వ్రతం బుజ్జగింతునా కటకటా చిత్తమా! నీ కీ భ్రాంతి యేల?

ఉ. పుత్త్రుఁడు పుత్త్రుఁడం చకట ♦ పొక్కెదు నీవిటుమాటిమాటికిన్
పుత్త్రుఁడు నీవు నొక్కతఱిఁ ♦ బుట్టిరె? యొక్కటఁ జావఁబోదురే
పుత్త్రుఁడెవండొ నీవెవరొ ♦ పుట్టకపూర్వ, మొకింత నేఁడు నీ
పుత్త్రుఁడనంగనే భ్రమసి ♦ మున్గెదె మోహమహాంబురాశిలో?

ఉ. ఎందఱు పుట్ట రీ జగతి? ♦ నెందఱు కల్గరు? మున్ను పుత్త్రులం
జెందఱు భ్రాంతిఁ జెందరు? గ ♦ ణింపుము వారలు చావకుండిరే

నందంబుసేయు వస్తుఘన ♦ వాహనముల్ వెనువెంటఁ బోయెనే?
కొందలమందెదేల వినఁ ♦ గూఁతని కల్లజగంబు నమ్ముచున్ 46

కవిరాజవిరాజితము.

సతిసుతసోదర బంధుహితాదుల ♦ సంఘమునందలి భ్రాంతిని నీ
గతి వెతనొందుట మౌఢ్యమునందగుఁ ♦ గాదె? వివేకుల కార్యమె, హా
హితవృగఁ దెల్పిన సద్గురుబోధ యొ ♦ కింతయు నెప్పుడు వీడకు వే
సుతుని వహింపవె; శోకమడంప ♦ వె; సూటిగ పరాత్పరుసం దిడవే.

మోహి—(తనలో) ఔరా! యీతని వైరాగ్యం బెంతయుఁ గొనియాడఁ దగి యున్నది. నాయత్నం బిప్పటికి వ్యర్థమైనట్టులే యున్నది.

సుకర్మ—పుత్రకా! యిఁక సిద్ధంబుగ నుండుము.

ఉ. హా పరమాత్మ! యాశ్రితజ ♦ నావన! యచ్యుత! దీనవత్సలా!
యీ పసికూన దోష మొక ♦ యింతయెఱుంగఁడు; మద్వ్రతార్థమై
యీ పరమేష్ఠిపుత్రి వధ ♦ యింపుమటన్నను నిట్లు పూనితిన్
పాపవిదూర! వీనినిఁ గృ ♦ పామతి నీ దరిఁజేర్చి కావవే. 48

(అని మొక్కి వేటు వేయఁగా కంఠమున కేమాత్రము బాధఁ గలిగింపకయే ఖడ్గము విఱిగిపోవుచున్నది. దీనిచేత రాజు విస్మయంబంది తనలో)

అక్కటా యిదియేమి యాశ్చర్యము! రణరంగమందనేకులగు శత్రురాజుల శిరంబులెల్ల ఖండతుండంబులుగ నఱికి వన్నెకెక్కిన యీ యాయుధం బిట్టులీ పసిబాలుని కంఠముపై వేసినమాత్రంబున విఱిగిపోయెనే? ఇందు కేమనవచ్చు?
(అని దానిం జేతఁగొని) అక్కటా ఖడ్గమా! యిట్లు తునియలైతివా?

చ. సమరమునందు శత్రువుల ♦ సత్యవిదూరులఁ గ్రూరకర్ములన్
గుమతుల నెల్లఁ ద్రుంచి నుతిఁ ♦ గొన్న నినుంగొని నిర్మలాత్ము నీ
సుమసమదేహుఁ ద్రుంపఁగను ♦ జూచితినం చిరువ్రయ్యలైతె? న్యా
యమ యిది? సద్వ్రతార్థ మకటా కరుణించి క్షమించు ఖడ్గమా!

(అని ఖడ్గమునకు మ్రొక్కుచున్నాఁడు.)

మోహి—అవునవును. ఆ ఖడ్గము ముందే క్షమించినది యీ బాలుని. భూపాలా! నీ విచ్చట నొక్క ధర్మం బెఱుఁగవలసియున్నది. ఏమన:—లోకంబున నేరస్థుఁ డగువాఁ డురిఁదీయఁబడునప్పు డాతఁడే కారణంబున నేని మృతుండు గాని యెడ నాతండు నిజంబున నిర్దోషియనియు, నాతఁడు శిక్షింపఁబడుట సర్వసాక్షియగు పరమేశ్వరుని సంకల్పము కాదనియుఁ, దలఁచి యాతని నిర్దోషిగా నిశ్చయించి మగల నురితీయక విడుతురు. ఇది రాజనియతి. ఇట్టి ధర్మానుసారంబుగ నీ ధర్మాంగదుం డిపుడు రక్షార్హుండు. కావున నీతని విడువుము. వ్రతం బటుంచి మన మంతఃపురంబునకుఁ బోవుదము రమ్ము.

రుక్మాం—ముద్దరాలా! ఈ ధర్మాంగదుండు దోషియని శిక్షింపుమంటినా? ఇపుడు నిర్దోషియని రక్షింపనుంటినా? మద్వ్రతనిర్వహణార్థంబుగ నీతని యనుమతి చోఁఫ్పన నిష్లొనస్సుమంటి. ఇంక నీ ధర్మోపదేశంబు లేల? చాలింపుము. (అని విఱిగిన యాయుధము నావలఁ బడవైచి) సేవకా! విల్లునమ్ములు గొనిరమ్ము. (అని యాతఁడు తెచ్చి యొసంగఁగా దీసికొని) హృదయమా! నీవు కలవర మందకుము.

ఉత్సాహావృత్తము

శ్రీధరుండు భక్తవరుల ♦ చిత్తవృత్తు లెప్పుడున్
శోధనం బొనర్చి పిదప ♦ సుఖము లిచ్చుఁ గావునన్
బాధ కాదు నేఁ డిదెల్లఁ ♦ బంకజాక్షు కృపకు సత్
సాధనం బటంచు నీవు ♦ ధైర్య మొందు డెందమా! 50

హస్తమా! నీ పరాక్రమము చూపుట కిదియే సమయము.

లయగ్రాహి

హుమ్మనుచు శత్రునిచ ♦ యమ్ము నెగ జిమ్మి సమ
రమ్మున జయమ్ము వెద ♦ చిమ్మము కరమ్మా!
ముమ్మరిపు మోహామక ♦ రమ్ము వడి మానస గ
జమ్ము నిహసౌఖ్య సలి ♦ లమ్ము లకు నీడ్చున్

జమ్మనుచు జ్ఞాననిక ♦ రమ్మను సుదర్శనవ
రమ్మున రణమ్మున జ ♦ య మ్మిపుడు కొమ్మా
అ మ్మకరమున్ దునిమి ♦ నెమ్మదికి శాశ్వత సు
ఖ మ్మొసఁగు నీకిది ఘ ♦ నమ్మగు కరమ్మా! 51

పుత్రకా! నీ విచట నిలువుము.

ధన్యా—చిత్తము. ఆలాగే చేయుచున్నాను.

సుకాన్త—(శరము నుద్దేశించి) అక్కటా శరమా! నీవేమిచేసెదో కదా.

మ. పరమాహ్లాదముతోడ నిన్ సుహృదుగాఁ ♦ బ్రాణాప్తుఁగా భ్రాతఁగా
చిరకాలంబు సహించితిన్ మఱియు నా ♦ జీవంబుగా నెంచితిన్
శరమా! నాపలుకు న్నాగ్రహింపక మదిన్ ♦ సంకోచమున్ లేక నీ
చిరసౌహార్ద విశేషతన్ సుతుశిర ♦ చ్ఛేదంబుఁ గావింపుమా 52

హా! జగద్రక్షకా! (అని శరంబును బాలుని కంఠముపైఁ బ్రయోగింప గా నది పుష్పహారమై వాని కంఠంబునుఁ జుట్టుకొనుచున్నది. అదిచూచి) ఔరా! యిది యెంతచిత్రము! ఈ శరంబయిన వీనికంఠంబును దునుమక పైపెక్కిలి తానొక పుష్పహారమై వీని కంఠంబునుఁ జుట్టుకొనుచున్నదే! అక్కటా శరమా!

చ. ప్రియసఖి వాదులాడుటలు, ♦ పెల్లుగఁ బట్టపుదేవి నొచ్చుటల్,
నయరతుఁ బుత్రుఁజంపఁగఘ ♦ నంబుగ నిర్గ్ని వేఁడికో, లయో
మయతను వించు, నిందులకు ♦ మానస మొప్పమి, నౌర యిట్టులౌ
నె?యనుచు సౌమనస్యమువ ♦ హించియ యోమయునన్నొనర్చితే?

ఇప్పుడు నే నేమి చేయుదును? (అని తనలో)

తరలి వృత్తము

తల్లి, సుతుఁడు, తండ్రి మఱియు ♦ ధాతృసుతయు నొక్కటన్
వల్లె యనుచుఁ బుత్రుఁ దునుమ ♦ వాంఛఁ జేసి యుండఁగా
నెల్లనిగతి నమ్ము లకట ♦ యూఱక యె తలంగెడున్
నల్లదౌర వరమ్మొసఁగిన ♦ సంబివరము కానటుల్. 54

మ. కలకాలంబు భరించితిన్ బెనిచితిన్ ♦ గష్టంబులన్ గాచితిన్
జెపుకాలంబు తటస్థమైనయెడ ని ♦ స్సీ యంచు సౌమ్యాత్మకుల్
చెలికాండ్రాప్తులుబాంధవుల్ విడుచుటల్ ♦ సిద్ధంబెయాఁగానియా
పలుకన్ లేని యచేతనంపు శరమున్ ♦ బాసెంగదా దైవమా!

నే నొనర్చు వ్రతమునం దేమైన దోషంబు కలిగియుండునా? అట్టిదేమియుఁ గానరాదే. హా పరమాత్మా! ఆపద్బాంధవా! దీనశరణ్యా! నే నెవ్వఁగవాఁడ నగుదు? నేఁడు న న్నిట్టు లేల యాలయింపఁ జొచ్చితివి? నన్నుఁ బరిశోధింపఁ దలఁచియే యిట్టి యిక్కట్టులఁ బెట్టి గట్టువడం జేయుచుంటివా? వీనిశిరం బెంతయు ఖండింప శక్యంబుగాకయుండె. ఖండించినగాని నా వ్రతంబు నెఱవేఱదయ్యె. ఇట్టిసమయంబున నీ దీనుని మొఱాలకించి దీనవత్సలుండను బిరుదు నిలుపుకొమ్ము.

ఉ. హా! విధినేమియందు? మది ♦ నాఁటమెట్టుఁబలు డిందు? నింక నా
యీవెత కేదిమందు? మఱి ♦ యెవ్వరితో మొఱవెట్టుకొందు? నీ
వీవగ నూరకుందు విది ♦ యేటి తమాష బలే పసందు? దా
సావనుఁడన్న నీదు బిరు ♦ దాంకము భద్రము! దీనరక్షకా! 56

(అని మఱియొక ఖడ్గముం గైకొనుచున్నాఁడు.)

మోహి—కటకటా, కఠినహృదయా! వేఱొక ఖడ్గముంగొని ఖండింపఁబోవుచుంటివా? ఆ యచేతనంబగు శరంబునకైనఁ గనికరముపుట్టెఁ గాని నీహృదయము పాషాణంబు కరఁగదాయె! ఈ ఘోరకృత్యం బీశ్వరప్రీతికరంబగు నేని యాశరం బట్లు పువ్వుహారమై వీని మెడం జుట్టుకొనునా? నీ విందు కేమనియెదవు?

రుక్మా—ఏమందునా? నీవు కేవల మనుష్యమాత్రురాలవు కావనియు, మాయాస్వరూపిణివనియు, నిదియెల్ల నీ మాయావిశేషంబనియు ననెద. (రౌద్రముతో) నీవింక నన్ను సమీపించి యడ్డదిడ్డంబు లాడకుము. నాచేతిలోని యిది ఖడ్గంబని యెఱుంగుము. బాపురే! నిర్మలచిత్తంబున మాయారహితుండగు బరాత్పరు నెప్పు డారాధించు నే నీ తుచ్ఛమాయావిచేష్టితంబులకు వెఱతునా? హా గజరాజవరదా!

ఉ. ఏనె ప్రభుండనేని, భువి ♦ నెన్నఁ డసత్యముఁ బల్కనేని, యేఁ
బూనిన యీ వ్రతంబు సుర♦పూజ్యము విష్ణుప్రియంబు నేసియున్
మానుగ వేదవాక్కులు ప్ర♦మాణములేనియు, మద్వ్రతార్థమై
పీనిశిరంబు నేఁడిట భు♦విన్ బడకుండున యొక్క వ్రేటునన్

(అని ఖడ్గమెత్తి వ్రేయఁబోవఁగా శ్రీ విష్ణుమూర్తి శంఖచక్రకిరీటధారియై ప్రత్యక్షుం డగుచు రుక్మాంగదుం డెత్తిన ఖడ్గంబుఁ బట్టుకొని)

ఉ. తాళుము తాళు భూప యిఁకఁ ♦ దత్తర మొందకు; నీదు భక్తికిన్
జాలఁగ మెచ్చినాఁడ; మది ♦ సంతసమందెను; నీ సుతుండు నీ
యాలును మేటిభక్తిఁ దన ♦ రారినవారలు; మీరు ముప్వురుం
బాలును నీరు శర్కరల ♦ మాడ్కిని గూడినవార లిచ్చటన్ 58

రుక్మా— సంధ్యా— ధర్మా— మోహి—

గజరాజవరదా! ఆపద్బాంధవా! నమస్కారము.

దండకము.

శ్రీమన్మహాదేవ యీశా! లసచ్చిత్ప్రకాశా! మహాఘోర పాపప్రణాశా! పరేశా! భవద్దివ్యసందర్శనానందకాంక్షన్ దివిన్ దేవముఖ్యుల్, భువిన్ మానవేంద్రుల్, వనిన్ మౌనివర్యుల్, మహాభక్తివారాశిపారంగతజ్ఞానసంపన్నులై యొప్పు వ్యాసాంబరీషాది భక్తాగ్రగణ్యుల్సదా నీదు పాదార్చనధ్యాన సంకీర్తనంబుల్ కడుం బ్రీతి గావించి సంతృప్తులై పొంగుచుందున్ గదే భక్తహృత్పావనా!* దేవ నీరూపుఁ గన్గొన్న మాత్రాన నీనామమున్ విన్నమాత్రంబునన్ శాకినీ, ఢాకినీ, కామినీ ముఖ్య దుష్టగ్రహంబుల్, మహాభూతప్రేతంబులున్, బల్ పిశాచంబులున్, గాలిదయ్యంబులున్ గూలిపోవుం

గదే; దుష్టనాశా! విరాట్పురుషా! విశ్వరూపా! జగద్రక్షకా! వేదవేదాంతవేద్యా! పరంధామ! జ్యోతిస్స్వరూపా! * జగంబెల్లఁ బుట్టింపఁగాఁ బెంపఁగా ద్రుంపఁగా నీవకావే! జగన్నాయకా! యార్త రక్షామణీ! కామితార్థప్రదా! యిట్టి లోకాధినాథుండవైనయొప్పు నీ దివ్యరూపంబు మాపూర్వపుణ్యంబునం జేసి నేఁడిందు మా కన్నులారంగఁ గన్గొంటిమయ్యా! దయం జూడుమయ్యా దరిం జూపుమయ్యా మముం గావుమయ్యా * కృపాసాగరా! దాసహృద్గేహవర్తీ!! జగత్కీర్తికర్తీ! నమోదీనబంధూ! నమోజ్ఞానసింధూ! నమోభక్తనేతా! నమోముక్తిదాతా నమస్సచ్చిదానందమూర్తీ! నమస్తే నమస్తే నమః.

విష్ణు—రుక్మాంగద భూపాలా!

ఉ. మెచ్చితి నీదు వర్తనకు ♦ మెచ్చితి నీదగు సాధువృత్తికిన్
మెచ్చితి నీదు యోగ్యతకు ♦ మెచ్చితి నీ సుజనానువర్తికిన్
మెచ్చితి నీ వ్రతంబునకు మెచ్చితి భక్తికి; మెచ్చి సద్వరం
బిచ్చితి; మీరలెల్ల సుఖ ♦ యింపుచు రాజ్యసుఖంబులందుఁడీ. 6!

రుక్మా—మహాప్రసాదము, ఆశ్రితవత్సలా!

విష్ణు—రాజేంద్రా! ఏనొక్క రహస్యంబు నెఱిఁగింతు వినుము.

—* మానినీవృత్తము *—

నీ నిజభక్తిని నీదు సువర్తన ♦ నీ వ్రతనిష్ఠఁ గనుంగొనఁగన్
మానినిమోహిని బ్రహ్మసృజించి క్ర ♦ మంబుగనీదరికిన్ బనుపన్
గానివిధంబులఁ గాఱియ పెట్టి య ♦ ఖండశ్రమంబుల నిగ్గలచెన్
గానియమాయికురాలిది మోహిని ♦ కంటకురాలని మెంచకుమీ

ఈ యువతి నిర్దోషి. నీ సంధ్యావళ్యాది నూర్వుపభార్యల మరలఁ జేకొని తొల్లిటియట్లు గౌరవించి యేలుకొమ్ము. మఱియును

తె. స్రష్ట నిన్నుఁ గూర్చి ♦ సృష్టించె నిక్కాంతఁ
గాన యొరుల సొత్తు ♦ కాదు సుమ్ము

అఖిల ధర్మ వేత్త ♦ యనుపమ నుతశీల
నీకుఁ దగిన కాంత ♦ నిర్మలాత్మ! 62

కావున నీ తరుణీమణిని నీ పట్టమహిషియగు సంధ్యావళితో సమగౌరవంబున నేలుకొమ్మ.

రుక్మా—చిత్తము మహానుభావా! దేవరయాజ్ఞ శిరసావహించి యట్లే యొనర్చువాఁడ.

విష్ణు—వివిధ వాలు చెప్పవ మీరీలోకంబునందు వేఱడు రాజ్యసుఖంబులనుభవింపు చుండి యంతంబున నాసన్నిధినిఁ జేరఁగలరు. మీర లింక నేమైన వరంబులఁ గోరవలతు రేని యడుఁగుఁడు. ఒసంగ నిచ్ఛవహించియున్నవాఁడ.

రుక్మా—మహానుభావా! ఆశ్రితకల్పభూజా! నాకు వేఱువరంబు లేల?

—* మా లి నీ వృ త్త ము . *—

నాప్రియపత్నులు నావరపుత్రుఁడు♦నాహితబంధులు నేను బజల్
శ్రీపతి! నీ పదచింతన వీడక ♦ చిత్తము లెప్పుడు నీకడనే
కాపురముంచి, దృఢంబగుభక్తిన ♦ఖండసుఖాప్తిని గాంచునటుల్
పాపవినాశ! మహేశ! పరేశ! కృ♦పం దయ సేయవె లోకపితా!

విష్ణు—సంధ్యావళీ! నీ వేమి కోరెదవు?

సంధ్యా—భక్తజనార్తిహరణా! రమారమణా!

మ. తనయుల్ విద్యలనేర్చి, వేత్తలయి, మ♦ద్రాజ్యంబునందెప్డు స
చ్చరితంబుల్ బరిపాలింపుచుఁ విభులకుఁ ♦సంతోషముంగూర్చుచు
న్వరపూజానిపుణైకచిత్తలయి స ♦ ద్వ్యాపారపారీణులై
యిరవొందన్ వరమీఁగదే గుణనిధీ ♦ యీశా! జగన్నాయకా!

విష్ణు—బాలకా! ధర్మాంగదా? నీ వేమైనఁ గోరెదవా?

ధర్మా—భక్తవత్సలా? కరుణాకలాపా! నా కేమి కావలయును?

---

127 పుటలోని దండకము పైనలువురిలో వరుసగా నొక్కొక్కరు
* ఈ గుర్తువఱకుమాత్రము చదివిన బాగుగ నుండును.

ఉ. పిల్లలు తల్లిదండ్రులను ♦ బేర్మిని దైవములంచు నెంచి, తా
మెల్లెడ వారిచిత్తముల ♦ కెక్క నటింపుచు, మత్పురంబునన్
సల్లలిత ప్రచారులయి ♦ శాశ్వతసౌఖ్యము లందునట్టు లు
త్ఫుల్లసరోజనేత్ర! సుర ♦ పూజితగాత్ర! యనుగ్రహింపవే. 65

విష్ణు—విధితనయా! మోహినీ! నీయభీష్టం బెట్టులుండె?

మోహి—కపటనాటకసూత్రధారీ! కలుషభయవిదారీ!

ఉ. ఆ విధియాజ్ఞచొప్పున ధ ♦ రాధిపుచెంగట నే నటించిన
ట్లీ విపరీతభంగి భువి ♦ నేసతియున్ గొనకుండుమాడ్కి నీ
భూవర సత్కథాశ్రవణ ♦ పూతమనస్కులు క్రూరచిత్తయం
చో వరదాత! సద్దలంప ♦ కుండెడుమాడ్కి ననుగ్రహింపవే.

విష్ణు—ఔరా! మీరుకోరినవరంబులు మిగుల శ్లాఘనీయంబులు. అట్టులేయొసంగితి. రాజచంద్రమా! మరియొక విశేషం బెఱింగింతువినుము. నీ విప్పుడీ హరివాసరవ్రత మాహాత్మ్యంబున సర్వజనమాన్యచరిత్రుండ వయితివి. కావున

చ. బుధజనవంద్యమై సుజన ♦ పూజితమై తగు నీచరిత్రమున్
బదపడి యెవ్వరేనియు న ♦ వారణభక్తివిశుద్ధచిత్తులై
చదివిన వ్రాసినన్ వినినఁ ♦ జాలగవారలుభోగభాగ్య సం
పదలఁ జిరాయువున్ గలిగి ♦ వర్ధిలుచుండెద రెప్డు మత్కృపన్.

నేను పోయివచ్చెద. మీరు సుఖంబున నుండుఁడు.

(అందఱు నమస్కరించుచున్నారు. విష్ణుమూర్తి యంతర్ధానం బగుచున్నాఁడు.)

రుక్మాం—సఖులారా! పరమేశ్వరానుగ్రహంబున మనమిప్పటికి ధన్యుల మయితిమి. నేను బహుకాలం బీ రాజ్యంబెల్ల వహించి యలసియుంటి. కావున నిపు డీ పుత్రుని యువరాజ్య పట్టాభిషిక్తునిఁ గావించి యే నీశ్వరధ్యానైకరతుండనై యుండఁ గుతూహలంబు గలుగుచున్నది. ఇందుకు మీ యభిమతం బేమి?

సంధ్యా—ప్రాణేశ్వరా! అట్లే కానిండు.


•హి—నేను దేవర చిత్తానుసరణంబుగ వర్తించుదానఁ గాని వేఱుకాదు. అట్లే యొనర్పుఁడు.

రుక్మా—పుత్రా! నీ యభీష్టం బెట్టులుండె?

ధర్మా—జనకా! నాకు నీ యాజ్ఞాపరిపాలనంబునకన్న భాగ్యం బేమికల్గు? దేవర చిత్తానుసరణంబుగ నొనర్పుఁడు.

రుక్మా—అట్టులైన నిపుడే చని యువరాజ్యపట్టాభిషేకోత్సవము గావింతము రండు.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)



ప్రవేశము- రుక్మాంగదుఁడు, గుణనిధి, సంధ్యావళి, మోహిని, చకోరాక్షి, పద్మగంధి ధర్మాంగదుఁడు, బ్రాహ్మణులు మొదలగువారు.

అందఱు—(ధర్మాంగదునిఁ బీఠముపైఁ గూర్చుండఁబెట్టి)

ధర్మపరిపాలనశీలా! ధ ర్మాం గ ద భూ పా లా!

చ. ధరకు ముదమ్ముఁగూర్చి, విబు ♦ ధ వ్రజముల్ సుఖులంబొనర్చి, స
త్పురుషులనాదరించి ముని ♦ ముఖ్యులపూజలొనర్చి యార్తులన్
గరుణనుబ్రోచి నిన్నుఁ గల♦కాలము నెల్లరుమెచ్చఁ బృథ్వి నీ
శ్వరకృప నేలుమయ్య నర ♦ పాలక! సజ్జనగణ్య! బాలకా. 68

క. శ్రీరమణీ ప్రియరమణా!
సారసదళనయన! మోక్ష ♦ సాధననిపుణా!
సారాశ్రితభవతరణా!
యూరీకృతభువనభరణ ♦ యురగపశయనా. 69

మాలిని.

శ్రితజనపరిపోషా ♦ సిద్ధచేతోవిశేషా
పతితజనవిశోషా ♦ భాస్వర·ద్దివ్యవేషా
అతులిత మృదుభాషా ♦ ఆర్యహృత్కంజ పూషా
కృతమఃశివరభూషా ♦ కీర్తితాపారతోషా. 70

([32] అందఱును ధర్మాంగదునిపైఁ బువ్వములు చల్లుచున్నారు.)

గద్య.

శ్రీమ దుమారమణ కరుణా కటాక్ష పాత్ర శ్రీవత్ససగోత్ర బేతపూడి
వంశ క్షీరపారావార రాకాసుధాకర మల్లేశ్వరామాత్యపౌత్ర,
నిరంతర శివారాధనపరాయణ లక్ష్మీనారాయణామాత్య
చతుర్థపుత్ర, గుణకదంబ లక్ష్మాంబాగర్భ సంభూత,
సుజనవిధేయ, భగవంతాభిధేయ ప్రణీతం
బైన రుక్మాంగద నాటకంబున నిది
షష్ఠాంకము.

సంపూర్ణము.

